




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



బైడెన్ శాంతి సూత్రానికి భద్రతామండలి ఆమోదం

రెవెన్యూ పెంచేందుకు చర్యలు తీసుకోండి

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

లోపలి పేజీల్లో...



సంపుటి 07, సంచిక: 191 | బుధవారం | 12-06-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00


## నీట్ కౌన్సిలింగ్‌పై స్టేకు సుప్రీం తిరస్కృతి

### కేంద్రం, ఎన్‌టిఎలకు సుప్రీం నోటీసులు




**న్యూఢిల్లీ:** నీట్‌–యుజి పరీక్షల నిర్వహణలో దాని పవిత్రతకు భంగం వాటిల్లిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నీట్‌–యుజి పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు ముందుగానే బహిర్గతమయ్యానీ, అక్రమాలు, అవకతవకలు జరిగాయనీ, మళ్ళీ ఈ పరీక్షలు నిర్వహించాలనీ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) రెండూ సమాధానం చెప్పాలని కోరుతూ సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో సంజాయిషీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రానికీ, ఎన్‌టిఎకూ నోటీసులు జారీ చేసినప్పటికీ ఎంబిబిఎస్, బిడిఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విజేతల కౌన్సిలింగ్‌పై స్టే మంజూరు చేసేందుకు తిరస్కరించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాలతో కూడిన వేసవికాల ధర్మాసనం తరువాయి 2లో

## బడి గంటలు మోగే వేళాయే

- రాష్ట్రవ్యాప్తంగా నేటినుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- మొదటిరోజే విద్యార్థులకు యూనిఫాంలు
- దేశంలో కొత్త ఒరవడికి రేవంత్ సర్కార్ శ్రీకారం
- కుట్టు కూలీ జతకు రూ.50 నుండి రూ.75 లకు పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్

నేటి నుంచి బడి గంటలు మోగనున్నాయి. దీర్ఘకాలిక వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు నూతన ఉత్సాహంతో పై తరగతి గదుల్లోకి తమ బుడి బుడి అడుగులు వేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. జయశంకర్ బడి బాట పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకున్నారు. దీంతో గతంతో పోల్చితే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధికారవర్గాల సమాచారం. అదేవిధంగా విద్యార్థులకు మొదటి రోజే స్కూల్ యూనిఫామ్‌లను, పాఠ్యా పుస్తకాలను సైతం అందుబాటులో ఉంచారు. వీటికి తోడు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలను కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి తరువాయి 2లో






విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో..

## మాజీ సిఎం కెసిఆర్‌కు నోటీసులు

### కమిషన్‌కు వివరణ ఇచ్చేందుకు గడువు కోరిన కెసిఆర్

### వివరణను బట్టి నేరుగా విచారణకు పిలుస్తాం: జస్టిస్ నరసింహా రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు(కెసిఆర్)కు పవర్ కమిషన్ నోటీజులు జారీ చేసింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన విద్యుత్ ఒప్పందాలలో తన పాత్రను తెలియచేయాలని ఆయన్ని నోటీసుల్లో కమిషన్ కోరింది. పవర్ కమిషన్ నోటీసుల ప్రకారం జూన్ 15వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. అయితే జూలై 30వ తేదీ వరకు సమాధానం ఇవ్వడానికి సమయం కావాలని కెసిఆర్ అడిగారు. కెసిఆర్ ఇచ్చే వివరణను బట్టి నేరుగా విచారణకు పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన ఇచ్చే సమాధానం సంతృప్తిగా లేకపోతే ప్రత్యక్ష విచారణకు పిలుస్తామని జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని, జస్టిస్ నరసింహా రెడ్డి నేతృత్వంలోని జ్యుడిషియల్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో విచారణ చేపట్టిన విషయం తెల్సిందే. రెండు రోజులుగా బిఆర్ఎస్ హయంలో పనిచేసిన కొంతమంది అధికారులను విచారణకు పిలిచి, వివిధ అంశాలపై కమిషన్ ప్రశ్నించామని జస్టిస్ నరసింహా రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ బిఆర్‌కె భవన్‌లోని పవర్ కమిషన్ కార్యాలయంలో ఆయన తరువాయి 2లో

## యూనివర్సిటీలలో ఏటా రెండుసార్లు అడ్మిషన్‌లు

### ఈ ఏడాది నుండే అమలు చేయొచ్చు : యుజిసి చైర్మన్

**న్యూఢిల్లీ :** విదేశీ యూనివర్సిటీల తరహాలో భారతీయ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు కూడా ఏటా రెండు సార్లు అడ్మిషన్‌లు కల్పించే అవకాశం కోసం ప్రణాళికను సిద్ధం చేసినట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీశ్ కుమార్ తెలిపారు. ప్రస్తుత 2024–25 విద్యా సంవత్సరం నుండి జూలై – ఆగస్టు, జనవరిలో రెండు సార్లు ప్రవేశాలకు తరువాయి 8లో

## మోస్తరు నుంచి భారీ వర్షాలు



### హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు. నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయన్నారు. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి అకోల, పుసాద్, తరువాయి 8లో

## మీది మంత్రిమండలి కాదు.. 'కుటుంబ మండలి'

### మోదీ క్యాబినెట్‌లో 20 మంది రాజకీయ వారసులు

### పేర్లను 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రాహుల్

**న్యూఢిల్లీ :** నిత్యం తమను ఉద్దేశించి కుటుంబ పాలన అని విమర్శించే ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విరుచుకు పడ్డారు. కేంద్ర మంత్రుల్లో 20 మంది రాజకీయ వారసుల జాబితాను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం పోస్ట్ చేశారు. ఇది మంత్రి మండలి కాదని, కుటుంబ మండలి అని ఎద్దేవా చేశారు. మాటలకు, చేతలకు తేడా ఉండడాన్నే నరేంద్ర మోదీ అని అంటారని అన్నారు. తరతరాలు సంఘర్షణ, సేవ, బలిదానాల పరంపరను కుటుంబపాలన అనే వ్యక్తి (మోదీ).. తన ప్రభుత్వ కుటుంబానికి విల్లు ద్వారా అధికారాన్ని పంపిణీ చేశారని పేర్కొన్నారు. తన పోస్టులో కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న రాజకీయ కుటుంబ వారసుల తరువాయి 2లో


"परिवार मंडल"
NDA का मंत्रिमंडल

HD Kumaraswamy
Jyotiraditya Scindia
Kiren Rijiju
Raksha Khadse
Jayant Chaudhary
Chirag Paswan
JP Nadda
Kamlesh Paswan
Ram Nath Thakur
Ram Mohan Naidu
Jitin Prasada
Shantanu Thakur
Rao Inderjit Singh
Piyush Goyal
Kirti Vardhan Singh
Virendra Kumar Khatik
Ravneet Singh Bittu
Dharmendra Pradhan
Anupriya Patel
Annapurna Devi



## నిబద్ధతతో పని చేయండి

### ప్రజల మన్ననలు పొందండి

### ట్రైనీ ఐఎఎస్ అధికారులతో సిఎం, డిప్యూటీ సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్నలను పొందాలని శిక్షణలో ఉన్న 2023 బ్యాచ్‌కి చెందిన ఐఎఎస్ అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు హిత బోధ చేశారు. మంగళవారం సచివాలయంలో శిక్షణ పొందుతున్న తెలంగాణ కేడర్ కు చెందిన ఐఎఎస్–2023 బ్యాచ్ అసిస్టెంట్ కలెక్టర్లతో సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వేరు వేరుగా మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. డైరెక్టర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తరువాయి 2లో

## ఇండియా కూటమి బలం పెరిగింది

### కాంగ్రెస్‌కు ముగ్గురు ఇండిపెండెంట్‌ల మద్దతు

### లోక్‌సభలో 237కు చేరిన 'ఇండియా' సంఖ్య



**న్యూఢిల్లీ :** ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో 99 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరిగింది. ఇండిపెండెంట్‌గా గెలుపొందిన ముగ్గురు లోక్‌సభ సభ్యులు వేర్వేరుగా ఆ పార్టీ అగ్రనాయకులను గెలిసి మద్దతు ప్రకటిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ బలం వంద దాటి 102 చేరిందనుకోవచ్చు. అయితే సాంకేతికంగా ఆ సంఖ్య 99 సభ్యులుగానే ఉండనుంది. ఫిరాయింపు నిరోధక చట్టం నిబంధనల ప్రకారం ఇండిపెండెంట్‌గా తరువాయి 2లో

## ఎపి సిఎంగా నేడు చంద్రబాబు ప్రమాణం



**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు. కూటమిలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. కార్యక్రమం నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బుధవారం విమాన ప్రయాణికులు ఉదయం 9.30 గంటల్లోపే చేరుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీ కాంత రెడ్డి సూచించారు. ప్రయాణికుల విమానాలేవీ రద్దు చేయలేదని.. అన్నీ యథాతథంగా నడుస్తాయని తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, షిర్డీ వెళ్లే విమానాలు యధావిధిగా బయల్దేరతాయని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విమానాశ్రయ పరిసరాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

**ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి.. కూటమి నేతలు**

ఇదిలా ఉండగా, ఎపి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కూటమి నేతలు కలిశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ కూటమి ఎమ్మెల్యేల మద్దతు లేఖను అందజేశారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు తరువాయి 8లో

## ఒడిశా కొత్త సిఎంగా మోహన్ చరణ్ మాఝీ

### నేడు ప్రమాణ స్వీకారం



**భువనేశ్వర్ :** ఒడిశా కొత్త ముఖ్యమంత్రి ఎవరనే విషయంపై ఉత్కంఠకు తెర పడింది. మోహన్ చరణ్ మాఝీని సిఎంగా ప్రకటించింది బిజెపి అధిష్ఠానం. ఈ మేరకు మంగళవారం భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో పార్టీ శాసన సభా పక్ష నేతగా మోహన్ చరణ్ మాఝీని ఎన్నుకున్నారు ఎమ్మెల్యేలు. ఈ భేటీకి బిజెపి అధిష్ఠానం తరపున పర్యవేక్షకులుగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, భూపేంద్ర యాదవ్ హాజరయ్యారు. కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరీదా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టనున్నారని తెలిపారు.

**ఎవరీ మోహన్ చరణ్ మాఝీ?**

రాష్ట్రంలో కమలదళ సీనియర్ నేతల్లో ఒకరైన మాఝీ ఇప్పటివరకు తరువాయి 2లో




## నైజీరియా గ్రామంపై గన్‌మెన్ దాడి : 50 మంది హతం

**అబుజా :** వాయువ్య నైజీరియా గ్రామం యార్గోజేలో ఒక తుపాకీ గ్యాంగ్ దాడిచేసి జరిపిన కాల్పుల్లో 50 మంది మరణించారు. దాంతోపాటు పిల్లలు, మహిళలు సహా లెక్కలలేనంతమందిని కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. ఇంత కుముందు కూడా నైజీరియాలో 250 మంది స్కూలు పిల్లలను కిడ్నాప్ చేశారు. ఇప్పుడుకూడా అదే తరహాలో ఈదారుణం జరిగింది. దేశాధ్యక్షుడు బోలా తిమురు ఏడాది క్రితం అధికారంలోకి వచ్చినప్పుడు దేశ ప్రజలకు భద్రత ఇస్తామని మాట ఇచ్చారు. కానీ హంతక ముఠాలు ఇంకా చెలరేగిపోతూ గ్రామాల్లో బీభత్సం సృష్టిస్తూనే ఉన్నాయి. తుపాకీ గ్యాంగ్‌లను ప్రభుత్వం అదుపు చేయలేకపోతున్నది. ఆదివారం రాత్రి కట్సినా రాష్ట్రం కంకర ప్రభుత్వ పరిధిలోని యార్గోజే గ్రామంపై డజర్ల సంఖ్యలో మోటారు సైకిళ్ళపై తుపాకీ గ్యాంగ్ దాడి చేసి విచ్చలవిడిగా కాల్పులు జరిపింది. ఈదాడులలో 50 మంది మరణించగా లెక్కలేనంతమందిని వారు కిడ్నాప్ చేసి తీసుకువెళ్ళారు. గామంపై పడి దుకాణాలను లూటీ చేశారని స్థానికులు బాధతో చెప్పారు. 2020 డిసెంబరులో కంకర శివారులోని సెకండరీ స్కూలు నుండి 300 మంది పిల్లలను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. వీరంతా ఆడపిల్లలే.

## వలస బోటు మునక.. 49మంది మృతి, 140మంది గల్లంతు

**సనా :** వసల ప్రయాణికులకు అక్రమంగా తరలిస్తున్న ఒక బోటు యెమెన్ జలాల్లో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 49మంది మరణించారు. మరో 140మంది గల్లంతు అయ్యారు. వారి జాడ తెలియలేదు. వారికోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రాణాలతో బయట పడిన 71 మందికి సహాయం అందిస్తున్నారు. వీరిలో ఎనిమిదిమంది పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో వారిని ఆసుపత్రులకు తరలించారు. తీరం చేరకముందే బోటు ప్రమాదంలో చిక్కుకుంది. మత్స్యకారులు, స్థానికులు కొంతమందిని కాపాడారు. ఐక్యరాజ్యసమితికి కూడా ఈ విషయాన్ని వెంటనే తెలియజేసినట్లు రుడమ్ జిల్లా డైరెక్టర్ హడి అల్ ఖుర్మా చెప్పారు. ప్రమాదం నుండి బయటపడినవారు చెప్పిన కథనం ప్రకారం ఈ బోటులో 260 మంది ప్రయాణం చేస్తున్నారు. మలావీ తీర జలాల్లో నీట ముగిపోయిందని ఇంటర్నేషనల్ మైగ్రేషన్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ)ఒక ప్రకటనలో తెలియజేసింది. సముద్రంలో బోటు ప్రయాణిస్తుండగా సోమవారం పెనుగాలులమధ్య చిక్కుకుని తలకిందులైంది. ఏడెన్‌కు తూర్పుగా ఉన్న రుడమ్ డైరెక్టర్ చెప్పిన సమాచారం ప్రకారం ఈ బోటులో ప్రయాణిస్తున్న ఎక్కువమంది ఇథియోపియాకి చెందినవారే.

## మాకు రక్షణ ఇవ్వండి : జెలెన్‌స్కీ

**బెర్లిన్ :** తమ దేశానికి గగనతల దాడుల నుండి రక్షణ కల్పించాలని యూరోపియన్ యూనియన్ దేశాలకు ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో రెండు రోజుల పర్యటనకు వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ జరిగిన ఒక సదస్సులో ప్రసంగించారు. ఉక్రేన్ పునరుద్ధరణకోసం జర్మనీ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో జెలెన్‌స్కీ మాట్లాడారు. ఉక్రేన్ పునరుద్ధరణకు పది బిలియన్ డాలర్లు తక్షణం కావాలనీ, ఏటా 30 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయన్నారు. యుద్ధంలో రష్యా సగానికి సగం ఉక్రేన్‌ను నాశనం చేసిందనీ, ఇంధన వనరులు, విద్యుత్ సరఫరా లైన్లు, ఇతర మౌలిక సదుపాయాలన్నీ ధ్వంసమయ్యాయనీ జెలెన్‌స్కీ అన్నారు. తమ గగనతల రక్షణకు అదనంగా పాట్రియేట్ క్షిపణలు మరో తొమ్మిది అవసరం అవుతాయని, వాటిని ఇవ్వాలని కోరారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఉక్రేన్‌కు భారీ ఆయుధాలు సరఫరాచేసేందుకు ఇప్పటివరకూ ఉన్న ఆంక్షలను ఎత్తివేశారు. ఫ్రాన్స్ కూడా మిరేజ్–2000 యుద్ధ విమానాలను సరఫరా చేసేందుకు అంగీకరించింది. ఇంకోవైపు జెలెన్‌స్కీ దేశంలో డ్రోన్ల సైన్యాన్ని ప్రత్యేకంగా తయారు చేశారు. డ్రోన్లకోసం ప్రత్యేకించి కమాడర్‌ను నియమించారు. డోన్లతోనే రష్యాను తాము దెబ్బతీశామని జెలెన్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు.

# బైడెన్ శాంతి సూత్రానికి భద్రతామండలి ఆమోదం

**జెనీవా :** ఇజ్రాయిల్–పాలస్తినా మధ్య సయోధ్యకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఏకపక్షంగా ప్రతిపాదించిన మూడు దశల శాంతి సూత్రానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారంనాడు తీర్మానం ఆమోదించింది. 15 మంది సభ్యులుగల భద్రతా మండలిలో 14–0 ఓట్ల తేడాతో ఈ తీర్మానం ఆమోదం పొందింది. భద్రతామండలిలో ఒక్క రష్యా తప్ప అన్ని సభ్యదేశాలు ఈ తీర్మానానికి ఆమోదం తెలియజేయగా, రష్యా ఈ ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. భద్రతామండలిలో సభ్యదేశాలు ఇజ్రాయిల్–పాలస్తినా రెండు సయోధ్యతో కాలం వెళ్ళదీసేందుకు సహకరించాలన్నది కూడా బైడెన్ శాంతి ప్రతిపాదనల్లో ఒక అంశం. ఈ తీర్మానంలో ఏడు అంశాలు ఉండగా మొట్టమొదటిది హమాస్‌ను ఒప్పందానికి, కాల్పుల విరమణకు ఒప్పించడమే ప్రధాన అంశంగా ఉంది. ఐతే ఇప్పటివరకూ అటు హమాస్‌గానీ, ఇటు ఇజ్రాయిల్ గానీ సానుకూలంగా స్పందించలేదు. ఎలాంటి షరతులూ, ఆంక్షలు, ఆలస్యాలు లేకుండా ఈ శాంతి ప్రతిపాదనను హమాస్ అమలు చేయాలన్నదే అమెరికా వాదన. అమెరికాలో ఎన్నికలు దగ్గర పడటం, ఇజ్రాయిల్‌పట్ల అనుసరిస్తున్న వైఖరి గురించి బైడెన్‌పై ఓటర్లలో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో భద్రతామండలి మద్దతు ఇవ్వాలని బైడెన్ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ తీర్మానం ఆమోదం పొందిందని విశ్లేషకుల అంచనా. ఈ తీర్మానం ప్రకారం ఆరు వారాలపాటు తొలి దశలో ఇజ్రాయిల్ – పాలస్తినా యుద్ధ విరమణ చర్యలు పాటించాలి. ఐతే చర్చలు కొనసాగినంతకాలం యుద్ధ విమరణ కూడా కొనసాగాలన్నది బైడెన్ ప్రతిపాదనల్లో ఒకటి. రెండో దశలో ఇజ్రాయిల్ వద్ద ఉన్న పాలస్తినా ఖైదీలను గాజాకు, హమాస్ వద్ద ఉన్న బందీలను ఇజ్రాయిల్‌కు అప్పగించి పరస్పర ఆదాన ప్రదానాలు చేసుకోవాలి. ఈ దశలో పాలసినా ప్రజలకు గాజా భూభాగంలోకి ప్రతి రోజూ 600 కు తక్కువ కాకుండా ట్రకుల్లో నిత్యావసర సరుకులను తరలించారు. ఇక మూడో దశలో గాజా పునరుద్ధరణకు సహాయ సేరణ, సహాయ కార్యక్రమాలను కొనసాగించాలి. ఐతే బైడెన్ ప్రతిపాదించిన ఈ శాంతి మంత్రంలోని అంశాలు దాదాపు కైరోలో మధ్యవర్తిత్వ దేశాలు ఆ మధ్య అనేక వారాల పాటు నిర్వహించిన చర్చల్లో ప్రతిపాదించిన అంశాలే కావడం విశేషం.






### యుద్ధ విరమణకు హమాస్ అంగీకారం...

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి బైడెన్ శాంతి ప్రతిపాదనకు తీర్మానం ద్వారా ఆమోదం తెలియజేయడంతో పాలస్తినా పాలక సంస్థ హమాస్ ఇజ్రాయిల్‌తో ఈ శాంతి ఒప్పందానికి అంగీకారం తెలియజేసింది. పాలస్తినా అధ్యక్షుడు అబ్బాస్ భద్రతామండలి తీర్మానం పట్ల హర్షం ప్రకటించారు. దీంతో చాలా వారాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు ఒక పరిష్కారం దొరికే మార్గం కనిపించింది. ఇక ఇజ్రాయిల్ కూడాఅనివార్యంగా ఈ ఒప్పందాన్ని అంగీకరించాల్సిందే. హమాస్ సీనియర్ అధికారి సమీ అబూ జహ్రి మంగళవారంనాడు రాయిటర్స్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, భద్రతా మండలి తీర్మానానికి కట్టుబడి ఉంటామని అన్నారు. కాగా అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఖతార్‌లో నాయకులను కలిశారు. మరోవైపు గాజాలో అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో ముగ్గురు హిజ్బుల్లాలు కకూడా మరణించారు. ఇప్పటివరకూ ఎనిమిది నెలల యుద్ధంలో సగానికి సగం గాజా సర్వనాశనమైందనీ ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. గత ఏడాది అక్టోబరు 30 నుండి ఇప్పటివరకూ గాజా యుద్ధంలో 37,124 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. మరో 84,712 మంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో రెండు ఆసుపత్రులను కూడా ఐక్యరాజ్యసమితి పునరుద్ధరిచడంతో ఈ ఆసుపత్రులు పనిచేయడం ప్రారంభించాయి.

## ఫ్రెంచ్ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీలు ఐక్య పోటీ

**పారిస్ :** ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీకి ఈనెల 30, జులై 7 వ తేదీల్లో రెండు విడతలుగా జరిగే ఎన్నికల్లో వామపక్షాలన్నీ ఐక్యంగా పోటీ చేయనున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌పై దేశంలో వ్యతిరేకత వచ్చిందని, యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో కరడుగట్టిన మితవాదులే పైచేయి సాధిస్తారనీ ముందస్తు సంకేతాలు, ఫలితాలు కూడా రావడంతో మేక్రాన్ తన 'రెనైజాన్స్' పార్టీకి మరింత ఎన్నికల నష్టం వాటిల్లకుండా మూడేళ్ళు ముందుగానే సోమవారం నాడు ఆకస్మిక మెరుపు ఎన్నికలు ప్రకటించారు. దేశంలో పలు పేర్లతో ఉన్న కమ్యూనిస్టు, ప్రగతిశీలపార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా పోటీ చేయాలని ప్రతిజ్ఞ చేశాయి. ఆ మేరకు పావులు కదుపుతున్నాయి. ఈ మెరుపు ఎనికల్లో కమ్యూనిస్టు పార్టీలు ఉమ్మడి అభ్యర్థిని ఎంపిక చేసుకుని ఓట్లు చీలకుండా గెలుపు అవకాశాలవైపు పరుగు తీయాలన సోమవారం రాత్రి పొద్దుపోయాక జరిపిన సమావేశంలో వామపక్షాల నాయకులు నిర్ణయించారు. దేశంలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు, గ్రీన్స్ పార్టీలు విడివిడిగా ఉన్నాయి. ఈ పార్టీల నాయకులు ఒక సంయుక్త ప్రకటన చేస్తూ మేక్రాన్‌పైన, కరడుగట్టిన పచ్చి మితవాదులపైన పోటీ చేస్తామని పేర్కొన్నారు. ఫస్ట్ రౌండ్ ఓటింగ్‌లో ప్రతి ఎలక్ట్రోరల్ జిల్లా నుండీ ఒక ఉమ్మడి అభ్యర్థిని పోటీలో నిలబెడతామని ప్రకటించారు. నేషనల్ అసెంబ్లీలో లీ పార్టీ సోషలిస్ట్ అధ్యక్షుడు బోరిస్ వ్యాల్లాడ్, పార్టీ ఫస్ట్ సెక్రటరీ ఆలివర్ ఫాయుర్, ఫ్రెంచ్ కమ్యూనిస్టుపార్టీ పి సి ఎఫ్ అధ్యక్షుడు నిగ్యన్ పూ త్రోంగ్, జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌస్సెల్, గ్రీన్స్ పార్టీ అధ్యక్షుడు డొమినిక్ వోయంట్ తదితరులు ఈ సంయుక్త ప్రకటన చేశారు. కాగా దేశంలో ఈ ఆకస్మిక ఎన్నికలవల్ల అధికార రెనైజాన్స్ పార్టీకి ఈ మెరుపు ఎన్నికల్లో ఎలాంటి నష్టం వాటిల్లకుండా చేయాల్సినదంతా చేస్తామని ఫ్రెంచ్ ప్రధాన మంత్రి అత్తల్ అన్నారు. కాగా ఫ్రాన్స్‌లో ఎన్నికల ప్రకటన అనతరం జరిగిన తొలి విడత సర్వేలో మితవాద నేషనల్ ర్యాలీ పార్టీ భారీ మెజారిటీ లేకపోయినాగానీ అధికారం చేజిక్కించుకుంటుందని ఫలితాలు వెలువడ్డాయి. యూరోయిన్ యూనియన్ ఎన్నికల్లో కూడా ఈ పార్టీలో ఆధిపత్యం సాధించింది.










## విమాన ప్రమాదంలో మలావీ ఉపాధ్యక్షుడు దుర్మరణం

### అంత్యక్రియలకు వెళుతుండగా విషాదం

**మలావీ :**ఆగ్నేయ ఆఫ్రికా దేశం మలావీ ఉపాధ్యక్షుడు సాయులోస్ చిలిమా(51) విమాన ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఆయనతోపాటు విమానంలో మరో తొమ్మిదిమంది ఉన్నారు. క్యాబినెట్ మంత్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. దేశ మాజీ తొలి మహిళ షనిల్ జింబిరి కూడా ఇదే విమానంలో ఉన్నారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం సోమవారం ఉదయం అదృశ్యమైంది. విమానం కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం చికంగవా అడవుల్లో విమాన శకలాలను కనుగొన్నారు. ప్రయాణికుల్లో ఎవరూ సజీవంగా లేరు. మూడు రోజుల క్రితం మరణించిన మలావీదేశ క్యాబినెట్ మంత్రి రాల్ఫ్స్ కసంబర అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఉపాధ్యక్షుడు చిలిమా రక్షణ దళ విమానం సోమవారం ఉదయం దేశ రాజధాని లిలోంగ్వే నుండి బయలుదేరి కొద్దిసేపటికే రాడార్ స్క్రీన్ నుండి మాయమైపోయింది. ఉత్తర ప్రాంతంలోని ఎంజుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన విమానం దిగి ఉంటుందని అంతా భావించారు. క్యాబినెట్ మంత్రి అంత్యక్రియలు జరిగే ప్రదేశం ఈ ఎంజుజు విమానాశ్రయానికి చాలా సమీపంలో ఉంటుంది. పది సంవత్సరాలుగా మలావా ఉపాధ్యక్షుడుగా చిలమా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దేశాధ్యక్షుడు లాజరస్ చాక్వేరా, ఉపాధ్యక్షుడు చిలిమా ఇద్దరూ వేరు వేరు పార్టీలకు చెందిన వారైనప్పటికీ వారిద్దరు ఒక బృందంగా జతకట్టి 2020 ఎన్నికల్లో కూటమిగా ఏర్పడ్డారు. ఆయన మరణం తనకు తీరని లోటు అని దేశాధ్యక్షుడు చాక్వేరా తీవ్ర సంతాపం ప్రకటించారు. తన జీవితంలో ఆయన ఒక కీలకమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు చిలిమికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దేశ ఉపాధ్యక్ష పదవి చేపట్టక ముందు కోకో కోలా, యూనిలివర్ వంటి బహుళజాతి కంపెనీల్లో కీలకమైన నాయకత్వస్థానాల్లో చిలిమా బాధ్యతలు నిర్వహించారు. ఆయనను పనిరాక్షసుడుగా, కార్యసాధకుడుగా దేశంలో మంచి పేరు సంపాదించారు. ఐతే 2022లో సాయిలోస్ చిలిమాపై అవినీతి ఆరోపణలు కూడా వచ్చాయి. ఆయన లంచం తీసుకుని కాంట్రాక్టులను కేటాయించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2014 నుండి ఆయన దేశ ఉపాధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు.



## నిబద్ధతతో పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)



టు స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ ఐఏఎస్, ట్రైనీ ఐఏఎస్ అధికారులను సిఎం, డిప్యూటీ సిఎంలకు పరిచయం చేశారు. శిక్షణలో ఉన్న అధికారులకు కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు నిర్వహించిన విధుల గురించి సిఎం, డిప్యూటీ సిఎంలకు ఆయన వివరించారు. భగవంతుడు ప్రజలకు చేసేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడం వల్లనే చేసే ఉద్యోగానికి సంతృప్తి దొరుకుతుందని సిఎం, డిప్యూటీ సిఎం వారితో అన్నారు. శిక్షణలో ఉన్న సమయంలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి లోతుగా అధ్యయనం చేయడం వల్ల ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం తెలుసుకున్న అంశాలను పరిగణలోకి తీసుకొని పరిపాలనలో తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజా సమస్యలు పరిష్కరించడం సులువు అవుతుందన్నారు. భౌగోళికంగా, వాతావరణం విషయంలో తెలంగాణ రాష్ట్రం చాలా బాగుంటుంది అని, ప్రజల సహకారం కూడా మంచిగా లభిస్తుందన్నారు. శిక్షణ కాలంలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు నిర్వహించిన విధులు, వారు చేసిన అధ్యయనం గురించి సిఎం, డిప్యూటీ సిఎంలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్ ఐఏఎస్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన, తదితరులు ఉన్నారు.

## మోహన్ చరణ్ మాఝీ

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఈయన, గతంలో చీఫ్ విప్‌గా పనిచేశారు. ఈ సారి ఎన్నికల్లో కియోంజర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిజెడి అభ్యర్థి మీనా మాఝీపై 11,577 ఓట్ల తేడాతో గెలిచారు.

**ప్రమాణ స్వీకారానికి మోదీ హాజరు....**మరోవైపు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం బుధవారం సాయంత్రం 5గంటలకు జనతా మైదానంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఆయనతోపాటు మరి కొందరు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. పూరి జగన్నాధుడికి, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ఆహ్వాన లేఖలు అందజేసినట్లు బిజెపి తెలిపింది. ఈ వేడుకకు సుమారు లక్ష మంది పాల్గొంటారన్న అంచనా వేస్తున్నారు. అయితే తొలుత జూన్ 10న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని భావించినప్పటికీ దానిని 12కు వాయిదా వేశారు.

## బలం పెరిగింది (మొదటి పేజీ తరువాయి)

గెలిచిన ఎంపిలు ఏదైనా పార్టీలో చేరితే తక్షణమే తమ లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతారు. కాంగ్రెస్ టికెట్ లభించకపోవడంతో మహారాష్ట్రలోని సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచిన మాజీ సిఎం వసంతరావు పాటిల్ మనవడు విశాల్ పాటిల్ వారం రోజుల క్రితం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిసారు. బిహార్‌లోని పూర్ణియా స్థానం నుండి ఇండిపెండెంట్‌గా గెలిచిన ఎంపి పప్పు యాదవ్ కూడా మంగళవారం నాడు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని కలిసి తన మద్దతు తెలియజేశారు. తాజాగా లద్ధాక్ నుండి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్, బిజెపిలను ఓడించిన హానీఫా సైతం కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్‌గాంధీని మంగళవారం కలిసారు. ఏడుగురు ఇండిపెండెంట్ ఎంపిలలో ముగ్గురు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. వీరి మద్దతుతో లోక్‌సభలో ఇండియా కూటమి బలం 234 నుండి 237కు పెరిగినట్లయింది.

## స్టేకు సుప్రీం తిరస్కృతి

(మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్లు చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుంటూ, ఈ పరీక్షల నిర్వహణకు గల పవిత్రను కాపాడేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఏం చేయాలనుకుంటున్నదో చెప్పాలని కోరింది. ఈ పరీక్షల నిర్వహణలో ఇప్పటివరకూ ఉన్న లోపరహిత విధానానికి భంగం వాటిల్లిందని, అందువల్ల ఈ విషయంపై ఎన్‌టిఏ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందనీ ధర్మాసనం పేర్కొంది. కేంద్రం, ఎన్‌టిఏలతోపాటు ఈ పరీక్షల నిర్వహణలో ఇంకా బాధ్యులైన బీహార్ ప్రభుత్వానికి కూడా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ''పునఃప్రారంభానికి తక్షణం మీకు ఎంత గడువు కావాలి? లేకపోతే కౌన్సిలింగ్‌ను ప్రారంభించండి'' అని ధర్మాసనం సూచించింది. శివాంగి మిశ్రా, మరో తొమ్మిది మంది ఎంబిబిఎస్ ప్రవేశం కోరుకునే అభ్యర్థులు దాఖలు చేసిన పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను కూడా ఈ కేసును అనుసంధానం చేసింది. కౌన్సిలింగ్ ప్రారంభయ్యేలోపే సమాధానం చెప్పాలని ఎన్‌టిఏను ధర్మాసనం ఆదేశించింది. మే 5వ తేదీన 2024 నీట్–యుజి పరీక్ష జరిగింది. జూన్ 4న పరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయి. జూన్ 14న ప్రకటిస్తారని ముందు భావించారు. ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుశ్, ఇతర సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌టిఏ ఈ పరీక్ష నిర్వహించింది.

**నీట్ పిజి–2022పై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు**

2022వ సంవత్సరంలో జరిగిన నీట్–పిజి పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలు జరిగాయని దానిపై పరిశీలన జరపాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. మెడికల్ సైన్సెస్‌లోని వివిధ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు 2022లో నిర్వహించిన పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, వాటి తాలూకూ ఆన్సర్ కీలు, ఆన్సర్ షీట్లు బహిర్గతం చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాలతో కూడిన వేసవికాల ధర్మాసనం తిరస్కరించింది. 2022లో ప్రీతిష్ కుమార్, ఇతరులు పేర్లతో దాఖలైన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది.

## 'కుటుంబ మండలి'

(మొదటి పేజీ తరువాయి)

పేర్లను, వారి బంధుత్వాలను రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. కేంద్రమంత్రివర్గ సభ్యులు హెచ్.డి.కుమారస్వామి (మాజీ ప్రధాని హెచ్.డి.దేవేగౌడ కుమారుడు), జ్యోతిరాదిత్య సిందియా (కేంద్ర మాజీ మంత్రి మాధవరావు సింధియా కుమారుడు), కిరణ్ రిజిజు (అరుణాచల్ ప్రదేశ్ ప్రొటెం స్పీకర్ రిచిన్ ఖారు కుమారుడు), రక్షా ఖడ్సా( మహారాష్ట్ర మాజీ మంత్రి ఎక్‌నాథ్ ఖడ్సే కుమార్తె), జయంత్ చౌధురి(మాజీ ప్రధాని చౌధురి చరణ్ సింగ్ మనవడు), చిరాగ్ పాశ్వాన్ (కేంద్ర మాజీ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు), జె.పి.నడ్డా(మధ్యప్రదేశ్ మాజీ మంత్రి జయశ్రీ బెనర్జీ అల్లుడు), కమలేశ్ పాశ్వాన్ (ఎంపిగా పోటీ చేసిన ఓం ప్రకాశ్ పాశ్వాన్ కుమారుడు), రామ్‌నాథ్ ఠాకూర్ (బిహార్ మాజీ సిఎం కర్పూరీ ఠాకూర్ కుమారుడు), రామ్‌మోహన్‌నాయుడు (కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు కుమారుడు), జితిన్ ప్రసాద(మాజీ ఎంపి జితేంద్ర ప్రసాద కుమారుడు), శంతను ఠాకూర్ (పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి మంజుల్ కృష్ణ ఠాకూర్ కుమారుడు), రావు ఇందర్‌జిత్ సింగ్ (హర్యానా మాజీ సిఎం రావు బీరేంద్ర సింగ్ కుమారుడు), పీయూష్ గోయల్ (కేంద్ర మాజీ మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు), కీర్తి వర్ధన్ సింగ్(యుపి మాజీ మంత్రి మహారాజ్ ఆనంద్ సింగ్ కుమారుడు), వీరేంద్ర కుమార్ ఖాతిక్ (మధ్యప్రదేశ్ మాజీ మంత్రి గౌరీశంకర్ షేజ్‌వార్ బావమరిది), రణ్‌వీత్ సింగ్ బిట్టు (పంజాబ్ మాజీ సిఎం బియాంత్ సింగ్ మనవడు), ధర్మేంద్ర ప్రధాన్ (కేంద్ర మాజీ మంత్రి దేబేంద్ర ప్రధాన్ కుమారుడు), అనుప్రియా పటేల్ (బిఎస్‌పి, అప్నాదళ్ వ్యవస్థాపకుడు సోనేలాల్ పటేల్ కుమార్తె), అన్నపూర్ణ దేవి (బిహార్ మాజీ ఎంఎల్‌ఏ రమేశ్ ప్రసాద్ యాదవ్ భార్య)

## రియల్‌ఎస్టేట్ పేరుపై రూ.10కోట్లు టోకరా

### న్యాయవాదితో పాటు మరో ముగ్గురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే 200 శాతం లాభాలు వస్తాయని నమ్మించిన ఓ ఘరానా కుటుంబం ఏకంగా రూ.10 కోట్లు టోకరా వేసింది. ఏకంగా 30 మంది బాధితులు హైదరాబాద్ సిసిఎస్ డిసిపి ఎన్.శ్వేతను కలిసి ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగు చూసింది. మోసానికి పాల్పడిన నలుగురు నిందితులలో ముగ్గురు కుటుంబ సభ్యులుకాగా మరోకరు న్యాయవాది ఉండడం గమనార్హం. ఈ నలుగురిని మంగళవారం సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. డిసిపి శ్వేత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మొల్ల శివయ్య, అతని భార్య స్వర్ణలత, కుమారుడు మెల్ల జశ్వంత్‌లు యూట్యూబ్ ఛానెల్‌లో మీ మాంస, రీబూల్ పేరుతో ఆకర్షణీయమైన శీర్షకలు, ప్రకటనలతో వినియోగదారులను ఆకట్టుకునేవారు. ఈ ముగ్గురు కలిసి వీరి వద్దకు వచ్చే వినియోగదారులకు ఇండోర్, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించేవారు. శిక్షణకు వచ్చే ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాయలు వసూలు చేసేవారు. శిక్షణ సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే 200 శాతం లాభాలు వస్తాయని నమ్మించేవారు. ఉదాహరణకు బ్యాంకు సీజ్ చేసిన ఆస్తులను వేలం పాటలో దక్కించుకుంటే మరిన్ని లాభాలు వస్తాయని నమ్మించారు. ఇలాంటి ఆస్తులు దక్కించుకునేందుకు తాము సహకరిస్తామని చెప్పారు. వీరి మాటలు నమ్మిన సుమారు 30 మంది బాధితులు వీరికి రూ.10 కోట్లు అందజేశారు. బాధితులను నమ్మించేందుకు గ్యారంటీగా యూ ట్యూబ్ ఛానల్‌కు చెందిన చెక్కులను కూడా అందజేశారు. ఆ తరువాత తమకు బ్యాంక్ వేలం వేసిన ఆస్తులు ఇవ్వాలని సూచించడంతో వారు చేతులెత్తేశారు.దీంతో బాధితులు హైదరాబాద్ సిసిఎస్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఈ ముగ్గురు సభ్యుల కుటుంబ సభ్యులు చేసిన మోసంలో న్యాయవాది శ్రీనివాస్ కూడా ఉన్నాడని తేలింది. దీంతో ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాపై గతంలో ఎల్‌బినగర్, బాచుపల్లి పోలీసు స్టేషన్‌లలో కూడా చీటింగ్ కేసులు నమోదయ్యాయని పోలీసులు చెబుతున్నారు.

**ఆశపడ్డారో అంతేసంగతులు : డిసిపి శ్వేత....**తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఎవరైనా ఆశపడి ఇలాంటి వారి చేతిలో పెట్టుబడులు పెడితే మునిగిపోవడం ఖాయం. ఇలాంటి కేసులు తరచు వెలుగు చూస్తున్నా ప్రజలు మోసగాళ్ల చేతిలో బలవుతునే ఉన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు చైతన్యవంతులు కావాలి. ఎదుటి వారి మాటలను నమ్మి ఆశపడి పెట్టుబడులు పెడితే డబ్బులు రికవరీ కావడం కష్టం.

## మోగేవేళాయే..

(మొదటి పేజీ తరువాయి)

యజమాన్యాల ఫీజుల మంటకు తల్లిదండ్రులు జడుసుకుంటున్నారు. వాస్తవంగా పాఠశాలల్లో ట్యూషన్ ఫీజు మినహా ఎలాంటి ఫీజులు వసూలు చేయడానికి వీలు లేదు. కానీ విద్యాశాఖ అధికారుల అలసత్వం పుణ్యమా అని ప్రతి పాఠశాలలోనూ రకరకాల ఫీజుల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఆరంభ సూరత్వం మాదిరిగా ప్రైవేట్ పాఠశాల దోపిడీని అరికట్టుతామంటూ పాఠశాల విద్యా శాఖ అధికారుల హడావుడి ప్రకటనలు తప్ప ఇప్పటివరకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో యధావిధిగానే ప్రైవేటు యాజమాన్యాలు తమ పని తాము చేసుకుంటూపోతున్నాయి. దీంతో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అధిక ఫీజులపై తల్లిదండ్రుల ఫిర్యాదులతో పాటు పేరెంట్స్ కమిటీల ఆధ్వర్యంలో ఆందోళనలతో విద్యా సంవత్సరంకు స్వాగతం పలుకుతున్నారు.

**మహిళా సంఘాలకు స్టిచింగ్ బాధ్యతలు**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు సిద్ధమయ్యాయి. యూనిఫామ్ కుట్టే పనులను దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం అప్పగించగా, స్టిచింగ్ పనులు ముగింపు దశకు వచ్చాయి. దీంతో పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాంలు అందనున్నాయి. ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు బుధవారం అందజేయనున్నారు. గతంలో స్టిచ్చింగ్ పనులను పరిమిత సంఖ్యలో టైలర్లకు అప్పగించడం వల్ల, యూనిఫాంలు ఆలస్యమయ్యేవి. పాఠశాల ప్రారంభమైన మూడు నాలుగు నెలల వరకు విద్యార్థులకు యూనిఫాంలు అందకపోయేవి. ఈ సమస్యను గుర్తించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు స్టిచింగ్ పనులను అప్పగించింది. దీంతోపాటు రూ.50 లున్న కుట్టు కూలీని రూ.75 లకు ప్రభుత్వం పెంచింది. దీంతో మహిళా సంఘాలు యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులను సవాల్‌గా తీసుకుని, సకాలంలో పూర్తి చేయగలిగాయి. రాష్ట్రంలో 64 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉండగా 18 వేల విలేజ్ ఆర్గనైషన్లు ఉన్నాయి. వారికి 15,30,603 (ఒక జత) యూనిఫామ్ లు కుట్టాలని ప్రభుత్వం ఆదేశించగా, ఇప్పటివరకు 90 శాతం యూనిఫాంలు పూర్తయ్యాయి. మహిళా సంఘాలు సహాయకులుగా ఈ పనిని చేసినందుకు ప్రభుత్వం తరుపున అభినందనలు తెలుపుతున్నాం. దానికి సుమారు రూ.50 కోట్ల స్టిచ్చింగ్ ఆదాయం, ప్రతి టా సమకూరుతుంది. మహిళా సంఘాలకు స్టిచింగ్ పనులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్పగించిన నాటి నుంచి, సకాలంలో స్టిచింగ్ పనులు పూర్తయ్యేలా రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రణాళిక బద్ధంగా వ్యవహరించారు. ఎప్పటికప్పుడు అధికారులను, మహిళా సంఘాలను సమన్వయ పరుస్తూ గడువు లోగా పాఠశాలకు యూనిఫాంలు చేరేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మొదటి రోజే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ అందజేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్టయింది. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు స్టిచ్చింగ్ పనులను అప్పగించిన సిఎం రేవంత్‌రెడ్డికి, సకాలంలో పనులు పూర్తి చేసేలా వ్యవహరించిన మహిళా సంఘాలతో పాటు అధికారులను మంత్రి సీతక్క అభినందించారు.

## కెసిఆర్‌కు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

పలు అంశాలపై మీడియాకు తెలిపారు.

**కెసిఆర్‌తో సహా 25 మందికి నోటీసులు..**

ఈ అంశంలో కెసిఆర్, మాజీ ఇంధన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలుగా పనిచేసిన అరవింద్ కుమార్, ఎస్.కె. జోషి, సురేశ్ చందా, అజయ్ మిశ్రా సహా 25 మందికి నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ నరసింహారెడ్డి చెప్పారు. ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు కెసిఆర్ జులై 30వ తేదీ వరకు సమయం కోరగా జూన్ 15వరకు వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. నోటీసులకు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకుంటే కమిషన్ ముందు విచారణకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. మూడు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి నోటీసులలో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. ఇందులో నిర్ణయాలు తీసుకున్న అధికారులు, అనధికారులు అందరికీ నోటీసులు జారీ చేశామన్నారు. వారు సమాధానం ఇచ్చారన్నారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ సంస్థల నిర్మాణం టెండరు ప్రక్రియలో కాకుండా నామినేషన్ ప్రక్రియలో వెళ్లడంతో ప్రభుత్వంపై అదనపు భారం పడినట్లు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లతో ప్రభుత్వానికి భారీగా ఆర్థిక భారం పడిందన్నారు. ఈ ఒప్పంద సమయంలో అసలు ఆ విద్యుత్ సంస్థ నిర్మాణమే జరగలేదని తమ దృష్టికి వచ్చిందని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి స్పష్టంచేశారు. సాధారణంగా రెండు రాష్ట్రాలు విద్యుత్ ఒప్పందం చేసుకున్నప్పుడు కేంద్ర రెగ్యులేటరీ కమిషన్‌కు అధికారం ఉంటుందన్నారు. కానీ, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల అంశంలో రెండు రాష్ట్రాలు ఒప్పుకుని ఛత్తీస్గఢ్ రెగ్యులేటరీ కమిషన్‌కు పూర్తి అధికారాలు ఇచ్చారన్నారు. తద్వారా విద్యుత్ కొనుగోళ్ల కోసం అత్యధికంగా చెల్లింపులు చేసినట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. టెండరు ప్రక్రియ ఎందుకు చేపట్టలేదు అని గతఅధికారులను ప్రశ్నించగా, విద్యుత్ కొరత కారణంగా అత్యవసరంగా విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని సమాధానం ఇచ్చారన్నారు.

**ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉంది..**

కాగా మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తెలిపారు. జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎస్.కె. జోషి, అరవింద్ కుమార్‌లతో మంగళవారం సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్‌గఢ్‌కు అధికారం ఇచ్చారన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి అన్నారు. ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి తెలిపారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేలైన్ వెయ్యలేదన్నారు. అధికారుల నుంచే కాకుండా ప్రముఖులు నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని అన్నారు.

## రామోజీ కుటుంబసభ్యులకు సిఎం రేవంత్‌రెడ్డి పరామర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్: రామోజీ ఫిల్మ్ సిటీలో మంగళవారం ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎంఎల్‌ఎ రాజ్ ఠాకూర్, మల్ రెడ్డి రాంరెడ్డి, మధుసుధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నిజమైన లబ్ధిదారులకే డబుల్‌బెడ్ ఇళ్లు : మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: నిజమైన లబ్ధిదారులకే డబుల్‌బెడ్ రూంలను పంపిణీ చేస్తామని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ హామి ఇచ్చారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పై సర్వే చేయాలని కోరుతూ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీమతి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్వే అనంతరం అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేయాలని వారు మంత్రి సురేఖను కోరారు. నిజమైన లబ్ధిదారులకే పథకాలు అందుతా యని వారికి మంత్రి హామి ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, గజ్వేల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ భాస్కర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య తదితరులున్నారు.

## టెస్కాబ్ చైర్మన్‌గా రవీందర్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఛైర్మన్ గా నియమితులైన మర్నేని రవీందర్ రావు మంగళవారం సెక్రటేరియట్‌లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ రవీందర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. సహకార బ్యాంకుల్లో కార్యకలాపాల కంప్యూటరీకరణ, సహకార బ్యాంకుల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న సంస్కరణలు, వ్యవసాయరంగానికి సహకార బ్యాంకులు అందిస్తున్న సహకారం తదితర అంశాలు పై ఇరువురు చర్చించారు.

## రాజాసింగ్‌ను బెదిరించిన వ్యక్తి అరెస్టు



ప్రజాపక్షం/హైదరాబాద్: గోషామహల్ బిజెపి ఎంఎల్‌ఎ రాజాసింగ్‌ను చంపేస్తానంటూ తరచు ఫోన్‌కాల్స్ చేస్తూ బెదిరింపులక పాల్పడిన నిందితుడిని హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు గుర్తించారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిసిఎస్ డిసిపి ఎన్.శ్వేత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చాంద్రాయణగుట్టలోని ఫూల్‌బాగ్‌కు చెందిన మహ్మద్ వసీం (40) ప్లస్619664800063233 నెంబర్‌తో తరచు రాజాసింగ్‌కు ఫోన్ చేసి బెదిరించేవాడని, 2023 ఎన్నికల్లోపు చంపేస్తానంటూ ఫోన్‌లో బెదిరించేవాడు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని కూడా చంపేందుకు పథకం పన్నానని రాజాసింగ్‌కు ఫోన్ చేసి పలుమార్లు బెదిరించాడు. రాజాసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడు సౌదీ ఆరేబియాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతనిపై పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌ఒసి) జారీ చేశారు. మంగళవారం నిందితుడు శంషాబాద్ విమానాశ్రయంలో దిగగానే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఆరు నెలలైనా హామీలు అమలు ఎక్కడా?

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏలేటి మరో బహిరంగ లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్ : గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బిజెపి శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మహేశ్వరరావు సిఎం రేవంత్‌రెడ్డికి మరో బహిరంగ లేఖ రాశారు. ఇచ్చిన హామీలను వంద రోజులో అమలు చేస్తామన్న చెప్పి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి 99 రోజుల తర్వాత ఎన్నికల షెడ్యూల్ వచ్చిందన్నారు. అయినా కోడ్ పేరుతో దాటవేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కోడ్ ముగిసి కూడ 4 రోజులు గడుస్తున్నా ఉలుకు పలుకు ఎందుకు లేదని ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షలవరకు ఉన్న పంటరుణాలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9వ తేదీనే ఏక కాలంలో మాఫీ చేస్తామన్న మాటను నిలబెట్టుకోకుండా మాట తప్పి అన్నదాతలను మోసం చేశారన్నారు. ప్రధానంగా రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత, నిరుద్యోగుల వంటి పలు వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు జాడే కనిపించడం లేదని మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్, చేవెళ్ల ఎస్‌సి డిక్లరేషన్, కామారెడ్డి బిసి డిక్లరేషన్లలో ఇచ్చిన హామీల మాటేంటి. వ్యవసాయం రైతు సంక్షేమం, నీటిపారుదల, యువత ఉపాధి కల్పన, విద్యారంగం, వైద్యరంగం, గృహ నిర్మాణం, రెవెన్యూ, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, పారిశ్రామిక రంగం, మహిళా శిశు సంక్షేమం, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఈబిసివర్గాల సంక్షేమం, కార్మిక వర్గ సంక్షేమాలపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలకుసైతం రైతు రుణమాఫీ మాదిరిగానే తేదీలను తక్షణమే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## 'రెరా' కఠినంగా అమలు చేయాలి

### అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి సూచన



ప్రజాపక్షం / హైదరాబాద్: రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టాన్ని(రెరా) కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఛైర్ పర్సన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు ప్రదీప్‌కుమార్ రెడ్డి పల్లె, రిటైర్డ్ ఐఎఎస్ చిత్రా రాంచంద్రన్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సందర్భంగా సిఎం వారితో మాట్లాడుతూ రెరా చట్టం అమలు ద్వారా కొనుగోలుదారులు మోసపోకుండా చట్టాన్ని అమలుచేయాలని సూచించారు.

## రవాణాశాఖలో చట్టానికి లోబడి రెవెన్యూ పెంచేందుకు

# చర్యలు తీసుకోండి

### ఆదాయ అన్వేషణలో విచక్షణ రహితంగా వేధింపులు వద్దు

### స్కూల్ బస్సుల ఫిట్నెస్‌పై తనిఖీలు నిర్వహించాలి :మంత్రి పొన్నం



ప్రజాపక్షం/హైదరాబాద్: రవాణా శాఖలో చట్టానికి లోబడి ఆదాయాన్ని పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదాయ అన్వేషణలో విచక్షణ రహితంగా వేధింపుల వల్ల కాకుండా చట్ట ప్రకారమే వ్యవహరించాలని సూచించారు. జిల్లాల్లో విధిగా వాహనాలు తనిఖీ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. స్కూల్ బస్సుల ఫిట్నెస్‌పై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేసి చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని ఆయన అధికారులను కోరారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర బోయి, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు ప్రవీణ్, రమేష్, మమత, జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, ఆర్‌టిఓలు తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా చట్టానికి లోబడి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. త్రైమాసిక టాక్స్ వసూలుకు సంబంధించి తక్కువగా నమోదు చేసిన వివిధ జిల్లాల అధికారులకు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. 100 శాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న రవాణా శాఖ కార్యాలయాలకు కావాల్సిన సొంత భవనాల కోసం ల్యాండ్ సెర్చ్ చేయాలని, ముఖ్యమంత్రితో చర్చించి సొంత భవనాల సమస్య పరిష్కారించుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అధికారులు ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న రవాణశాఖకు సంబంధించిన వాహనాలను ఒకే గూటికి తీసుకొచ్చే విధంగా స్టిక్కరింగ్ ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్డు భద్రతపై రవాణా శాఖ అన్ని స్కూల్‌లు, కాలేజీల్లో రోడ్డు సేఫ్టీ అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటేనే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి స్కూల్ బస్సును తనిఖీ చేయాలని డ్రైవర్లకు, స్కూల్ బస్సులకు కచ్చితంగా ఫిట్నెస్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతపై రవాణా శాఖ అధికారులు జిల్లాలో కలెక్టర్ ప్రాభావిత వ్యక్తులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. వారం రోజుల పాటు స్కూల్‌లు, కాలేజీల్లో ఈ కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి రోడ్డు భద్రతపై కనీస అవగాహన ఉండేలా చూసుకోవాలన్నారు. స్కూల్ బస్సుకు సంబంధించి డ్రైవర్, క్లీనర్, బస్సు సమయాలు తెలిపే విధంగా ప్రతి పాఠశాల యాజమాన్యం స్కూల్ బస్ యాప్‌లో అప్‌డేట్ చేస్తే పూర్తి సమాచారం తల్లిదండ్రులకు తెలిస్తే ప్రమాదాలు నివారించేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దాంతో పాటు గతంలో కారు డోర్‌లకు బ్లాక్ ఫిలిం గ్లాస్ ఉన్న వాటిపై విధిగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద ఉన్న చెక్ పోస్టులను ఎన్‌ఫోర్స్‌మెంట్ ను మరింత బలపరిస్తే అవినీతికి ఆస్కారం లేకుండా ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. హైదరాబాద్ ఆటోరిక్షాల విషయంలో ప్రస్తుతం ఉన్న పాలసీతో పాటు సిఎన్‌జి, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ విషయంలో అవినీతికి ఆస్కారం లేకుండా డిసెంట్రలైజ్ ఎలా ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని ఏదైనా భిన్నమైన ఆలోచన వస్తె తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## సమాచార కమిషనర్ పదవుల భర్తీకి దరఖాస్తులు

### ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ

### గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోనవసరంలేదు

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ సమాచార కమిషన్‌లో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, రాష్ట్ర సమాచార కమిషనర్ పదవులకు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. 2019లో సవరించబడిన సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 15, 16 ప్రకారం అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ పదవులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులు సంబంధిత అవసరమైన ధృవపత్రాలు, ఇతర ఎన్‌క్లోజర్లతో జూన్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. దరఖాస్తు ఫారంను వెబ్‌సైట్: https://telangana .gov .in నుండి లేదా http://tsic.gov.in. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా "ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ 500022" చిరునామాకు పంపాలని ఆమె తెలిపారు. గతంలో ప్రభుత్వం 2023 జులై 2వ తేదీన జారీచేసిన నోటిఫికేషన్ అనంతరం దరఖాస్తు చేసుకున్న వారందరూ మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరంలేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

## సింగరేణిలో కారుణ్య నియామకాల వయోపరిమితి పెంపు

ప్రజాపక్షం / హైదరాబాద్: సింగరేణి కార్మిక కుటుంబాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న కారుణ్య నియామకాల వయో పరిమితి పెంపు కార్యరూపం దాల్చింది. సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాల వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. వయో పరిమితి సడలిస్తూ ఇచ్చిన ఉత్తర్వును 2018 మార్చి 9వ తేదీ నుంచి అమలు చేస్తారు. ప్రస్తుత ఉత్తర్వుతో సింగరేణిలో వందలాది కుటుంబాలకు ప్రయోజనం కలగనుందని సింగరేణి అధికారవర్గాలు తెలిపాయి. సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అకాల మరణం చెందిన వారి కుటుంబాలలో ఒకరికి, అనారోగ్యంతో (మెడికల్ అన్‌ఫిట్) ఉద్యోగ విరమణ చేసిన వారి పిల్లలను బదిలీ కార్మికునిగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలోకి తీసుకుంటారు. గతంలో 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వారినే కారుణ్య నియామకాల కింద తీసుకునే వారు. కరోనా కాలంలో రెండేళ్ల పాటు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడంతో సింగరేణి కార్మికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కారుణ్య నియామకాల వయో పరిమితిని పెంచుతామని హామీ ఇచ్చారు.

## అన్నీ ఒకే తరహా దిగుబడి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : పత్తి పంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లైతే అన్ని రకాల పత్తి విత్తనాలు దాదాపుగా ఒకే తరహా దిగుబడిని ఇస్తాయనివ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు నిర్దిష్ట రకం విత్తనాలే కావాలని డిమాండ్ చేయవద్దని ఆయన కోరారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ రైతు వేదికల నుండి హాజరైన రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. ఇప్పటి వరకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాన్ని పంపిణీ చేశామని, ఇతర రాష్ట్రాల నుంచి అదనపు విత్తనాలు తెప్పించి అందుబాటులో ఉంచామని చెప్పారు. రాష్ట్రంలో అవసరమైన మేరకు పత్తి విత్తనం అందుబాటులో ఉన్నాయని ఏరకం విత్తనాలపై పంట దాదాపుగా అదే దిగుబడి వస్తుందని మంత్రి తెలిపారు. పంట కాలం ఆధారంగా రైతుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత రైతులకు అవసరమైన విషయాలపై రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అదేవిధంగా ఎక్కువ మంది మహిళా రైతులు కూడా రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని మంత్రి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని సక్రమంగా అనుసరించి పంటలు పండించినట్లైతే ఎగుమతులకు అవకాశం ఏర్పడి పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చే అవకాశం ఉంటుందని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు చింతల వెంకట్ రెడ్డి, యడ్లపల్లి వెంకటేశ్వరరావు హాజరుకావడాన్ని మంత్రి అభినందిస్తూ భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమం కోసం వారి విలువైన సూచనలు అందించాలని కోరారు. 'ఈ రైతు నేస్తం కార్యక్రమంలో చింతల వెంకట్‌రెడ్డి, యడ్లపల్లి వెంకటేశ్వరరావులు అధిక సాంద్రత పత్తి సాగు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగహన కల్పించారు. అదేవిధం గా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పత్తి శాస్త్రవేత్త డాక్టర్ పి.ప్రశాంత్ రైతులకు అధిక సాంద్రత ప్రత్తి సాగుపై అవగహన కల్పించారు. వ్యవసాయసంచాలకులు, బి. గోపి మాట్లాడుతూ రెండవ విడతలోమండలానికి ఒకటి చొప్పున మరో 456 దృశ్య శ్రావణ పరికరములు ఏర్పాటు చేస్తున్నామని,అవి ఈ నెలాఖరులోగా అందుబాటులోనికి రానున్నాయని తెలిపారు.తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం పరిశోధన సంచాలకులు. పి.రఘురామ్ రెడ్డి, వివిధ రైతు వేదికల నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

### హోటల్ యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి :మంత్రి దామోదర్ రాజ నర్సింహా



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆహార పద్ధారాల కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. హోటల్ ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి మంత్రి దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర ప్రభుత్వం కమిషనర్ ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్, నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్, ఆయిల్ మర్చంట్ అసోసియేషన్, బార్ అండ్ రెస్టారెంట్స్, ఇండియన్ డైలీ మిల్క్ ప్రొడకట్స్ అసోసియేషన్, తెలంగాణ ప్యాకేజెడ్ డ్రింకింగ్ వాటర్ అసోసియేషన్, తెలంగాణ రోలర్ ఫ్లోర్ మిలర్స్ , బేకరీ అండ్ ఐస్ క్రీమ్స్ అసోసియేషన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఆహార కల్తీ చేసే వారిపై, నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని వివిధ అసోసియేషన్ ప్రతినిధులకు తెలియజేశారు. నిజాం కాలం నుండి హైదరాబాద్ బిర్యాని కి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందన్నారు. హైదరాబాద్ ను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా గా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచుతున్నామని, హోటల్ ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి దామోదర్ రాజ నర్సింహా కోరారు. ప్రతి 6నెలలకు ఒకసారి వర్క్ షాప్ ల నిర్వహణ తో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, డైరెక్టర్ ఫుడ్ సేఫ్టీ డాక్టర్.శివలీల, తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఇండియన్ రెస్టారెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సందీప్, ఇండియన్ డైరీ మిల్క్ ప్రొడకట్స్ అసోసియేషన్ మెంబర్ సుల్తాన్ మస్కతి, అసోసియేషన్ ప్రతినిధులు రామాంజనేయులు, రాజ శేఖర్, మనిష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 720 అర్జీలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తుదార్లు భారీగా తరలి వచ్చారు. వివిధ సమస్యలకు సంబంధించి 702 అర్జీలు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆకస్మికంగా సందర్శించారు. మంత్రి సీతక్క రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ డ్రైవర్ కమ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలల్లో పెరిగినందున ప్యాకేజీ పెంచాలని కోరారు. మొత్తం 702 దరఖాస్తులు రాగా, ఇందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 219 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 54, హోం శాఖకు సంబంధించి 52, హౌసింగ్ శాఖకు సంబంధించి 44, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 46, ఇతర శాఖలకు సంబంధించి 287 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించడం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## కాళేశ్వరం ఇంజినీర్లు అఫిడవిట్ దాఖలు చేయాలి

### జస్టిస్ చంద్ర ఘోష్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరంలో ప్రాజెక్టులో బ్యారేజీల నిర్మాణంపై విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్ విచారణ చేపట్టిన విషయం తెల్సిందే. అయితే ప్రాజెక్టును సందర్శించిన కమిషన్, ఇప్పుడు విచారణ వేగవంతం చేసింది. ఈ క్రమంలో మంగళవారం 20 మందికిపైగా తాజా, మాజీ అధికారులు కమిషన్ ముందు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణం, నాణ్యతా నిర్వహణ, డ్యాం సేఫ్టీ ఇంజినీర్లు ఇందులో ఉన్నారు. డిజైన్‌లు, అధ్యయనాలు, గమనించిన అంశాలు, తీసుకున్న చర్యలు, తదితరాల గురించి ఇంజనీర్‌లను విచారించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ చంద్ర ఘోష్ మీడియాతో మాట్లాడుతూ మూడు బ్యారేజీలకు సంబంధించి సమాచారం తెలుసుకున్నామని తెలిపారు. మేడిగడ్డ సహా కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై ఇంజనీర్లు అందరూ ఈ నెల 25వ తేదీ లోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని తెలిపామన్నారు. తెలిసిన అంశాలను అఫిడవిట్ రూపంలో సమాధానం ఇవ్వాలని చెప్పామన్నారు. తప్పుడు అఫిడవిట్ ఇచ్చినట్లు తేలితే చట్టపరంగా చర్యలు ఉంటాయని చంద్ర ఘోష్ స్పష్టం చేశారు. అఫిడవిట్ ద్వారా అయితే అన్ని అంశాలు రికార్డు అవుతాయని అన్నారు. ఇంజనీర్లతో సోమ, మంగళవారం సమావేశం జరిపామని, బుధవారం నుండి ఎం చేయాలనే అంశంపై లిస్టు రెడీ చేస్తున్నామని చెప్పారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా త్వరలోనే విచారణకు పిలుస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారమే వ్యవహరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులో అధికారులు ఉంటే వాళ్లకు నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు.

**బ్యారేజీలు బాగుంటే ప్రజలకు ఎంతో లాభం జరిగేది..**

బ్యారేజీలు సరిగ్గా పనిచేస్తే ప్రజలకు ఎంతో లాభం జరుగుతుందని జస్టిస్ చంద్ర ఘోష్ అన్నారు. ఎక్కడో ఏదో తప్పుడు లెక్కల వల్ల ఇలా జరిగిందనిపిస్తోందన్నారు. బ్యారేజీల వల్ల లాభం తప్ప నష్టం లేదు అని అనిపిస్తోందన్నారు. సమస్యలు రాకపోయి ఉంటే ప్రజలకు చాలా ఉపయోగపడేవన్నారు. లోపం ఎక్కడుంది, ఏం జరిగిందన్న విషయమై తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఎవరి ప్రమేయం అయినా ఉందా ? అని కూడా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు జస్టిస్ ఘోష్ తెలిపారు.

**ఇంజనీర్లను విచారించిన కమిషన్..**

ఈ విచారణలో భాగంగా డ్యాం సేఫ్టీ చట్టానికి లోబడి తీసుకున్న చర్యలు, సూచనలను కూడా ఇంజనీర్ల ద్వారా తీసుకుంది. ఇదే సమయంలో ఆయా సందర్భంగా నిర్మాణ సంస్థ, నీటిపారుదలశాఖ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, పైఅధికారులతో సంప్రదింపులు, వారి ఆదేశాల అమలు సహా సంబంధించిన అంశాలపై కూడా కమిషన్ ఇంజనీర్లను ప్రశ్నించింది. సమస్యలు తలెత్తినప్పటికీ మరమ్మత్తులు ఎందుకు చేయలేదని, అందుకు గల కారణాలపై కూడా జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్ విచారణలో ఇంజనీర్లను ఆరా తీసింది.


తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్ రాజ్ ఇంజినీరింగ్ విభాగం
O/o. సూపరింటెండింగ్ ఇంజనీర్, మహబూబాబాద్

టెండర్ నోటీసును ప్రచురించడం కోసం ప్రెస్ నోట్ నెం.02 (1వ కాల్), తేది: 10.06.2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో టెండర్ నోటీసులో చూపబడిన NIT నంబర్లతో కూడిన పనుల కోసం వివిధ గ్రాంట్ల కింద మంజూరైన రూ.54.90 లక్షల అంచనా వ్యయంతో (06) పనులతో కూడిన ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో PRED ద్వారా టెండర్లు అప్‌లోడ్ చేయబడతాయి మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడిన తేదీ నుండి అనగా తేది:15.06.2024 నుండి 25.06.2024 వరకు (07) స్పష్టమైన పనిదినాలలో ప్రతి NIT ఆన్‌లైన్‌లో చెల్లుబాటుతో అందుబాటులో ఉంటుంది. ఇతర వివరాలను https://tender.telangana.gov.in ఆన్‌లైన్‌లో చూడవచ్చు మరియు DPRE మహబూబాబాద్ ఇ-మెయిల్ ID: eeprmbbd@gmail.com నుండి కూడా పొందవచ్చు. సంప్రదించవలసిన మొబైల్ నెం.9121135950.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మహబూబాబాద్
DIPR R.O. No. : 39-DP/CL/ADVT/1/2024-25 Date: 11-06-2024

తెలంగాణ ప్రభుత్వము
వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ :: వరంగల్ జిల్లా

ఆర్.సి.నెం.C/58/2024 టెండరు ప్రకటన తేదీ:11-06-2024

2024-2025 విద్యా సంవత్సరమునకుగాను వరంగల్ జిల్లాలోని (14) ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహములకు సంబంధించిన వంట సరుకులు (Food Provisions) సరఫరా చేయుటకు ఆసక్తిగల వారి నుండి సీల్ టెండర్లు కోరడమైనది.

టెండర్ వివరములు

వంట సరుకులు సరఫరా చేయుటకు ఆసక్తి గలవారు రూ.1,00,000/- స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నక్కలగుట్ట, హన్మకొండ నందు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, వరంగల్ గారి పేరున డి.డి. రూపంలో చెల్లించి కావలసిన టెండర్ షెడ్యూల్ ఫారమును జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, వరంగల్ గారి కార్యాలయము నందు తేది.12-06-2024 నాడు ఉదయం 10.30 గంటల నుండి తేది: 19-06-2024 సాయంత్రం 2.00 గంటల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన సీల్ టెండర్ ఫారములు తేది: 19-06-2024 రోజున సాయంత్రం 5.00 గంటలలోగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయము వరంగల్ జిల్లా లో ఏర్పాటు చేసిన సీల్ బాక్స్ లో వేయగలరు. అట్టి టెండర్‌ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వరంగల్ గారి కార్యాలయము నందు తేది: 20-06-2024 రోజున సాయంత్రం 4.00 గంటలకు తెరువబడును. గడువు తురువాత వచ్చిన టెండర్ ఫారములు స్వీకరించబడవు.

గమనిక: ఇట్టి టెండర్లను వాయిదా వేయుటకు గాని, రద్దుపరచుటకు గాని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/ ఛైర్మన్, డి.పి.సి., వరంగల్ జిల్లా గారికి పూర్తి అధికారము కలదు.

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/ ఛైర్మన్, డి.పి.సి. వరంగల్ జిల్లా గారి తరపున
DIPR R.O. No. : 363-PP/CL/ADVT/1/2024-25 Date: 11-06-2024

ప్రజాపక్షం

బుధవారం, జూన్ 12

# మణిపూర్‌లో మళ్లీ మంటలు

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో 2023 మే 3న మీతీ, కుకి–జో గిరిజన సముదాయం మధ్య చెలరేగిన హింసాకాండ ఇప్పటికీ ఏదోక రూపంలో కొనసాగుతూ ఉండటం అత్యంత బాధాకరం, విషాదభరితం. మెజారిటీ మీతీ సంతతి ఇంఫాల్ లోయలో నివసిస్తుండగా, కుకి–జో గిరిజన సముదాయాలు పరిసర కొండ ప్రాంతాల్లో నివసిస్తుంటారు. దీర్ఘకాలంగా పొరుగుదేశంనుంచి పనిచేసే తిరుగుబాటు గ్రూపుల బెడద, దాడులు, హత్యలు ఉండేవి. అయితే గత ఎన్నికల్లో బిజెపి పక్షాన చేరిన మీతీలు మెజారిటీ సీట్లు గెలుచుకోవటం, ఆ ఉపజాతికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి పదవిచేబట్టి గిరిజన తెగలను నిర్లక్ష్యం చేయటంతో గత ఏడాది అంతర్‌జాతి కలహాలు పెద్ద ఎత్తున బయలుదేరాయి. వాటిని అదుపుచేయటంలో, అణచివేసి సుహృద్భావం పునరుద్ధరించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విఫలమైనాయి. ఇంత ఘోరంగా అంతర్గత కలహాలు జరుగుతున్నా, వేలాది మంది శరణార్థి శిబిరాల్లో తలదాచుకుని ఎప్పుడు ఏ ఉపద్రవం మీదపడుతుందోనని భయంతో బిక్కుబిక్కుమంటూ బతుకులీడుస్తున్నా మన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జాలి, దయ కలుగలేదు, ఒక్కసారైన బాధితులకు తన ముఖం చూపి వారిలో ధైర్యం నింపే పనిచేయలేదు. ఇది ఎంతగా విమర్శలకు గురైనా ఆయన ఖాతరుచేయలేదు. కాని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఒకటికి రెండు సార్లు సందర్శించారు. భారత్ జోడో న్యాయయాత్రను ప్రజల మధ్య సద్భావంనింపే ప్రయత్నంగా మణిపూర్ నుంచే ప్రారంభించారు. పర్యవసానంగా రాష్ట్రంలోని 2 లోక్‌సభ సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది.

ప్రభుత్వ లెక్కల ప్రకారమే, 2024 మే 3 తేదీనాటికి –అంటే కచ్చితంగా సంవత్సర కాలంలో హింసాకాండలో 221 మంది ప్రాణాలు కోల్పోయారు, వెయ్యి మంది గాయపడ్డారు, 22మంది జాడ తెలియలేదు, 4786 ఇళ్లు దగ్ధమైనాయి, 386 మత ఆరాధనా ప్రదేశాలు ధ్వంసం చేయబడినాయి. వాటిలో దేవాలయాలు, చర్చీలున్నాయి. 60వేల మంది ఆశ్రయం కోల్పోయారు. ఇంత ఘోరం జరుగుతున్నా మోదీ గత ప్రభుత్వం తమాషా చూసిందే గాని, చేతకాని తన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి పరిపాలనను చేతిలోకి తీసుకొని శాంతిపునరుద్ధరణ చేయలేదు.

లోయలోని మీతీ సంతతిని షెడ్యూల్డ్ కులాల్లో చేర్చాలన్న డిమాండ్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు పంపాలని 2023 ఏప్రిల్ 14న మణిపూర్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు ఈ మారణహోమానికి హేతువైంది. ఈ ఉత్తర్వును తర్వాత సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కుకీలు మెజారిటీగా ఉన్న చరచాంద్‌పూర్ పట్టణం, మీతీలు ఆధిక్యంలో ఉన్న ఇంఫాల్ లోయ మధ్య చిచ్చురేగింది. మీతీలకు ఎస్‌టి ప్రతిపత్తి ఇస్తే సాపేక్షికంగా అభివృద్ధి చెందిన మీతీలు తమ భూములు కాజేస్తారన్న భయం కుకీల్లో ఉంది.

ఇదిలా ఉండగా, జూన్ 6న ఒక శవం బయటపడటంతో రెండు తెగలమధ్య మంటలు మళ్ళీ అంటుకున్నాయి. సంవత్సరంకాలపు సంఘర్షణ 12 వేలమంది శరణార్థులను మిజోరంలోకి పంపగా, తాజా ఘటన వందలాదిని అసోంలోని బారక్ వ్యాలీలో శరణుజొచ్చేటట్లు చేసింది. మణిపూర్‌లోని జిరిబాంజిల్లాలో శనివారంనాటి హింసలో రెండు పోలీసు ఔట్‌పోస్టులు, ఒక ఫారెస్టు బీట్ కార్యాలయం, 70 ఇళ్ళు పరశురామప్రీతి అయినాయి. ఇంకా ఎన్నాళ్ళీ హింస. మూడవసారి అధికారంలోకి రావడానికి ఎంతో శ్రమించిన మోదీ ఇప్పుడైనా మణిపూర్‌వైపు చూడరా? రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చి శాంతిస్థాపన చేయరా? చేయలేరా?

# విజేతల్ని ప్రజలు ఓడించారు

18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి జోడికి తీవ్ర విఘాతం. మోదీమూడవసారి అధికారంలోకి రావడంలో విజయం సాధించినప్పటికీ ''ఇండియా కూటమి'' సృష్టించిన ప్రకంపనల నుండి ఇంకా వారు కోలుకోలేకపోతున్నారు. ''ఈసారి 400 సీట్లు'' అనే నినాదంతో ఎన్‌డిఎ కూటమి ప్రజల్లోకి వెళ్లినప్పటికీ, బ్రహ్మాండమైన మెజారిటీతో మహాశక్తిగా ఆవిర్భవించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న స్వప్నం సాకారం కాలేదు. కేవలం బొటాబొటి సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పోల్చిచూస్తే దేశంలో ప్రతిపక్షం తన స్థాయిని పెంచుకుంది. ముందంజలో ఉంది. ఈసారి ప్రారంభం కాబోయే పార్లమెంటు సమావేశాలు బిజెపికి ఎట్టిపరిస్థితిలోనూ ఏకపక్ష వ్యవహారం కాదు. గడచిన 10 సంవత్సరాలుగా పార్లమెంటును తమ కనుకూలమైన చట్టాలను ఉత్పత్తి చేసే కర్మాగారంగా బిజెపి మార్చేసింది. ఏనాడూ కేంద్రప్రభుత్వం ప్రతిపక్షాలతో సంప్రదింపులు చేయలేదు. ప్రతిపక్షాలను గేలిచేయడం, అపహాస్యం చేయడం, వారి వాణిని అణచివేయటం తప్ప చర్చలు జరుగలేదు. 1952 నుండి ఇప్పటివరకు గడచిన పార్లమెంటు చరిత్రలో రెండుసార్లు అధికారం చెలాయించిన ఎన్‌డిఎ ప్రభుత్వం అతి తక్కువ రోజులు సమావేశాలు నిర్వహించింది. 17వ లోక్‌సభ కేవలం 250రోజులు మాత్రమే సమావేశమైంది. అంతకుముందు 16వ లోక్‌సభ ఐదేళ్ల పూర్తి పదవీకాలంలో 331 రోజులు మాత్రమే సమావేశాలు జరిపింది. గడచిన 74ఏళ్లలో ఈ రెండు లోక్‌సభలూ పూర్తి పదవీకాలం కొనసాగినప్పటికీ అతి తక్కువ రోజులు సమావేశాలు జరిపాయి.

మహాశక్తివంతమైన కాషాయ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో పేద ప్రజలు పూర్తిగా భారత రాజ్యాంగానికి కట్టుబడి ఈ ఎన్నికల్లో పోరాటం చేశారనటంలో ఎలాంటి సందేహం లేదు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పోరాటాలలో ఇదొకటి. విదేశీ వ్యాపార దళారులను, దేశంలోని వారి పెట్టుబడిదారీ మిత్రులు, తైనాతీ వర్గ ప్రయోజనాలను ప్రోత్సహించటం కోసం ప్రజావాణిని ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయటం కుదరదన్న సందేశాన్ని పంపటంలో దేశ ప్రజలు విజయవంతమయ్యారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే మోడీ ప్రసంగాల ఉచ్చులో పడకుండా ఎన్నికల ప్రచార ప్రక్రియ, పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు మత సామరస్యాన్ని, మత శాంతిని కొనసాగించిన భారత గ్రామీణ ప్రజలు ఎంతైనా శ్లాఘనీయులు. హిందూత్వ లక్ష్య సాధనలో భాగంగా దళితులు, నిరుపేదలు, కార్మిక వర్గాలను స్వాభావికమైన పాచికలుగా చూడటం మానుకోవాలనేది పట్టణ ప్రాంత మేధావులు, విద్యావేత్తలకు ఇదొక సంకేతం.

ప్రజాతీర్పులో మోదీకి మెజారిటీ గణనీయంగా తగ్గిపోవటం ఆయన చెప్పిన పుక్కిటిపురాణ కథలన్నీ ఒట్టి కల్పనలేఅని తేలిపోవటం ఒక్కటే ప్రాముఖ్యత అంశం కాదు. ఆ వెంటే చాలా విస్తారమైన చిక్కులు కూడా ఉన్నాయి. దేశంలో ప్రజలను మత ప్రాతిపదికపై విభజించాలన్న ప్రణాళికల పట్ల ప్రజలు విసిగి వేసారిపోయారని కూడా చాలా స్పష్టంగా ఆయన మెజారిటీ తరుగుదల సూచిస్తోంది. అయితే 241 స్థానాలు లోక్‌సభలో రావడం అంటే మోదీ విభజనవాద రాజకీయాలు ఇంకా కొంత ప్రభావం చూపిస్తున్నాయని తెలియచేస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయాల్లో మితవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం జరపటంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. 2019లో విజయం సాధించినప్పటినుంచి ఆర్‌ఎస్‌ఎస్ మోదీలు దేశంలో ప్రజలు పూర్తిగా హిందూ దేశాన్నే కోరుకుంటున్నారని, ప్రజలు బిజెపికి మద్దతుగా మత ప్రాతిపదికపై చీలిపోయారని చెప్పేందుకే ప్రయత్నం చేశారు. కానీ ఈ నమ్మకానికి ఎలాంటి విలువలేదని, పూర్తిగా నిరాధారమైందని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి.

తాను దైవ సమానుణ్ణనే నమ్మకంలో బతికే ఆత్మన్యూనతాభావంగల రాజకీయ నాయకుడు నరేంద్రమోదీ. తాను జీవసంబంధ జనితుణ్ణి కాదని దేవుడే దూతగా పంపించాడని పదేపదే మోదీ చేసిన ఉద్ఘాటనలు ఆయన మద్దతుదారులను మాత్రమేకాదు చాలా విస్తారంగా ఎగతాళికి, అపహాస్యానికి గురయ్యాయి. ఎన్నికలలో విజయం సాధించే ప్రయత్నంలో ఈ విధంగా ఆయన మాతృత్వ భావనకు కూడా అగౌరవం కలిగించారు. ఆయన చేసినవన్నీ తప్పులే. భారత పాలకవర్గానికి పెట్టిన పరీక్షలో వారంతా నియంతృత్వ నాయకత్వానికే చాలా గట్టి ప్రాధాన్యత ఇచ్చారని, అది చాలా ఎక్కువగా మత ఛాందసంవైపే మొగ్గుచూపిందని తేలింది. వ్యాపార సంపన్న వర్గాలకు నియంతృత్వంతో జతకట్టి కులికే సుదీర్ఘ చరిత్ర ఉంది. హిట్లర్, ముసోలినీ లాంటి అసంఖ్యాకమైన నియంతలతో ఈ వ్యాపార సంపన్నవర్గాలు కులికాయి. సంపన్నవర్గాలు, పెట్టుబడిదారులు ప్రధానంగా పేదప్రజలతోను, కార్మికవర్గంతోనూ విభేదించారు. స్వాతంత్ర్యం సాధించుకున్నప్పటినుంచి మన దేశంలో ధనిక వర్గాలకు చెందిన వ్యక్తులు, పెట్టుబడిదారులు ప్రజలపై అధికారం చెలాయించేందుకు ప్రభుత్వాలను ఒక వనరుగా ఉపయోగించుకుంటున్నారు.



ఎన్నికలలో పాలుపంచుకోకుండా వారిని అడ్డుకోవటం, వారు ఓటు హక్కును ఉపయోగించుకోకుండా చేయటం సంపన్న, పెట్టుబడిదారీ వర్గాలకు అతిపెద్ద విజయవంతమైన ఎత్తుగడగా రుజువైంది.

ఉత్తరప్రదేశ్‌లో ప్రత్యేకించి ఫైజాబాద్‌లో తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల వార్తలు లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులకు ఎంతో ఆహ్లాదం కలిగించాయి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ పునరుద్ధరణకు ఒక ప్రధానమైన ప్రతినిధిగా ఉన్న అయోధ్య, తనను తాను హిందూ హృదయనేతగా ప్రకటించుకున్న నరేంద్ర మోదీ పిలుపును చెవికెక్కించుకోలేదు. రామాలయాన్ని నిర్మించాలన్న మోదీ ప్రయత్నాలు హిందూత్వలో ఉత్సాహాన్ని నింపలేదనీ, మోదీ ఒక్కడే హిందూత్వ ప్రతినిధి కాదనే గుడ్డి నమ్మకాలను అయోధ్య ఓటర్లు వమ్ము చేశారు. దీంతో హిందువుకు వెన్నుపోటు పొడిచారని ఏ మాత్రం విశ్వాసం లేదని అర్థరహితమైన, ఆలోచనలేని వదరబోతులు సైబర్ ప్రచారం చేశారు. ఈ విధమైన అంధ భక్తుల వర్గంగాల్లో ప్రచారాలు సాగించటానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు ఒక వరంగా దొరికింది. ఈ విధమైన వ్యక్తులకు భారతదేశ చరిత్రపై చాలా పరిమితమైన అవగాహన ఉంది. భారతదేశ ప్రజల హృదయాల్లో లౌకిక భావనలు ఏ మేరకు విస్తరించి ఉన్నాయనే వాస్తవాలను ఎన్నటికీ వారు అర్థం చేసుకోలేరు. ఫైజాబాద్‌లో ఎన్నికల ఫలితాలు చూస్తే జవహర్‌లాల్ నెహ్రూ 1950–51 ఎన్నికలలో ఏ విధంగా విజయం సాధించారో, నెహ్రూను ఓడించేందుకు ఆయనకు వ్యతిరేకంగా కర్పత్రీ మహరాజ్ ఏవిధంగా మతోన్మాద ప్రచారం చేశారో జ్ఞాపకం వస్తోంది. కర్పత్రీ మహరాజ్ విషం చిమ్మే ప్రచారం చేసినప్పటికీ కూడా భారత ప్రజలు ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్ ఓటర్లు లౌకికవాదానికి, ప్రగతిశీల ఆలోచనా దృక్పథానికే కొమ్ముకాశారు.

కొంతమంది ప్రత్యేక నిపుణులు, విద్యావేత్తలు ఈ ఫలితాలను నష్టాలుగా కాకుండా తాత్కాలిక వెనుకంజగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో అనివార్యంగా ప్రజానీకంలో చర్చ జరగాలి. రెండవసారి అధికారంలోకి రావటానికి కొంత మంది భారతీయులు మోదీ వెనుక ఉండి మద్దతు ఇవ్వటానికి కారణం ఏమిటి? ఆయన తిరిగి అధికారంలోకి రావాలని కోరుకున్న భారతీయులెవరు అనే విషయంపై చర్చ జరగాలి. చాలా స్పష్టంగా సంపన్నవర్గాలు, అగ్రశ్రేణి, మధ్యతరగతి, పెట్టుబడిదారీ వర్గాలు తమ వర్గ ప్రయోజనాలు కాపాడుకోవడం కోసం నరేంద్రమోదీని ఒక కథానాయకుడుగా చిత్రీకరిస్తున్నాయి. మితవాద గ్రూపులు దేశంలో శక్తివంతమైన సైన్యం, ఆర్థికపరమైన పటిష్టత కావాలని ఉద్దేశపడుతున్నాయి. నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యం, ఆర్థిక అసమానతల కుదింపు అనే మాటలు ఆ వర్గాలకు ఎప్పటికీ రుచించవు. దేశంలో ఆర్థిక వ్యవస్థను సమీకృతం చేయటం బిజెపి అనుసరిస్తున్న హిట్లర్ తరహా రాజకీయ సిద్ధాంతం.

ఇప్పుడు మనం కొన్ని ఎన్నికల ఫలితాల గణాంకాలను పరిశీలిద్దాం. గడచిన మూడు సార్లు జరిగిన ఎన్నికలలో బిజెపి గెలుచుకున్న 14 బలమైన స్థానాలను ఆ పార్టీ కోల్పోయింది. ఈసారి ఎన్నికలలో తిరిగి పోటీచేసిన సిట్టింగ్ ఎంపిల్లో 37మంది ఓటమి పాలయ్యారు. పశ్చిమాన ఎన్‌డిఎ 15శాతం ఓట్లను కోల్పోగా, దానికి గుండెకాయలాంటి హిందీ ప్రాంతంలో ''ఇండియా కూటమి'' 11శాతం ఓట్లు అదనంగా సంపాదించుకుంది. బిజెపి గణనీయంగా ఓట్లు నష్టపోయింది. కార్పొరేట్ శక్తులనుంచి విచ్చలవిడిగా, ఇబ్బడిముబ్బడిగా ఎన్నికల బాండ్ల ద్వారా సేకరించిన ధనంతో, ఆర్థిక అండదండలతో ఈ ఎన్నికలలో బిజెపి ప్రతిపక్షాలపై పెద్ద ఎత్తున యుద్ధానికి దిగిందన్న విషయాన్ని మనం మరచిపోకూడదు. అదేవిధంగా సైబర్ ప్రచారం చేసే హిందూత్వ సైన్యం, జాతీయ ప్రధాన స్రవంతిలో పనిచేసే మీడియా చాలా బాహాటంగా ఎన్నికల ప్రచారంలో బిజెపికి అనుకూలంగా పనిచేశాయి. మరోవైపు ''ఇండియా'' కూటమి, విషం చిమ్మిన మతోన్మాద దుష్ప్రచారానికి, విద్వేష ప్రచారానికి వ్యతిరేకంగా పోరాటం చేసింది. పచ్చి అబద్ధాలుతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్, భారత ఎన్నికల సంఘం సహా సంస్థలన్నీ వైరిభావం ప్రదర్శించాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ కు ఒక స్పష్టమైన ఓటమే తప్ప తాత్కాలిక వెనుకంజ కాదన్న వాస్తవం తేటతెల్లమవుతున్నది.

ఇప్పుడు ప్రతిపక్షం తాము పోటీచేసిన ప్రాంతాలలో ఎక్కడెక్కడ తమ అభివృద్ధి సంక్షేమ ప్రచార కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లటంలో విఫలమయ్యాయో గుర్తించేందుకు విశ్లేషణ జరపాలి. ఈ కూటమిని, ఐక్యతను మరింతగా విస్తరించాలి, పెంపొందించుకోవాలి. వ్యూహాలకు అనివార్యంగా మరింత పదునుపెట్టాలి. అలాంటప్పుడే 2029లో రాబోయే 19వ లోక్‌సభ ఎన్నికలలో భారత ప్రజాస్వామ్యం, లౌకిక, సామ్యవాద భావజాలాలను పరిపూర్ణంగా పునరుద్ధరించటానికి వీలుకలుగుతుంది. ఈ మూడవ విడత మోదీ షా ద్వయం సాధించిన విజయం మొత్తం బిజెపి భవితవ్యం మీద ఎడతెగని ప్రభావం చూపిస్తుంది. లోక్‌సభలో ప్రతిపక్షాలకు గణనీయంగా బలం పెరిగినందువల్ల హిందూత్వ శక్తులు తమ ఎజండాను అమలు చేయకుండా అడ్డుకోవడానికి బాగా వీలుకలుగుతుంది.

ద్రోణ

# దయనీయమైన చదువు'కొనే' పరిస్థితి



కసిరెడ్డి మణికంఠరెడ్డి
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఏ తల్లిదండ్రులైనా పిల్లలకు ఉన్నతమైన భవిష్యత్‌ను అందించేందుకు తపన పడుతుంటారు. ఎంత కష్టమైనా ఖర్చయినా నాణ్యమైన విద్యను అందించాలని కోరుకుంటారు. వారి ఆరాటాన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో తల్లితండ్రులు తమ పిల్లలు 'చదువుకునే' విధంగా కృషి చేస్తుంటే అక్కడ 'చదువుకొనే' పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అంటే కాన్వెంట్స్, కార్పొరేట్స్, కలెక్షన్ సెంటర్స్‌గా మారాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు దోపిడీ కేంద్రాలుగా, విద్యతో వ్యాపారం, అక్షరాలతో లక్షల రూపాయల ఆదాయ సముపార్జన చేస్తున్నాయి. విద్యార్థులు వారి తల్లితండ్రుల వద్ద నుండి రూ.500 నుండి లక్షల రూపాయలు దోచుకునే ముఠా సంస్థలుగా ప్రైవేట్ విద్యాసంస్థలు తయారయ్యాయి. 'చదువు చారెడు బలుపాలు దోసెడు' అనే సామెత నేడు ప్రైవేట్ విద్యాసంస్థలను చూస్తే గుర్తుకు రావలసిందే. విద్యా సంవత్సరంలో ఇప్పటికే జూనియర్ కళాశాలలు ప్రారంభం కాగా, జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేజీ నుండి బీటెక్ వరకు ఉన్న ఫీజులు చూస్తే బయపడాల్సిందే. కానీ ఈ ఫీజుల గురించి అధికారులకు చెప్పినా వినిపించవు... చూపించినా కనిపించవు.. వాటిపై ఎలాంటి చర్యలు ఉండవు. ఎందుకంటే వారికి ఆ స్థాయిలో ఉంటాయి రాచరిక కమీషన్లు, మర్యాదలు. లేదంటే ఎందుకు చర్యలు తీసుకోరు మరి. రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల దోపిడీ ఏటా పెరుగుతూనే ఉంది. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులు, వారి తల్లితండ్రుల నుండి ఫీజుల దోపిడీకి సిద్ధం అయ్యాయి ఇప్పటికే అనేక కార్పొరేట్ విద్యాసంస్థలు నో అడ్మిషన్ అంటూ విద్య వ్యాపారం సగం పూర్తి కూడా చేశాయి. పాఠశాలల్లో అడ్మిషన్ పొందాలంటే అడ్మిషన్ ఫీజును చూసే బయపడాల్సిందే. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు కట్టి ప్రవేశ పరీక్ష రాసి అందులో పాస్ అయితేనే పాఠశాలలో అడ్మిషన్, ఆ తర్వాత అడ్మిషన్ ఫీజు రాష్ట్రంలో చిన్న పాఠశాలలు అయిదు వందల నుండి మొదలుకుని కార్పొరేట్ లో రూ.20 వేల వరకు వసూలుచేస్తున్నారు. యాధావిధిగా ట్యూషన్ ఫీజు వేరు, హాస్టల్ ఫీజు వేరు. ఈ ఫీజులు ప్రతి సంవత్సరం 20 నుండి 30 శాతం పెంచుతున్నారు. జిల్లా కేంద్రాల్లో నర్సరి క్లాస్‌కు రూ.30 వేలు ఉంటే హైదరాబాద్ మహానగరంలో రూ.1.50 లక్షల ఫీజు తీసుకుంటున్నారు. జిల్లాల్లో కొన్ని పాఠశాలల్లో 9,10వ తరగతులకు రూ.80 వేల నుండి రూ.2 లక్షల వరకు ఫీజులు ఉంటే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల్లో రూ.3 లక్షల నుండి రూ.6 లక్షల వరకు ఫీజులు ఉన్న ఉన్నాయి. ఫీజులు భారీగా ఉన్నా సౌకర్యాల్లో మాత్రం శూన్యమే. విద్యార్థులకు ఆడుకోవడానికి ఆట స్థలాలు ఉండవు. మౌలిక వసతులు ఉండవు. ఇండ్ల లాంటి భవనాల్లో తరగతుల నిర్వహణ జరగడంతో పాటు మంచి ఉపాధ్యాయులు అంటూ అన్ని నమ్మించే ప్రకటనలు, ప్రచారం చేస్తారు కానీ ఆ పాఠశాలకు అనుమతి ఉందని మాత్రం ప్రకటన చేయరు. ఒకవేళ అనుమతి ఉన్నప్పటికీ పాఠశాలలకు అనుమతి ఒక భవనంలో ఇస్తే తరగతుల నిర్వహణ మరొక చోట చేస్తున్నా... విద్యాశాఖ అధికారులు మాత్రం తనిఖీలకు వెళ్ళే సమయంలో వారి ప్రధాన రెస్ట్ రూములలో ఎసి గదులను మాత్రమే సందర్శిస్తూ అంత ఒకే అంటూ వారు ఇచ్చే మాముళ్ల లేక మర్యాదలు స్వీకరిస్తూ అక్కడనే అనుమతులు ఇస్తారు. కానీ



ఫీజుల వివరాలు అడుగరు. మౌలిక వసతులు చూడరు, టీచింగ్ సిబ్బంది విద్యార్హత వివరాలపై కన్నెత్తి చూడరు.

### తరగతి గదులే బుక్ స్టాల్స్ ఇతర అమ్మకాల కేంద్రాలు

రాష్ట్రంలో దాదాపు 13000 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉండగా అందులో 30 లక్షల విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు జూనియర్ కళాశాలలు పుస్తకాలు, యూనిఫామ్స్, స్టడీ మెటీరియల్ అమ్మకాల కేంద్రాలుగా మారాయి అడ్మిషన్లు తీసుకోగానే పుస్తకాలు, యూనిఫామ్స్ కొనుక్కోవాలని, అవి కూడా మా వద్దనే కొనాలని బయట నుంచి తెచ్చే వాటిని అనుమతించబోమని హుకుం జారీ చేస్తున్నారు. పాఠశాలల్లో తరగతి గదుల్లో పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్ట్, షూ అమ్ముతూ సూపర్ మార్కెట్ల మాదిరిగా పాఠశాలలను మారుస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఉపయోగించనున్న నేపథ్యంలో వారిని స్టడీ మెటీరియల్ పాఠశాలల్లోనే కొనాలని ఆదేశాలిస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. ముఖ్యంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థుల పుస్తకాలు ఒకటి నుండి అయిదవ తరగతి వరకు ప్రభుత్వ పుస్తకాలు కాకపోవడంతో యాజమాన్యాలు ఈ ప్రైమరీ పుస్తకాల పేరుతోనే ఎక్కువగా దోచుకుంటూ సిరీస్‌ల పేరుతో ఆ కంపెనీలతో కుమ్మకై ఈ పాఠశాలలో అమ్మే సిరీస్ బుక్‌లను పక్క పాఠశాలల్లో అమ్మకుండా యాజమాన్యాలు సిండికేట్ అవుతున్నా రు. ప్రతి పుస్తకంపై పాఠశాల పేర్లతో పాఠశాల ఆవరణలోనే అమ్ముతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. బయట కొంటే డిస్కౌంట్ ఉంటుంది కానీ పాఠశాల వద్ద వారి కొంటే అధిక రేటు ఉంటున్నది. కొనే పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ వస్తువులపై బిల్లులు కూడా ఇవ్వరు. ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో స్టడీ మెటీరియల్, యూనిఫామ్స్ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటూ యూనిఫామ్ ఫీజు వారికే ఇచ్చి యూనిఫామ్ కొలతలు కూడా కళాశాల ఆవరణలోనే ఇవ్వాలి. కళాశాల వారు యూనిఫామ్స్ పేరుతో పది నుంచి పదిహేను వేల వరకు వసూలు చేస్తున్నారు.

### ఇంజనీరింగ్ ఉన్నత విద్య ఫీజు అందనంత అధికం

ఎంబిబిఎస్ విద్యతో ఇంజనీరింగ్ ఫీజులు పోటీ పడుతున్నాయి. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల దోపిడీకి గేట్లు తెరిచాయి. ఎంట్రెన్స్ పరీక్షల్లో మంచి ర్యాంక్ రాకపోయినా, ఒక వేళ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంక్ వచ్చినా విద్యార్థులు తాము అనుకున్న కాలేజీల్లో, కోర్సుల్లో ప్రవేశం వస్తుందో లేదో అనే అనుమానంతో విద్యార్థులు యాజమాన్య కోట సీట్ల వైపు మొగ్గ చూపుతుండగా, విద్యార్థుల బలహీనతను ఆసరాగా చేసుకున్న ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు యాజమాన్య కోటా సీట్ల ఫీజులను భారీగా ఇష్టానుసారంగా లక్షల్లో వసూలు చేసూ ఉన్నత విద్య వ్యాపారం చేస్తున్నారు. కొన్ని కోర్సులకు భారీగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఇదే అదునుగా కళాశాల యాజమాన్యాలు అందినంత దోచుకునే పనిలో పడ్డాయి. కొన్ని కోర్సులకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఈ డిమాండును అందిపుచ్చుకోవాలని భావించిన ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఆ సీట్ల అడ్మిషన్ల కొరత సృష్టించి సంబంధిత కోర్సుల ఫీజులను భారీగా పెంచేశాయి. యాజమాన్య కోటా ప్రవేశాల ఫీజులు ఆకాశాన్ని కూడా దాటి పోతున్నాయి. సిఎస్‌ఈ ఫీజు రూ.20 లక్షలు ఉండగా డొనేషన్ ఫీజు రూ.12నుండి 16లక్షల వరకు తీసుకుంటున్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ డొనేషన్, నాలుగేళ్ల ఫీజు రెండూ కలిపి రూ.20 లక్షల పైన వసూలు చేస్తున్నాయి. ఫీజులు వసూలుపై ఉన్న శ్రద్ధ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే చర్యలపై ఉండదు. ఇంజనీరింగ్ కళాశాలలు యాజమాన్య కోటా సీట్ల భర్తీలో చేస్తున్న అక్రమాలు, భారీగా ఫీజులు పెంచి దండుకుంటున్న వైనం ఉన్నత విద్యామండలికి తెలిసినా, విన్నవించినా పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రంలో విద్య అందరికీ అందుబాటులో ఉండేలా కామన్ విద్యావిధానాన్ని తీసుకువచ్చి, ఫీజుల నియంత్రణ చట్టం కఠినంగా అమలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

# బాలకార్మికుల వ్యవస్థను అంతం చేయడం ఎలా?

### జూన్ 12 అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా...

రష్యా ఉక్రెయిన్ మరియు పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధాల వలన ఆయా దేశాలలో ఎన్నో పాఠశాలలు మూతపడ్డాయి. ఎంతో మంది స్థానభ్రంశం చెందారు. అధిక సంఖ్యలో పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయారు. వీరందరూ బ్రతుకుతెరువుకు తప్పకుండా యేదో ఒక పని చెయ్యవలసిందే. వీళ్ళందరూ రేపటి బాలకార్మికులే ! యుయన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యం 8.7ని ప్రపంచ దేశాలు 2025సం. నాటికి బాలకార్మికులను నిర్మూలన చేయాలని లక్ష్యించింది. కాని ఇవే పరిస్థితులు కొనసాగితే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం.

**బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002 సంవత్సరంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని జూన్ 12 గా నిర్ణయించింది. ఈ సంవత్సరం 'మన కట్టుబాట్లపై పనిచేద్దాం బాల కార్మికులను అంతం చేద్దాం' అనే ఇతివృత్తాన్ని తీసుకున్నారు. ఈ రోజు బాలకార్మికులుపై అవగాహన పెంచడానికి మార్పు కోసం ఉద్యమానికి మరియు బాల కార్మికులు లేని భవిష్యత్తుకు సహకరించడానికి నిర్ణయాలు తీసుకుంటారు.



**బాలకార్మికులు అంటే ఎవరు:** కొన్ని దేశాలలో 5 నుండి 14 సం.మధ్య వయస్సు ఉన్నవారిని , ఇంకొన్ని దేశాలలో 5 నుండి 18 సంత్సరాల మధ్యలో ఉన్న వారిని బాలలుగా పరిగణిస్తారు. బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందని వారిని బాలకార్మికులని అంటారు. బాలకార్మిక వ్యవస్థ ఒక్క భారతదేశానికే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బాలకార్మికులు ఉన్నారు.

**ఐ.ఎల్.ఒ గణాంకాలు:** అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 16 కోట్ల బాలకార్మికులు ఉన్నారు. వీరిలో 6.3 కోట్లు బాలికలు, 9.7 కోట్లు బాలురు. వీరిలో 7.9 కోట్లు ప్రమాదకరమైన పరిశ్రమలలో పనిచేస్తున్నారు. ప్రపంచంలో వీరు ప్రతీ పది మందిలో తొమ్మిది మంది ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్ ప్రాంతాలలో ఉన్నారు. అత్యధికంగా సబ్ సహారాన్ ఆఫ్రికా ప్రాంతంలో 8.66 కోట్లు నమోదయ్యారు. వీరిలో 70 శాతం వ్యవసాయరంగంలో, 20 శాతం సేవారంగంలో, 10 శాతం ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో బాలకార్మికుల ప్రాబల్యం పట్టణప్రాంతాల్లో కంటే మూడు రెట్లు ఎక్కువ.

**నాడు – నేడు :** నాడు నేడు ఎప్పుడైనా ప్రధాన కారణం పేదరికమే. ఈసమస్య 16, 17వ శతాబ్దాలనాటికే ఉందని చరిత్ర చెబుతుంది. పేదదేశాలలో పేద ప్రజలు వారి పిల్లలను ఆర్థిక అవసరాల కోసం వేరొకరికి అమ్మేసేవారు. కొనుగోలుదారులు పనులు చేయించుకునేవారు. ఇలాంటి బానిసలందరూ బాలకార్మికులే. పారిశ్రామిక విప్లవం తరువాత ఫ్యాక్టరీలలో పెద్దల కంటే తక్కువ వేతనానికే పిల్లలు పనులలో కుదరడం వలన వీరి సంఖ్య పెరిగింది. తరువాత కాలంలో అన్నిరంగాలలో బాలకార్మికులు పెరుగుతూ వచ్చారు. కోవిడ్ అనంతరం పెరిగిన ఆర్థిక అవసరాలు, పాఠశాలలు మూసివేతలు, ఇంటి పెద్ద ఉపాధి కోల్పోవడం, వ్యాపారంలో నష్టాలు, తల్లిదండ్రుల మరణాలు యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు బాలకార్మిక సంఖ్య వృద్ధికి దోహదపడ్డాయి. 2023సం. చివరి నాటికి వీరి శాతం పెరుగుతుందని ఐయల్ఒ తెలిపింది. నేడు ఎక్కువగా వ్యవసాయరంగం, గృహసంబంధ పనులు, బాణాసంచా, వస్త్ర, బొమ్మలు, గొడుగులు తయారీ లోను, గనులు మైనింగ్ లాంటి రంగాలలో అధికంగా ఉన్నారు. ఇంకా వ్యవసాయ, పాడి, మత్స్య, అటవీ, రిటైల్ రంగాలలో, రెస్టారెంట్ , వస్తువులు లోడింగ్, చెత్త ఏరుకోవడం, బూట్లు పాలిష్ చేయడం, పారిశ్రామికయంత్రాల ఆపరేటింగ్లో, ఉప్పు, అద్దాలతయారీ పరిశ్రమలలోనూ ఉన్నారు. చైల్డ్ ట్రాఫికింగ్ వలన అమ్మాయిలు వేశ్యా వృత్తులలోకి, అబ్బాయిలను బిచ్చగాళ్లగా మారుతున్నారు. కొన్ని కుటుంబాలలో సంపాదించే వ్యక్తులు తక్కువగానూ, వారి మీద ఆధారపడే వారు ఎక్కువ మంది ఉండడం, చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడం, రోడ్ల మీద వదిలివేయబడిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యరాస్యత, తరచూ పిల్లలతో పనికోసం వలసలు వెళ్ళడం, పాఠశాలలు దూరంగా ఉండడం, వ్యవసాయ రంగంలో పెద్దలకు సాయంగా పిల్లలను తోడుగా ఉంచుకోవడం మొదలైన కారణాలు వలన పిల్లలు బాలకార్మికులుగా తయారవుతున్నారు.

**బాలల హక్కులు:** పద్దెనిమిది సంవత్సరాల కంటే తక్కువ వయస్సు వున్న వారికి అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ కొన్ని హక్కులు ప్రసాదించింది. వీటిని బాలలకు అందజేయడంలో ప్రపంచం విఫలమైంది. హక్కులలో కొన్ని చూసినట్లయితే లింగ, జాతి, మతం, కులం, హోదాలతో సంబంధం లేకుండా అందరికీ విద్యను అందజేయాలి. పిల్లలకు వారికి నచ్చిన రంగంలో చదువుకో వచ్చు. ఇంకా జీవించే హక్కు, ఆర్థిక సామాజిక, పర్యావరణ, అభివృద్ధి హక్కులు ఉన్నాయి. కాని ఇవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఇక మన దేశంలో రాజ్యాంగం బాలలకు కొన్ని హక్కులు కల్పించింది. ఆర్టికల్ 14 లో సమానత్వం హక్కు, ఆర్టికల్ 15 లో వివక్షతకు వ్యతరేకంగా ఉండే హక్కు, ఆర్టికల్ 21 లో వ్యక్తిగత జీవించే హక్కు, ఆర్టికల్ 21 (ఎ) లో ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ నిర్బంద ఉచిత విద్యను పొందే హక్కు, ఆర్టికల్ 23 లో శ్రమ దోపిడీ నుండి రక్షించబడే హక్కు, ఆర్టికల్ 24లో 14 సం.వయస్సు లోపు గల చిన్నపిల్లల చేత పరిశ్రమలలోనూ, గనులలోనూ, ఇతర ప్రమాదభరిత ఉత్పత్తి ప్రక్రియలలోను పనిచేయించ రాదని, ఆర్టికల్ 45 లో పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడం వంటి హక్కులు ఉన్నాయి. అలాగే బాల కార్మిక వ్యతిరేక చట్టం 1986 లో మన దేశం రూపొందించింది. మనదేశం చాలావరకూ బాల కార్మికులను తగ్గించింది.

**బాలకార్మిక పరిణామాలు:** బాల కార్మికులు ఎక్కువగా ఉండడం వలన ఆయా దేశాల్లో వీరువిద్యకు నోచుకుపోవడం వలన పేదరికంలోనికి నెట్టబడతారు. సరైన పోషకాహారం లేకపోవడం వలన శారీరంగానూ, మానసికంగానూ , మేధోపరంగానూ, అభివృద్ధి చెందలేరు. ఇవి అనేక వ్యాధులను కలిగిస్తాయి. మారిన కాలానికి అనుగుణంగా విద్య నేర్చకపోవడం వలన పనిచేసే రంగంలో నాణ్యతను కోల్పోయి అక్కడి నుండి నెట్టబడి నిరుద్యోగులుగా తయారవుతారు. తరువాత వీరికి ఉపాధి దొరకక దొంగలుగా, స్మగ్లర్లుగా, గూండాలుగా, మాఫియా ముఠా సభ్యులుగా తయారయ్యే అవకాశాలు ఉంటాయి. అసంఘటిత రంగంలో పనిచేసే కారణాన్న హక్కులు, కనీస వసతులు మృగ్యమవుతాయి. తెలిగ్గా మోసానికి గురవుతారు. వారి కష్టానికి తగిన వేతనం లభించదు. శ్రమ దోపిడీకి గురవుతారు. సామాజిక భద్రతా చర్యలు వర్తించవు. వేతనాలు అతితక్కువ. పని పరిస్థితులు భయంకరంగా ఉంటాయి

**పరిష్కారాలు:** పేదరికాన్ని తగ్గించాలి. తల్లిదండ్రులు, కుటుంబంలో వయోజనులు జీవనోపాధి పొందితే పిల్లలు పనిచేయాల్సిన అవసరం ఉండదు. పనిచేసే బాలకార్మికులును గుర్తించి విద్యనందించాలి. చట్టాల ప్రకారం ఉల్లంఘించే వ్యక్తుల మీద, సంస్థల మీద చర్యలు తీసుకోవాలి. వీళ్లకు ప్రత్యేక పాఠశాలలు తెరవాలి. సరైన పోషకాహారం అందేటట్లు చూడాలి. మానసిక వైద్యులచే కౌన్సిలింగ్ ఇప్పించాలి. కేవలం ప్రభుత్వాలు మాత్రమే ఈ పనిని చెయ్యలేవు. స్వచ్ఛంద సంస్థలు సమాజంలో ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకోవాలి. ఈ అనాగరిక బాలకార్మిక వ్యవస్థను అంతం చేయాలి.

జనక మోహన రావు దుంగ
8247045230

## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శాంతిభద్రతలకు భంగం కలిగించే, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్, మండలి ఎన్నికల అనంతరం ఆకతాయిలను అదపు, గంజాయి, గుట్కా విక్రయాలపై దృష్టి సారిస్తామన్నారు. గత కొన్ని రోజుల క్రితం రోడ్లపై ఆకతాయిలు కొట్టుకోవడం వెనుక రౌడీ షీటర్లు ఉన్నట్లు గుర్తించామని వారిపై మూడు కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి రవాణా చేసినా, అమ్మినా, సేవించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, కఠిన శిక్షలు పడేలా చేస్తామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీస్ చట్టాన్ని, శాంతిభద్రతలను పకడ్బందీగా అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సీఐలు జి.సుధాకర్, పి.నాగార్జున, వీరబాబు, ఎస్ఐలు శ్రీనునాయక్, రాంబాబు, శేఖర్, విజయ్‌కుమార్, శోభన్‌బాబు, ఇరుగు రవికుమార్‌లు ఉన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాల్లో ఫలితాలు రాబట్టాలి

ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని దేవరకొండ ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మండల విద్యాధికారులు, కస్తూర్బా, మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఎంఎల్‌ఎ బాలునాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యుత్, తాగునీటి, టాయిలెట్లు, ప్రహరీగోడల నిర్మాణం తదితర మౌలిక వసతుల కొరకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వేలాదిగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటిల ద్వారా పూర్వ వైభవం తీసుకురావడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పాఠశాల పరిసరాలలో తన సొంత నిధుల నుండి సిసి కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ఎంఎల్‌ఎ బాలునాయక్ హామీ ఇచ్చారు. పాఠశాలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఎంఎల్‌ఎను సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారులు, కేజిబివి, మోడల్ స్కూల్‌ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు మంజూరైన 36 చెక్కులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంచలంచలుగా అన్ని వర్గాల ప్రజలకు కళ్యాణ్ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను అందజేస్తామని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మూడు నెలల్లోనే పార్లమెంటు ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో సంక్షేమ పథకాలు అమలు ఆలస్యం అయ్యాయని ఇకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎరుకల సుధాకర్ గౌడ్, జెడ్పిటిసి గోలి ప్రణీత పింగళి రెడ్డి, వైస్ ఎంపీపీ వాకిటి గణేష్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మెట్టు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి నరేందర్ రెడ్డి, టంటం భార్గవ్, తహసిల్దార్ ఎం.శ్రీధర్, ఎంపీడీవో కే.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘంలోని అవినీతిపై విచారణకు డిమాండ్



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో జరిగిన అవినీతి పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు సహకార సంఘం ఏదుట మంగళవారం ధర్నా చేశారు. సభ్యులకు తెలియకుండానే కొత్త ఆర్డర్ ఫారాలను నమోదు చేశారని తెలిపారు. చేనేత సహకార సంఘం ఆస్తులను అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చేనేత కార్మికుల వాటా ధనాన్ని కొల్లగొట్టటానికి పాలకవర్గం ప్రయత్నిస్తుందని అన్నారు. అధ్యక్షులను కార్మికులు ప్రశ్నిస్తే కేసులు పెట్టిస్తామని భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.చేనేత కార్మిక సంఘం నాయకులు గోశిక స్వామి, నాయకులు గుర్రం నర్సింహ్మా, గోశిక బిక్షపతి, గోశిక రవి, పురుషోత్తం, వనం ధనంజయ్య, బడుగు కృష్ణ, సుదర్శన్, సుంకి రవి, కర్నాటి జనార్దన్, నారాయణ, బాల్యం చంద్రయ్య, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవాహానికి అడ్డుగా వేసిన రోడ్డు తొలగించాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** మండలంలోని కర్వీరాల గ్రామ శివారులో చెరువు ప్రవాహానికి అడ్డుగా వేసిన రోడ్డును తొలగించాలని ఐబి ఈఈ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కర్వీరాల గ్రామ శివారులో వేసిన రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు ప్రవాహానికి అడ్డుగా రోడ్డు వేసిన వెలుగు సునీల్‌ను ఈ రోడ్డును 20 మీటర్ల వరకు తొలగించాలని సూచించారు. చెరువు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నందున పైనా ఉన్న పంట పొలాలు మునిగే అవకాశం ఉందని, వెంటనే తొలగించి అడుగుభాగం నుండి కాంక్రిట్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ నవీన్ కుమార్, ఏఈ శ్రీకాంత్, ఆర్‌ఐ మహమూద్ అలీ, రైతులు అమరేందర్ రెడ్డి, సునీల్, వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్య సర్వతోముఖాభివృద్ధికి కమిషన్

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, జిల్లా కలెక్టరు హనమంత్ కే. జెండగే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు మాట్లాడుతూ అందరికీ విద్యావకాశాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమీషన్‌ను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ బడుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి ప్రభుత్వ బడులను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో భర్తీలను డిప్యుటేషన్, బదిలీల ద్వారా భర్తీ చేయడం జరుగుతుందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పనులను పరిశీలిస్తూ మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని, ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పాఠశాలలను రేపటి నుండి తిరిగి ప్రారంభిస్తామని, వారి చేతుల మీదుగా విద్యార్థులకు డ్రెస్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యా విధానంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి 2 వేల కోట్లు కేటాయిస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. శాసనసభ్యులకు ప్రత్యేక అభివృద్ధి పనుల క్రింద పది కోట్లు ఇస్తే అందులో 2 కోట్లు పాఠశాలల అభివృద్ధికి కేటాయించడం జరిగిందని తెలియచేస్తూ పాఠశాలల అవసరాలకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అన్ని పాఠశాలలను సమానంగా అభివృద్ధి చేయాలని, వసతులు కల్పించాలని సూచించారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య మీద ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రతి పల్లెలో పాఠశాల ఉండాలని వారి ఉద్దేశ్యమని, అందుకోసమే మూతబడిన బడులను తెరవాలని ఆదేశించారని, ప్రభుత్వ కార్యక్రమాలలో అధికారులు ప్రజాప్రతినిధులను వంద శాతం భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, పౌర సరఫరాలు, విద్య, పంచాయితీరాజ్, రోడ్లు భవనాలు, నీటిపారుదల, మిషన్ భగీరథ, ఉద్యానవనం, గ్రామీణాభివృద్ధి, వైద్యం, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు కార్యక్రమాల అమలు, లక్ష్యాలను, ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు కే.గంగాధర్, పి.బెన్ షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బీకూ నాయక్, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో పాఠశాల పునః ప్రారంభం

కలెక్టర్ వెంకట్రావ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంకతో కలిసి వెబెక్స్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రం చేసి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పాఠశాలలను ప్రారంభించాలన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని పాఠశాలల్లో మున్సిపల్ చైర్మన్లులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం స్వయం శక్తి సంఘాలతో దుస్తులు కుట్టించి విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, మండల ప్రత్యేక అధికారులు పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## డిసిసిబిలో అవినీతి జరగలేదు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిసిసిబి చైర్మన్ పదవిపై ఆ పార్టీ డైరెక్టర్లకు ఆశ పుట్టింది.. కానీ సంస్థలో అవినీతి జరిగిందని.. ఏకపక్ష నిర్ణయాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేయడం సరికాదని.. తన హాయాంలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే నల్లగొండ గడియారం సెంటర్‌లో ముక్కు నేలకు రాసి క్షమాపణ కోరుతానని డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. డిసిసిబి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఆర్థికంగా బలహీనపడి లాస్‌లో నడుస్తున్నటువంటి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును పాలకవర్గం, అధికారుల సమిష్టి కృషితో అన్ని రంగాలలో పురోగాభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 40 బోర్డు సమావేశాలు నిర్వహించి పాలకవర్గం చేసిన తీర్మాణాలనే అమలు చేయడం జరిగింది తప్పా ఏనాడూ తన వ్యక్తిగతంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదన్నారు. రాజకీయ విభేదాలు లేకుండా నాటి నుంచి నేటి వరకు బ్యాంకును లాభాల బాటలో తీసుకుపోవడం వల్ల జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో పాటు గతంలో రాష్ట్రంలో 9వ స్థానంలో ఉన్న నల్లగొండ డిసిసిబిని రెండవ స్థానంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. తాను చైర్మన్ బాధ్యతలు చేపట్టిన కాలం నాటికి 900 కోట్లు ఉన్న బ్యాంకును 2,400 కోట్ల వరకు పెంచుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా రెండున్నర కోట్ల లాసుతో ఉన్న వాటిని 105 కోట్ల లాభాలలో నడుపడమే కాకుండా ఎన్‌పిఏను 11 శాతం నుండి 1.83 వరకు పెంచుకోవడం జరిగిందన్నారు. తాను చెప్పిన లాభాలు, నష్టాలలో ఎలాంటి అక్రమాలు జరిగినా జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలతో విచారణ కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించి అవినీతి జరిగినట్లు నిరూపించాలన్నారు. మారుతున్న రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీకి డైరెక్టర్లు సంఖ్య పెంచుకొని చైర్మన్ పదవిని పొందాలని చూస్తున్నారే తప్పా ఎలాంటి అవినీతి ఏకపక్ష నిర్ణయాలు సంస్థలో జరుగలేదన్నారు. ఇప్పటికైనా డైరెక్టర్లంతా ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. అదేవిధంగా తనపై పెట్టిన అవిశ్వాసంపై బిఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సీఎం కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి జగదీష్ రెడ్డిల నిర్ణయాల మేరకు ముందుకెళ్తామని, తాము కూడా రాజకీయాలు చేస్తున్నామని అవిశ్వాసాన్ని ఎలా ఎదుర్కోవాలో తమకు కూడా తెలుసన్నారు.

## సుశీలమ్మ మృతికి సిపిఐ నాయకుల సంతాపం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** కెవిపిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు తల్లి అయిన మర్రి సుశీలమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందడం జరిగింది. సుశీలమ్మ మృతదేహాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజనాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సిపిఐ నాయకులు బెల్లకొండ గోవిందుగౌడ్‌లు సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

**సుశీలమ్మ కుటుంబానికి సానుభూతి తెలిపిన జూలకంటి రంగారెడ్డి**

కెవిపిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు తల్లి అయిన మర్రి సుశీలమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించారు. ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో కోట గోపి,సిరికొండ శ్రీను, సుంకర వెంకటేశ్వరరావు, నీలా రామ్మూర్తి,అరబండి ప్రసాదరావు, అల్వాల శ్రీధర్,ముశం నరసింహ పాల్గొన్నారు.

## మసకబారుతున్న ప్రభుత్వవిద్య

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఎఐఎస్ఎఫ్ బృందం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్య మసకబారుతుందని ఒకప్పుడు వందలాది మంది విద్యార్థులతో వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలలు నేడు వెలవెలబోతున్నాయని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం ఖమ్మం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యమైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీలు పెట్టి ఫోటోలు దిగి బడిబాట ప్రచారం నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రారని రామకృష్ణ తెలిపారు. గత పదేళ్లుగా ఉపాధ్యాయుల నియమాకం లేకపోవడం, ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించక పోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించి ఉపాధ్యాయ నియమాకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అవలంభించిన విద్యా వ్యతిరేక విధానాలను ఇప్పటి ప్రభుత్వం కూడా అనుసరిస్తుందన్నారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరి ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, హరికృష్ణ, బాలాజీ, మనోజ్, అయ్యప్ప, ప్రసాద్, నవీన్, సాయి, నరేష్, గోపి, ప్రతాప్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

## భువనగిరిలో ఎమ్మెల్యే పర్యటన



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి అర్బన్ కాలనీ 1వ, 15వ వార్డులు, హౌసింగ్ బోర్డ్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పిసిసి డెలిగేట్ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్, మండల అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, మాజీ కౌన్సిలర్ అనిల్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో తీన్మార్ రచ్చ?

పోలీస్ స్టేషన్‌కు చేరిన మల్లన్న పంపిన 60 లక్షల పైసల పంచాయతీ

నల్లగొండలో ఓ యూట్యూబ్ చానల్ నిర్వహకుడిపై ఆగ్రహం

**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలో రభస సృష్టించాయి..ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించిన ఆనందం ఆ పార్టీకీ లేకుండా పోయింది. నల్లగొండ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు,నాయకులకు, మంత్రి కోమటిరెడ్డికి తెలీకుండానే మల్లన్న నేరుగా డబ్బులు పంపించడమే ఈ రభసకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఆ పార్టీ నుండి బరిలోకి దిగి విజయం సాధించిన తీన్మార్ మల్లన్న నల్లగొండకు చెందిన ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వహకుడిని మధ్యవర్తిగా పెట్టి డబ్బులు పంచిన విషయం బయటకు పొక్కడంతో ఈ పంచాయతీ ఏకంగా టు టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. తనకు కోమటిరెడ్డి వర్గం సహకరించడం లేదంటూ నేరుగా తీన్మార్ మల్లన్న తనను సంప్రదించారని ఆ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు ఏకంగా తన యూ ట్యూబులో వీడియో పోస్ట్ చేయడంతో ఈ పంచాయతీ ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీని కుదిపివేస్తుంది. సదరు యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడికి తీన్మార్ మల్లన్న పంచమని ఇచ్చిన మొదటి దఫాలో 20 లక్షలు, రెండవ దఫాలో 40 లక్షలు మొత్తం 60 లక్షలు డబ్బులు పంపినట్లు సమాచారం. అయితే అట్టి డబ్బులు పంచకుండానే తన స్నేహితులు, మిత్రులతో పాటు పేరు మోసిన కౌన్సిలర్లకు తులమో ఫలమో ఇచ్చి పెద్ద మొత్తంలో ఇచ్చినట్లు లెక్కలు రాయడంపై విషయం తెలుసుకున్న తీన్మార్ మల్లన్న మనుషులు ఏకంగా ఆ యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడి ఇంటికి చేరి రచ్చ రచ్చ చేయడంతో ఈ వివాదం కాస్తా చిలికి చిలికి గాలి వానగ మారడమే కాకుండా ఇప్పుడు పెను తుఫాన్ గా మారింది. తీన్మార్ మల్లన్న మనుషులు రంగంలోకి దిగడంతో తనకు వచ్చిన డబ్బుల లెక్కను సదరు యూ ట్యూబ్ నిర్వాహకుడు అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకుల పేర్లతో పాటు ఆయనకు నచ్చిన కొంతమంది మీడియా ప్రతినిధుల ఓ లిస్ట్ ఇవ్వడం జరిగింది. ఆ లిస్ట్ బయటకు సోషల్ మీడియా ద్వారా రావడంతో ఇంతటి దుమారనికి కారణంగా కనిపిస్తుంది. అయితే ఆ లిస్ట్‌లో సదరు యూ ట్యూబ్ నిర్వాహకుడు చెప్పిన రీతిలో చెల్లింపులు జరగలేదని తమకు వేలు ఇచ్చి లక్ష ఇచ్చానని, ఒక లక్ష ఇచ్చి రెండు లక్షలు ఇచ్చానని, ఇవ్వనివారి పేర్లను కూడా ఇచ్చినట్లుగా లిస్టులో రాయడంతో తీసుకునేవారు తీసుకోనివారు అంతా టు టౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చి పోలీసుల ఎదుటనే సదరు యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడిని నిలదీసిన వీడియోలు బయటకు పొక్కడంతో ఇప్పుడు ఆ చర్చ రాష్ట్ర వ్యాప్తంగా పాకింది. అయితే మల్లన్న ఇచ్చిన డబ్బులు, యూట్యూబ్ చానెల్ నిర్వాహకులు పంచిన డబ్బులు లెక్క తేలకపోవడంతోనే ఈ పంచాయితీ అంతా బజారున పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# భూ తనువు తడపని గోదారి

దశాబ్దాలుగా రైతుల ఎదురు చూపు

అటకెక్కిన దుమ్ముగూడెం -

సా...గుతున్న సీతారామ

రేపు మంత్రుల పరిశీలన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తలాపునే జీవనది గోదావరి ప్రవహిస్తుంది. కాని భూతల్లి తనువు తడపకుండానే వందలాది టిఎంసిల నీరు సముద్రం పాలవుతుంది. గోదారి నీళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా భూములు తడపాలని, ప్రాజెక్టులు నిర్మించాలని అనేక దశాబ్దాలుగా పోరాటాలు సాగాయి. ఎట్టకేలకు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఉమ్మడి రాష్ట్రంలో అది ముందుకు సాగలేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఎకరాకు సాగునీటిని అందించిన దాఖలాలు లేవు. పరిస్థితులు మారాయి. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. అప్పటి పాలకులు తప్పు చేశారు ఇప్పుడు మేము త్వరితగతిన గోదారి నీళ్లను ఉమ్మడి ఖమ్మం జిల్లా భూముల్లో పారించి రైతుల మోములో నవ్వులు పుయిస్తామంటూ సీతారామ పేరుతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు దాదాపు ఎనిమిదేళ్లు గడిచినా ముందుకు సాగలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు జిల్లాకు చెందిన మల్లు భట్టివిక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనసాగుతున్నారు. వీరి హయాంలోనైనా గోదారి నీళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా భూములకు అందుతాయని ఆశిస్తున్నారు. ఇదే క్రమంలో సాగర్ కాలువకు గోదారి నీళ్లను అనుసంధానం చేయాలన్న ప్రయత్నం శీఘ్రగతిన సఫలీకృతం కావాలని రైతులు కోరుతున్నారు.

**గోదారి నీళ్ల కోసం దశాబ్దాల పోరాటం :**

రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో గోదావరి 180 కిలో మీటర్ల మేర ప్రవహించేది. అప్పట్లో అధికారుల అంచనా ప్రకారం 700 టిఎంసిల నీరు గోదావరి నుంచి సముద్రంలో కలిసి పోతుందని అంచనా వేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా ఖమ్మంజిల్లాలోని ఒక ప్రాంతానికే నీరు అందడం, అది కూడా సరిగా అందక పోవడం అందరికీ తెలిసిందే. కృష్ణానది ఎగువ భాగంలో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టులు నిర్మించడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిన వేళ గోదారి నీళ్లపై దృష్టి సారించాల్సి వచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ తొలిసారిగా గోదావరి పై దుమ్ముగూడెం పై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి సాగునీటిని అందించాలని ఆందోళనకు శ్రీకారం చుట్టింది. నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్ అలీ నేతృత్వంలో అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఆ తర్వాత కూనంనేని సాంబశివరావు జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం సాధన కోసం జిల్లా దిగ్బంధనం లాంటి అనేక కార్యక్రమాలతోపాటు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమం కూడా నిర్వహించారు. సిపిఎం సహా జిల్లాలో మిగిలిన రాజకీయ పార్టీలు సైతం వివిధ రూపాల్లో గోదావరి నీళ్ల కోసం పోరాటాలు నిర్వహించాయి. ఈ క్రమంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత వామపక్షాలతో పాటు ఇతర పార్టీల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా గోదావరి జలాలను అందించాలనే లక్ష్యంతో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేర్లతో గోదావరిపై రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ పేరుతో అశ్వాపురం మండలంలో గోదావరి పైన ఎత్తిపోతల నిర్మాణానికి అప్పటి వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట వద్ద ఇందిరా సాగర్ పేరుతో శంకుస్థాపన చేశారు. ఇందిరా సాగర్‌కు రూ. 1200 కోట్లు, రాజీవ్ సాగర్‌కు రూ.1800 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రాథమిక సమాచారం. కాని ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రాజెక్టుల ద్వారా దశాబ్ద కాలం గడిచినా సాగునీటిని అందించలేకపోయారు. కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు, కమిషన్ల పాలయ్యాయి తప్ప ఫలితం దక్కలేదు.





**రాష్ట్ర విభజనతో ప్రాజెక్టులలో మార్పు**

సుదీర్ఘ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గోదావరి ప్రాజెక్టుల నిర్మాణ డిమాండ్ మరో సారి తెరపైకి వచ్చింది. 2016 ఫిబ్రవరి 16న అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని సాగు భూములతో పాటు ఇప్పటి మహబూబాబాద్ జిల్లాలోని మూడు మండలాలకు సాగునీటిని అందించేవిధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నట్లు ప్రకటించారు. నూతన ఆయకట్టుతో పాటు పాత ఆయకట్టు స్థిరీకరణ ద్వారా ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని 70 టిఎంసిల నీటిని ఎత్తిపోయాలని ప్రాజెక్టును డిజైన్ చేశారు. 2016 నుంచి 2023 వరకు ఈ ప్రాజెక్టు పనులు నత్త నడకను తలపింపజేశాయి. హెలికాప్టర్లలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలన చేయడం తప్ప నిధుల కేటాయింపు, పనులలో వేగం జరగ లేదు. అంతే కాకుండా తొలుత రూ.8వేల కోట్ల నుంచి బడ్జెట్‌ను రూ.13వేల కోట్లకు పెంచారు. ఆ తర్వాత రూ. 15వేల కోట్లకు పెరిగినట్లు సమాచారం. ఇప్పుడు రూ. 18,900 కోట్లు ఖర్చు కానున్నట్లు తెలుస్తుంది.

**ఇప్పుడైనా రైతాంగం కల నెరవేరేనా..?**

గోదావరి నీళ్లను సాగునీరుగా చూడాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం అనేక దశాబ్దాలుగా ఎదురు చూస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేసుకున్న గోదావరిపై ఎత్తిపోతల పథకం మాత్రం పూర్తి కాలేదు. గోదావరి నీళ్లను సాగునీటిగా అందించాలని ఒక రైతుగా తపించిన ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతల్లో ఉండడం దుమ్ముగూడెం రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ గురించి విపక్ష నేతగా పలుమార్లు ప్రస్తావించి గోదావరి నీళ్లతోనే ఉమ్మడి ఖమ్మంజిల్లా సాగునీటికి శాశ్వత పరిష్కారమని చెప్పిన భట్టివిక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా ఉండడం ఖమ్మంజిల్లా అభివృద్ధిపై అవగాహన కలిగి రైతు కుటుంబం నుంచి వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ మంత్రిగా ఉండడంతో ఈ దఫా రైతుల ఆశలు రెట్టింపయ్యాయి. రైతాంగ ఆశలకు అనుగుణంగానే సీతారామపై తరచూ మంత్రులు సమీక్ష చేస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. కాని నిధుల కేటాయింపులో వెలితి ఈ ప్రాజెక్టు పూర్తి పై అనుమానాలను రేకెత్తిస్తుంది. ఇక గోదావరి నీళ్లను నాగార్జున సాగర్ ఎడమ కాలువకు ఏన్కూరు మండలంలో అనుసంధానం చేయడం ద్వారా అటు సాగర్ ఆయకట్టు రెండవ, మూడవ జోన్లకు నీరందించడం జిల్లాలోనే అతిపెద్ద మధ్యతరహా ప్రాజెక్టుగాఉన్న వైరా ప్రాజెక్టు ఆయకట్టును గోదావరి జలాలతో స్థిరీకరించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఆర్థిక మంత్రిగా సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని ఖమ్మంజిల్లా రైతాంగం భట్టి విక్రమార్కను కోరుతున్నది. ఈనెల 13న జిల్లా మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ ప్రాజెక్టు ను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌కు సాగునీరు అందక పోయినా వచ్చే ఏడాది కైనా సాగునీటిని అందించేందుకు కృషి జరగాలని ఖమ్మం జిల్లా రైతాంగం కోరుతుంది.

## లింగారెడ్డి ఆశయ సాధనకు పోరు

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు



ప్రజాపక్షం/హసన్ పర్తి : సీపీఐ సీనియర్ నాయకులు, ఎర్ర జెండా ముద్దు బిడ్డ గంగిళ్ల లింగారెడ్డి ఆశయాల సాధనకు నేటి తరం పోరాడాలని బీకెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. మండలంలోని ఎల్లాపూర్ గ్రామంలో మంగళవారం లింగారెడ్డి భౌతిక కాయానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. లింగారెడ్డి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా లింగరెడ్డి మట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి సీపీఐ చేస్తున్న పోఆరాటాలకు ఆకర్షితులై చిన్న నాటనే సీపీఐలో చేరి గ్రామ, తాలూకా, జిల్లా నాయకుడిగా ఎదిగి క్రమ శక్షణతో, అకుంఠిత దీక్షతో పోరాటలు నిర్వహించారని అన్నారు. జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. వారి మరణం కార్మిక, కర్షక,శ్రమ జీవులకు తీరని లోటన్నారు. వెంకట్రాములు వెంట బీకేఎంయు జాతీయ సమితి సభ్యులు మోతె లింగారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి రాజయ్య, నాయకులు బుచ్చి రెడ్డి,వెంకటేశ్వర్లు, సాంబయ్య తదితరులు ఉన్నారు.

## ఫీజు నియంత్రణ చట్టంపై మాట్లాడరా?



ప్రజాపక్షం/ నర్సంపేట : ప్రైవేట్ స్కూళ్లలో ఫీజ్ నియంత్రణ చట్టం అమలుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, ఏబిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అల్వాల నరేష్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతిపత్రాన్ని నర్సంపేటలో విద్యార్థి సంఘాల నాయకులు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిఆర్మణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఉన్న ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్, మెడికల్, ఐఐటి, డిజి, టెక్నో పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలో ప్రభుత్వ నియమాలు పాటించకుండా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, టై, షూలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కొండంపల్లి భూనిర్వాసితుల పరిహారానికి కృషి : గండ్ర



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓపెన్‌కాస్ట్ గని 3 విస్తరణలో భూములు కోల్పోయిన గణపురం మండలం కొండంపల్లి గ్రామ భూ నిర్వాసితులకు భూ చట్టం ప్రకారం పరిహారాన్ని అందించేలా కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి కలెక్టరేట్ లోని ఐ డి ఓ సి మీటింగ్ హాల్ లో సింగరేణి ఓసి 3 భూసేకరణలో భూములుకోల్పోయినకొండంపల్లిగ్రామస్తులతోజరిగిన డిఎల్ఎన్ మీటింగ్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ వ్యవసాయ భూములకు ధరలకు అనుగుణంగా కొండంపల్లి గ్రామ భూ నిర్వాసితులకు భూ చట్టం ప్రకారం పరిహారం అందేలా చూస్తానని రైతులను అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, సింగరేణి జీఎం హాబీబ్ హుస్సేన్, ఎస్వో టు జీఏం కవింద్ర తదితరులు ఉన్నారు.

## డబుల్ ఇండ్ల అక్రమాలపై వినతి



ప్రజాపక్షం/గజ్వేల్: గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా, అనర్హులకు పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్ల మంజూరీపై సర్వే నిర్వహించాలని కోరుతూ మంగళవారం డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ కాంగ్రెస్ నేతలు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంఛార్జి మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. సర్వే అనంతరం అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేయాలని, అనర్హులను తొలగించాలనికోరారు.మంత్రినికలిసినవారిలోమాజీఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సందేబోయిన ఎల్లయ్య, నేతలు రమేష్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, మోహన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంచండి



ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ జంగాలపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభ బడి బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామాలలో ప్రత్యేకంగా విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్య గ్రామాలలో ఉండే విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపిడిఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భోజన కార్మికులకు రూ.10వేలు వేతనం ఏది?




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : జిల్లాలోని డివో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారికి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పైన మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఐదు నెలల నుండి మధ్యాహ్న భోజన కార్మికులకు పిల్లల మెస్ బిల్లులు, డిసెంబర్ నుండి కోడిగుడ్ల బిల్లులు, జనవరి నుండి వేతనాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పదివేల వేతనాన్ని అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన కార్మికులు 150 మంది ధర్నా చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాన్నే ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తున్నదని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎన్నికలలో ప్రకటించిన పదివేల వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు 24 సంవత్సరాల నుండి ప్రభుత్వ స్కూల్లో నాణ్యమైన భోజనము పిల్లలకు వండి పెడుతున్నాము కానీ గత ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదు నిత్యవసర సరుకులు పెరుగుతూనే ఉన్నాయి. పిల్లల మెస్ ఛార్జీలు పెంచడం లేదు వెంటనే పిల్లల మెచ్చార్జీలు ఒక విద్యార్థికి 25 రూపాయల చొప్పున చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులకు ఈఎస్ఐపి పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆరోగ్య భీమా అమలు చేయాలని ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వేషం లక్ష్మణ్ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ వంట కార్మికులను తొలగించడం ఆపాలని వంట కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వంట కార్మికులకు డ్రెస్ కోడ్ అమలు చేయాలని నిత్యవసర సరుకులు ప్రభుత్వమే సప్లై చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నడిబొట్టి లక్ష్మీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు 24 సంవత్సరాల నుండి కష్టాల్లో వెల్లదీస్తున్నామని నెల నెల జీతాలుబిల్లులుచెల్లించాలని, వేతనాలు ఇవ్వాలని డిమా ండ్ చేశారు. జిల్లా నాయకులు బి రెడ్డి, లక్ష్మి జుబేదా, నర్సవ్వ, మానస లావణ్య, నరసవ్వ, మణెమ్మ, రాజేశ్వరి,లక్ష్మి,కొమరవ్వ సాయిలు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాటతోనే వికాసం



### కలెక్టర్ క్రాంతి వల్లూరు

ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి: సదాశివపేట మండలంలోని కోనాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల పిఎస్ఎం ఎల్ కాలనీ లోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమన్ని కలెక్టర్ వల్లూరి క్రాంతి పరిశీలించారు. కోనాపూర్ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో ఆమె మాట్లాడారు. బడి ఈడు పిల్లలను ,బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా బడి బాట కార్యక్రమాన్ని తలపెట్టిందన్నారు. ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహించి ఐదు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మౌళిక వసతులు కల్పనకు 29 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు.

## 'నీట్' అవకతవకలపై స్పందించరేం?




ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి: వైద్య కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజి ఫలితాల అవకతవకలపై సుప్రీం కోర్టు సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని, ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి డిమాండ్ చేశారు. వరంగల్ కాశిబుగ్గ అంబేద్కర్ సెంటర్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈనెల 04వ తేదిన నీట్ 2024 ఫలితాలను ప్రకటించింది. అయితే ఈ ఫలితాల్లో 67మంది విద్యార్థులు 720కి 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందన్నారు. హర్యానాలోని పరీక్షా కేంద్రంలో ఒకే గదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8మంది విద్యార్థులకు 720కి 720 రావడం ఈ పరీక్ష పత్రం లీక్ అయిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈపరీక్షలో నెగెటివ్ మార్కులు ఉన్నాయని, ప్రతి ప్రశ్నకు సరైన సమధానానికి నాలుగు మార్కులు, ఒక తప్పు సమాధానానికి ఒక నెగెటివ్ మార్కు ఉటుందని, అటువంటి పరిస్థితిలో ఎవరైనా అన్ని ప్రశ్నలకు సరైన సమాధానం రాస్తే వారికి 720మార్కులు వస్తాయని, ఒక ప్రశ్న వదిలేసిన నాలుగు మార్కులు వస్తాయన్నారు. నీట్ పరీక్షలో కొన్ని సెంటర్‌లో విద్యార్థులు సమయం కొల్పోవడం వల్ల వారు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే గ్రేస్ మార్కులు ఇచ్చామని ఎన్టీ వివరించిందని, అయితే ఏ ప్రాతిపదికన ఎంత గ్రేస్ మార్క్ ఇచ్చారో మాత్రం ఎన్టీ స్పష్టత ఇవ్వలేదన్నారు. కేవలం కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు మాత్రమే గ్రేస్ మార్కులు ఇచ్చారని, మిగతవారికి గ్రేస్ మార్కులు కేటాయించకపోవడం పట్ల విద్యార్థులు దేశ శ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిమస్కా సుధీర్,జిల్లా నాయకులు గణేష్, సారయ్య,సుమన్, అమీర్‌పాల్గొన్నారు.

# వరదముంపు నివారణ పనులపై దృష్టి



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం వరంగల్ తూర్పు నియోజకవర్గం 28వ డివిజన్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం పర్యటించారు.లోతట్టు ప్రాంతాలైన సంతోష్‌మాత కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సాయినగర్ కాలనీలను ఆమె సందర్శించారు. వర్షకాలంలో బొందివాగు సమస్య వల్ల కాలనీలు మునిగిపోయి ప్రజలకు తీవ్ర ఆస్తి నష్టం జరుగుతుందని భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అధ్యక్షుడు మర్రి రవీందర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నీట మునుగుతున్నటువంటి కాలనీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ. 158 కోట్లు కేటాయించడం జరిగిందని, దానికి సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. కమిషనర్ ఆధ్వర్యంలో మర్రి రవీందర్ పలు సూచనలు చేశారు. వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్, సానిటేషన్ అధికారులకు ఆదేశించారు. హన్మకొండ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామకృష్ణ కాలనీ, ఎస్‌బీహెచ్ బ్యాంకు కాలనీ, ప్రగతి నగర్, కుడా కాలనీ, సమ్మయ్యనగర్, నయీంనగర్, బొక్కల గడ్డ, హన్మకొండ బస్టాండ్ రోడ్డు ప్రాంతాలతో పాటు వరంగల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామన్నపేట 12 మోరీల ఏరియా ఖమ్మం బైపాస్ రైల్వే బ్రిడ్జి, బీఆర్‌నగర్, నాని గార్డెన్ ఏరియా, కడిపికొండ రోడ్డు ఏరియా, డీకే నగర్, గరీబ్ నగర్, మేసయ్య నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. కమిషర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురిసే క్రమంలో ఇంజినీరింగ్, సానిటేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమష్టిగా పనిచేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రధానంగా బల్దియా పరిధిలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు సాంబయ్య, నరేందర్, డీఈలు, టీపీఓలు, ఏఈలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, అధికారులు, డివిజన్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత తప్పనిసరి

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: రహదారుల పనులు నాణ్యతతో చేపట్టాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం సమావేశం మందిరంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకర్గ సమీక్ష సమావేశం జరిగింది. పంచాయితి రాజ్, ఐటీడీఏ ఏటూరు నాగారం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల పనులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. కడియం మాట్లాడుతూ విద్యా, వైద్యానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రజలకు ఉపయోగకరమైన ప్రాధాన్యత గల రహదారులను మాత్రమే చేపట్టాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పంచాయితిరాజ్ ఆధ్వర్యంలో 89 పనులకు గాను 29 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని సత్వరమే పూర్తి చేయాలన్నారు.

# రైతును దోచుకుంటున్నా పట్టదా?

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: రానున్న విద్యా సంవత్సరం, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా అధికారులకు సూచించారు.మంగళవారంభూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ కల్లెపు శోభారాణి అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ, రానున్న విద్యా సంవత్సరం, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని పలు సూచనలు చేశారు. జిల్లా డీఈవో, సివిల్ సప్లై డిఎం ఇతర శాఖల అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ శాఖల అధికారుల పనితీరు బాగాలేదని ప్రజలకి అందుబాటులో ఉండాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టిసమస్యలు లేకుండా జిల్లాలో పరిపాలన కొనసాగాలని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా పాలన ప్రభుత్వం నడుస్తుందన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్ముతూ, పత్తి విత్తనాలను అధిక ధరలకు అమ్మతున్న డీలర్లపై పీడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అట్టి కంపెనీలను పూర్తిస్థాయిలో మూసివేసే విధంగా వ్యవసాయ అధికారులు కూడా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగొద్దని, అలా జరిగిన్నట్లు తెలిస్తే ఎంత పెద్ద అధికారినైనా ఉపేక్షించేదే లేదని, నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలుపై నిర్లక్ష్యంపై తగదన్నారు. జిల్లా రైస్ మిల్లర్లు రైతులను కటింగ్ పేరుతో మోసం చేస్తున్నారని మండిపడ్డారు.జిల్లాలో ఓ రకం పత్తి విత్తన పాకెట్ల కొరత తీవ్రంగా ఉందని, ప్రభుత్వం అలాట్ చేసిన ఆరకం పత్తి విత్తన ప్యాకెట్లను డీలర్లు అధిక ధరకు అమ్ముకుంటున్నారని పలువురు జడ్పీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే అగ్రికల్చర్ డైరెక్టర్‌కుఫోన్ చేసి పత్తి విత్తన ప్యాకెట్ల కొరత లేకుండా చూడాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పి సీఈవో విజయలక్ష్మీఉన్నారు.

## బడిబాట కోసం పల్లెనిద్ర : కలెక్టర్ రాహుల్



ప్రజాపక్షం/నర్సాపూర్: బడిబాట కార్యక్రమం విజయవంతం కోసం పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న పల్లె నిద్రలో అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని ఆయన అన్నారు. సోమవారం రాత్రి నర్సాపూర్ మండలం జక్కపల్లి గ్రామంలో కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో తలపెట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ఇందుకు ప్రభుత్వ అధికారులు సైతం తప్పక హాజరుకావాలని ఆదేశాలివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా జక్కపల్లి గ్రామంలో పల్లెనిద్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానూ పాల్గొననున్నట్లుతెలిపారు.గ్రామాల్లో బడి వయసు పిల్లలు బడి బయట ఉండకూడదని బడిలోనే ఉండాలన్నారు. ఈ మేరకు ఒక్కో అధికారి 100 ఇండ్లల్లో సర్వే చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ, మండల, నియోజకవర్గాల్లో ప్రత్యేక అధికారులు పల్లె నిద్ర చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ప్రజల్లో విద్యకోసం చైతన్యం చేసి బడీడు పిల్లల అందరిని బడిలో చేర్పించాలని, ఒక్క విద్యార్థి కూడా బయట ఉండకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి తిరిగి విద్యా గొప్పతనాన్ని భోదిస్తునే విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ మండల అధికారులు ఖచ్చితంగా 100 ఇండ్లను సర్వే చేసి బడీడు పిల్లలను బడికి పంపించేవిదంగా తల్లిదండ్రులను ఒప్పించాలని ఆయన అన్నారు. ఈమేరకు నర్సాపూర్ మండలంలోని జక్కపల్లి గ్రామంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ఉదయం మంగళవారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులకు తల్లిదండ్రులకు చదువు పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎంపీడీవో మధులత, తాసిల్దార్ కమలాద్రి, మండల విద్యాధికారి బుచ్చా నాయక్, ఎంపీఓ శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# రైతుకోసం సాగుకు సాంకేతికతను జోడిస్తాం

### వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య





ప్రజాపక్షం/ నర్సంపేట : రైతు నేస్తాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. హైదరాబాద్ నుండి నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా రైతులనుద్దేశించి మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయల్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలు క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లడం కొరకు ప్రతి మంగళవారం, శుక్రవారం విస్తరణాధికారులు రైతులతో రైతు నేసత పేరిట రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగు రంగానికి సాంకేతికతను అనుసందానం చేస్తూ రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు రైతులు వ్యవసాయ రంగంతో పాటు అనుబందంగా చేపలు, పాడి పశువుల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేలా రైతులు నూతన అలవాట్లను, విధానాలను చేసుకోవాలని సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొంటారని, రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి సత్వరమేపరిష్కరించుకోవాలన్నారు.

### విత్తన దుకాణాల్లో తనిఖీలు

నర్సంపేట మండల కేంద్రంలోని పలు విత్తనాలు విక్రయించే డీలర్ షాపులను, అగ్రో సెంటర్‌లను వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆకస్మీకంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయల్‌తో కలిసి విత్తనాల, యూరియా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరు నకిలి విత్తనాలు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని, సంబంధిత షాప్‌ను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. రైతులు ప్రసిద్దిలేని విత్తనాల కొనుగోలు చేయకూడదని కలెక్టర్ సూచించారు.

### పాఠశాలల అభివృద్ధి పనుల పరిశీలన

నర్సంపేట : అమ్మ అదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. నర్సంపేట మండలంలోని రామవరం ఎంపీపీఎస్, నర్సంపేట ఎంపీపీఎస్, నర్సంపేట ఊర్దూ మీడియం పాఠశాలలను ఆకస్మీకంగా సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటిలు గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ. 24 కోట్ల వ్యయంతో సుమారు 556 ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటిల ద్వారా అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టడం జరిగిందన్నారు. అందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు తుది దశలో ఉన్నాయని, వాటిని పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌లను అందజేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలచే కుట్టించిన ఏకరూప దుస్తులను పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్డీవో కృష్ణవేణి, సెక్టోవల్ ఆఫీసర్ సుధీర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, ఆదర్శకమిటిలు పాల్గొన్నారు.

## గంజాయి జోలికెళ్లొద్దు



ప్రజాపక్ష/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: సిరిసిల్లలోని రగుడు వద్ద గలా దంప్ యాడ్ నందు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన 41 కేసు లలో స్వాదీనపరచుకున్న 36 కిలోల 436 గ్రాముల నిషేధిత గంజాయిని జిల్లా ఎస్‌పి ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో తగులబెట్టడం జరిగింది.ఈ నేపథ్యంలో ఎస్‌పి మాట్లాడారు. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య గంజాయి. ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి తమ అమూల్యమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థవంతంగా నిరోధిస్తున్నారని అన్నారు. జిల్లాలోని పోలీసుల స్వాధీనంలో ఉన్న మిగతా గంజాయిని కూడా విడతల వారీగా చట్ట ప్రకారం తగులబెట్టుట జరుగుతుందని తెలియజేసారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై పీడీ యాక్టులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్ పి చంద్రయ్య, డీఎస్‌పి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ యాదగిరి, టౌన్ సిఐ రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేశ్వరంలో ఎఇఒల నిరసన



ప్రజాపక్షం/లోకేశ్వరంః మండలంలోని వ్యవసాయ అధికారులు ఏఈఓ లను మహబూబాబాద్ లో ఏఈఓ లను అకారణంగా సస్పెండ్ చేసిన కారణంగా మంగళవారం రోజున ముధోల్ డివిజన్ ఏఈఓలు లోకేశ్వరం లోని రైతు వేదికలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు.టి ఏఈఓ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ సస్పెన్షన్ పై సమగ్ర విచారణ జరిపించాలని అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఈఓ లపై ఉన్న సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## బస్సు సౌకర్యం కోసం వినతి



ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్: లోక్‌సభఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు మాకు బస్ సౌకర్యం కల్పించమని కోరారు.ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నది కోడ్ ముగిసిన తరువాత తప్పకుండా అధికారులతో మాట్లాడి గ్రామాలకు బస్ వచ్చేలా కృషి చేస్తాం అని చెప్పిన విధంగానే ఈ రోజు నిర్మల్ బస్ డిపో మేనేజర ప్రతిమ రెడ్డి,నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లా రెడ్డి,నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎంబరి గంగాధర్ లు ఆర్టీసీ డీఎం ను మంగళవారం కలసి అక్కాపూర్, ముఠాపూర్, న్యూవెల్మల్, బొప్పారం, కూచన్ పెల్లి మీదుగా సోన్ మండల కేంద్రం వరకు అలాగే న్యూపోచంపాడ్,భాగ్యనగర్,కిషన్‌రావు పేట్,మేడిపెల్లి,మామడ మండలంలోని బురుగుపెల్లి తాండామీదుగా బురుగుపల్లికి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.బస్ డిపో అధికారులు త్వరలోనే ఆయా గ్రామాలకు బస్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/ముధోల్: ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెలే పవార్ రామారావు పటేల్ అన్నారు. నేడు(బుధవారం) నియోజకవర్గం లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉండనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గ్రామీణ నీటి పారుదల శాఖ,పంచాయతీ రాజ్ అధికారులు సైతం అందుబాటులో ఉండనున్నారన్నారు.ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు ఉండనున్నట్లు తెలిపారు.ప్రజలు వారి స్థానిక సమస్యలు దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.ప్రజల సమస్యల కొరకు కేటాయిస్తున్న ఇట్టి సమయాన్ని సదివనియోగం చేసుకొవాలని సూచించారు.

## ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలో ఒక ఇంట్లో నిల్వ ఉంచిన అక్రమ రేషన్ బియ్యాన్ని అధికారులు, పోలీసులు మంగళవారం పట్టుకున్నారు.. దాదాపు 200 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు అధికారులు తెలిపారు.అక్రమ బియ్యంను నిల్వ చేసిన నంబయ్య అనే వ్యక్తి పై కేసు నమోదు చేశామని తెలిపారు.

## బదిలీల్లో పారదర్శకత పాటించండి

ప్రజాపక్షం/గంగాధరః ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పిఆర్‌టియు తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డిలు కరీంనగర్ జిల్లా విద్యాధికారి సిహెచ్. విఎస్ జనార్దన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌కు సంబంధించి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా విధ్యాధికారిని కోరినట్లు వారు తెలిపారు.



# ఆర్థిక పురోభివృద్ధిలో యువతే కీలకం

### తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్




ప్రజాపక్షం/గజ్వేల్ (మెదక్) : 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రము ఖ పాత్ర పోషించాలని తెలంగాణ, రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు శివారులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. దేశ స్థూల జాతీయోత్పత్తికి 18 శాతానికి పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ సాగుకు మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన, అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని, దేశంలో 70శాతానికి పైగా గ్రామీణులకుప్రధానఆదాయవనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని స్పష్టం చేశారు. విద్యార్థులు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక్కి తిరిగొద్దని పిలుపు నిచ్చారు. చదువుతో పాటు ప్రతి అంశంలో నాణ్యత చూపించినట్టయితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత, పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతో పాటు సూపర్ ఎకానమిక్ పవర్ గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గీతాలక్ష్మి స్పష్టం చేశారు. ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాని ద్వారా పంటల ఉత్పాదకత పెరుగుతుందన్నారు.ఉపాధికోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కాగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ స్వాగత ఉపన్యాసం చేసి అభివృద్ధి నివేదికను గవర్నర్‌కు అందజేశారు. మేలైన ఉద్యాన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందిస్తుందన్నారు. రైతులకు సాంకేతిక సలహాలిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ విద్యార్థులకు బంగారు పతకాలు, విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం చేశారు. కలెక్టర్ మను చౌదరి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డాక్టర్ రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డిఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ మాథూర్ పాల్గొన్నారు.

## సహజ ఎరువులకే ప్రాధాన్యం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులందరూ సంప్రదాయ పంటలు సాగు చేయాలనీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు.మంగళవారం హైదరాబాద్ నుండి రైతు వేదికల ద్వారా వీడియో కన్ఫరెన్స్‌లో సూచించారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ రైతుల నుద్దేశించి మాట్లాడారు.రసాయన ఎరువులు వాడకం క్రమంగా తగ్గించి, రైతులు సహజ ఎరువుల వైపునకు మల్లాలని సూచించారు.వ్యవసాయ అధికారులు సాంప్రదాయ పంటల సాగు,దిగుబడులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం రైతువేదికలలో పత్తి, సోయా, మొక్క జొన్న ఇతర పప్పు దినుసుల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.మహిళా రైతులు పాల్గొనేలా ప్రోత్సాహించాలని సూచించారు. రైతులు గోవింద్ రెడ్డి, భీంరావు,నారాయణరెడ్డి సాంప్రదాయ పంటలు సాగుపై వారి అభిప్రాయాలు తెలియజేసారు.అనంతరం గ్రామ పల్లె ప్రకృతి వనం, నర్సరీని కలెక్టర్ సందర్శించి పెంచుతున్న మొక్కల రకాలు, సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మిషన్ భగీరథ సర్వేను కలెక్టర్ పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఇంటి సర్వేను పకడ్బందీగా చేపట్టి,ఇంటి యజయానుల నుంచి మిషన్ భగీరథ నీటికి సంబంధించిన వివరాలను సంబంధిత అన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలనీ సూచించారు.ఆ తర్వాత డంపింగ్ యార్డ్ ను సందర్శించి ప్రతి ఇంటినుండి తడి,పోడి, చెత్తలను వేరువేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్మి కంపోస్టు ఎరువుల తయారు పరిశీలించి సిబ్బందికి ఆయన పలు సూచనలు చేసారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, రైతులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులున్నారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధి చెందేలా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యతోపాటు క్రీడలలో సైతం విద్యార్థులు రాణించేలాచూడాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో విద్యా సంవత్సరం ప్రారంభ మవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు,వ్యాయమ ఉపాధ్యాయులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి వివరించాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే కనీసం పది శాతం అదనంగా విద్యార్థుల ఎనరోల్మెంట్ పెరగాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో పాఠశాలల్లో చేరిన విద్యార్థుల జాబితా నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రైవేటు పాఠశాలకు పంపడానికి గల కారణాలు తెలుసు కోవాలని, ఆ వివరాలతో ప్రత్యేకంగా నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు టీచర్స్, విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని, ప్రతిరోజు పాఠశాలలో టీచర్స్ హాజరుపై నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు. పాఠశాలకు రెగ్యులర్ గా హాజరు కాని విద్యార్థులకు సంబంధించి జాబితా రూపొందించి వారు హాజరు కాకపోవడానికి గల సమస్యలు తెలుసుకొని, వీలైనంత వరకు పరిష్కరించి విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలలో వారానికి ఒక రోజు యోగ పీరియడ్ ఏర్పాటు చే యాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని, మధ్యాహ్న భోజన నాణ్యత అంశంలో ఎక్కడా ఎటువంటి రాజీ పడవద్దని అన్నారు. స్థలం అందుబాటులో ఉన్న పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేయాలని, పిల్లలకు మంచి పౌష్టికాహారం నాణ్యంగా, రుచిగా అందజేయాలని అన్నారు. పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ నుంచి అవసరమైన విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ అధికారి డి.మాధవి, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం షేక్ తదితరులున్నారు.

## పాఠశాలల్లో ఆధునిక హంగులు




ప్రజాపక్షం/ఇల్లందకుంటః జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల సదానందం ఆద్వర్యంలో ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను బడికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు ఉచిత బుక్కులు, పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం డిజిటల్ తరగతులు, ఎన్‌సిసి ఒకేషనల్ అధునాతన ట్యాబ్స్, కంప్యూటర్ బోధన లాంటి వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విధ్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శైలజ రవీందర్ రెడ్డి, సంతోష్, చంద్రశేఖర్, సమ్మయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌కు జోడించండి

### డిహెచ్‌పిఎస్ నాయకులవినతి



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను రామగుండం కార్పొరేషన్ లో ఆన్లైన్ చేయకపోవడం వల్ల లబ్దిదారులు కరెంట్ సబ్సిడీ మరియు గ్యాస్ సబ్సిడీ కోల్పోతున్నారని డి హెచ్ పి ఎస్ నాయకులు కందుకూరి రాజారత్నం, మద్దెల దినేష్‌గంగారపు ప్రసాద్ లు ఆరోపించారు. అనంతరం డిహెచ్పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరు గ్యారంటీ ల పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో లబ్దిదారుల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు తీసుకుందని, కాని రామగుండం కార్పొరేషన్ లో దరఖాస్తులను సరిగా ఆన్లైన్ చేయకపోవడం వల్ల లబ్దిదారులు ప్రభుత్వ సబ్సిడిలను కోల్పోతున్నారని అయిన ఆరోపించారు. కార్పొరేషన్ నిర్లక్ష్యం వల్ల లబ్దిదారులు మళ్ళీ దరఖాస్తులు కార్పొరేషన్ కార్యాలయం కు వచ్చి అందజేయడం వల్ల జిరాక్స్ రవాణా ఖర్చులు భరిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల కోడ్ రావడంతో మొత్తానికే అన్ లైన్ చేయడం నిలిపివేశారు.కోడ్ ముగియడంతో సవరణపై ఆశలు పెట్టుకుంటే ఇంతవరకు కూడా ఆన్లైన్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రారంభించలేదనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లాలో పెద్దపల్లి, మంథని డివి జన్ల పరిధిలో మొత్తం 2,06,518 విద్యుత్తు కనెక్షన్లున్నాయి. శాసనసభ ఎన్నికల సమయంలో ఆరు గ్యారం టీల అమలు కోసం ప్రజాపాలనలో తెల్ల రేషన్ కార్డులున్న విని యోగదా రుల నుంచి గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు స్వీకరించారు. కార్పొరేషన్ అవగాహన లోపంతో కొంత మంది దరఖాస్తు పత్రాలను ఆన్లైన్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానితో రాయితీ పొందలేకపోతున్నారు.సవరించే క్రమంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా ప్రక్రియను నిలిపివేశారు. ఓట్ల లెక్కింపు పూర్తి కావడంతో కోడ్ ముగిసింది. దీంతో దరఖాస్తుల సవరణ ప్రక్రియను ప్రారంబించాలి రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్‌ని మంగళవారం కోరడం జరిగిందన్నారు.పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రారంభిస్తామని పత్రిక ప్రకటన ద్వార ప్రజలకు తెలియజేస్తామని కమిషనర్ తెలియజేసారన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జూన్ 20న జిల్లాలో ఉన్న 119 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతోసమీక్షించారు.స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ, నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటితో రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చునని అన్నారు.నులి పురుగుల నియంత్రణ చాలా కీలకమైన అంశమని, దీని పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించి 1 నుంచి 19 సంవత్సరాల వయస్సులో గల పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులు అందించాలని అన్నారు. జూన్ 20న జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీచేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని 706 అంగన్ వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 2,27,251 మంది 1 నుండి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేయాలని అన్నారు. జిల్లాలో మొత్తం 2,49,976(10శాతంబఫర్ స్టాక్) మాత్రలనుఉంచుకున్నామని వివరించారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

### యాసంగిలో 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ
### పిఎసిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్

ప్రజాపక్షం/ మంథని: యాసంగి సీజన్‌లో మంథని మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంథనిలోని సంఘ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలులో మంథని పీఏసీఎస్ టాప్‌లో నిలిచి రికార్డు నెలకొల్పిందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా వరి ధాన్యంకొనుగోలు కేంద్రాలు నిర్వహించి అత్యధిక స్థాయిలో 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. యాసంగి సీజన్‌లో మండల పరిధిలో 37 కొనుగోలుకేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో దాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. మండలంలోని సుమారు 4300మంది రైతుల నుంచి 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, సంఘం ద్వారా రూ.81.36కోట్ల వ్యాపారం జరిగినట్లు ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో దళారులను ఆశ్రయించి నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో కంటే ఈసారి కొనుగోళ్లు సజావుగా సాగాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నష్టంజరుగకుండా పకడ్బందీగా పారదర్శకంగా కొనుగోళ్లు పూర్తి చేశామని ఆయన తెలిపారు. రైతులు, అధికారులు సహకరించారని తెలిపారు. ఈ సమావేశంలో సీఈఓ మామిడాల అశోక్, సంఘ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అపార ఉద్యోగ అవకాశాలు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : జిల్లాలోని పద్మశాలి ఆఫీసియల్స్ అండ్ ప్రొఫషనల్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ర్యాంకర్లకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్ మాట్లాడారు. పాలిటెక్నిక్ డిప్లొమా తో అద్భుత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు.త్వరగా ఉద్యోగంలో స్థిరపడే అవకాశాలు పాలిటెక్నిక్ ద్వారా సాధ్యమవుతుందన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT JAYA SHANKAR BHUPALPALLY

H.M.O.P.NO. 18 OF 2023

Between:-

Kyatharaju Mogili ...Petitioner

And

Kyatharaju @ Chandragiri Thirupa @ Vani ...Respondent

NOTICE

To,

Kyatharaju @ Chandragiri Thirupa @ Vani, W/o Kyatharaju Mogili, D/o Chandragiri Rajaiah, aged 33 years, Occu: Government Employee, O/o UPS School, Garla Village & Mandal, Mahabubabad Dist., R/o Mandalonipally, H/o Dubyala Village, Tekumatla Mandal, Jaya Shankar Bhupalpally Dist.,

...Respondent

Please take notice that the above O.P., filed by the petitioner against you for grant of divorce and the said case is posted on 21-06-2024 for your appearance. Therefore, you are hereby ordered to appear before the said Court on the above said date at 10-30 A.M., either in person or through an Advocate, failing which the matter will be decided exparte.

//By Order of the Court//

(BANDELA SWAMY)
Advocate-Parkal
Cell:9849778043

# నిర్మల్‌లో ఫర్టిలైజర్ డీలర్ల మాఫియా!




ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిఃరైతులు పంట పొలాలకు కొనుగోలు చేసే విత్తనాల దగ్గర కూడాప్రభుత్వంనిర్ణయించిన ధరకు అమ్ముకోలేక అధిక ధరకు అమ్మేందుకు ఫర్టిలైజర్ డీలర్లు కొరత సృష్టిస్తూ ఎంఆర్పి కంటే నాలుగు రేట్లు ధరకు రైతుకు అమ్ముకుంటూ మూడు పువ్వులు ఆరుకాయలుగా దోపిడీకి పాల్పడుతున్నారు.వ్యవసాయ అధికారుల అలసత్యం కారణంగా నిర్మల్ మార్కెట్లో ఈ దందా కొనసాగుతుంది.నిర్మల్ లో ప్రధానంగా ముగ్గరు డీలర్‌లు ఈ రకమైన కొత్త సృష్టిస్తూ నిర్మల్ అంతా హల్చల్ చేస్తారు. వాళ్లు నిర్ణయించిన ధరకే రైతులు,సబ్ డీలర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా కనీసం స్పందిచకపోవడం వారిపై చర్యలు తీసుకోకపోవడం ఇది అధికారుల అలసత్వమే కదా...?ప్రతి నెల వచ్చే మామూళ్లకు ఆశపడి డీలర్ల పై ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం వాళ్ళు చెప్పిందే వినాల్సిన అవసరం..ఏదైనా పై అధికారులకు అనుమానాలు వచ్చి ఫర్టిలైజర్ లను తనిఖీ చేయాలన్నా,కూడా ముందస్తు సమాచారం ఇచ్చి ఎవరి దగ్గరికి తీసుకువెళ్లలో అధికారులే నిర్ణయిస్తారు. ఇదో మాఫియా లాగా నిర్మల్ లో తయారయింది.జిల్లా వ్యవసాయ అధికారి పై ఎన్నో విమర్శలు వచ్చిన తన పలుకుబడి కారణంగా ఎప్పుడు కూడా అధికారులు తన వైపు ఏలెల్తి చూపరు. ఎందుకో మరి ఇటు రైతులంటే అంతే ఈనంగా చూస్తూ డీలర్లను బతికిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్న జిల్లా కలెక్టర్‌స్పందించకపోవడం కూడా ఓ ఆలోచన చేయాల్సిన అవసరం. స్థానిక జిల్లా కలెక్టరుకు తెలుగు భాషపై పట్టు లేక అధికారులు చెప్పిందే తల ఊపి తన పని తాను చేసుకోపోతుంటే ఇక అసలు సమస్య ఇక్కడే ములుగుతుంది.జిల్లా కలెక్టర్ హిందీ తప్ప ఇంగ్లీష్ తప్ప తెలుగుపై అంతా అవగాహన లేదు.ప్రతికలలో ఎన్నో కథనాలు వచ్చినా స్థానిక అధికారులు వివరించి చెప్పరు.ఎక్కడికక్కడే మేనేజ్ చేసుకుంటూ సమస్యను మరింత జటిలం చేస్తూ వచ్చారు.ఇది జిల్లా అధికారుల పనితీరు రైతుల సమస్యలు ఎలా పరిష్కరిస్తారో...?అంటే వ్యవసాయాధికారులు ఆడింది ఆటే పాడింది పాటే పై నుంచి ఎనోట్ల ఒత్తిళ్లు అయినా లైట్ గా తీసుకుంటారు.జిల్లా కలెక్టర్ ఎన్ని సమీక్షలు పెట్టిన సమస్య మాత్రం పరిష్కారం కాదు.అధికారులు తలుచుకుంటే క్షణాలలో ఫర్టిలైజర్ల షాపులను సీజ్ చేయొచ్చు..వాటిని సీజ్ చేస్తే తమకు వచ్చే వాటా రాదేమో అనుకోని కనీసం అటువైపు చూడరు.ఇది జిల్లాలో వ్యవసాయ అధికారుల పనితీరు.జిల్లా మీద పట్టు సాధించాలంటే స్థానిక జిల్లా కలెక్టర్ కు తెలుగు పూర్తిగా నేర్చుకుని ఉండాల్సిందే లేదంటే అధికారులు ఆడింది ఆట పాడిందే పాట..ఇది నిర్మల్ జిల్లాలో ఉన్న తాధికారుల ధీమా..!! వ్యవసాయ అధికారులు సమస్య పరిష్కరిస్తారా..కలెక్టర్ దృష్టి సారిస్తారా చూడాలి.

## తెలంగాణ మంత్రులకు కొత్త వాహనాలు..

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలువురు మంత్రులకు కొత్త వాహనాలను అందించింది. పాత వాహనాల స్థానంలో టయోటా ల్యాండ్ క్రూయిజర్ వాహనాలను అందజేశారు. బిఆ రేఎస్ ప్రభుత్వంలో సిఎం కాన్వాయ్ కోసం కొత్త వాహనాల కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ వాహనాలను సిఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ కోసం ఉపయోగిస్తున్నారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన ఈ వాహనాలను మంత్రులకు కేటాయింపులు చేశారు. మరికొంత మంది మంత్రులు బుధవారం వాహనాలను అందుకోనున్నారు.

## ఓయు విద్యార్థుల పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలో నీరు, విద్యుత్ కొరతల పేరుతో వేసవి సెలవులు ఇచ్చారనే సందర్భంగా వెలువడిన సర్క్యులరు వివాదంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నీరు, విద్యుత్ కొరత కారణంగా సెలవులు ప్రకటించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారంటూ విద్యార్థులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేయలేదని హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని కొట్టేస్తూ జస్టిస్ విజయసేన్‌రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. మే మొదటివారంలో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. గత ఏడాది వేసవి సెలవుల సర్క్యులర్‌ను సిఎం ట్వీట్ చేశారని, అప్పుడు నీరు, విద్యుత్ కొరత లేదని, తప్పుడు సర్క్యులర్‌ను ట్వీట్‌లో పేర్కొన్నారని పిటిషనర్ల వాదన. సీఎం ట్వీట్‌లోని సర్క్యులర్ నిజమైనదని ప్రభుత్వ వాదన. వాదనల తర్వాత అధికారుల ఫిర్యాదుపై పోలీసుల దర్యాప్తులో నిజానిజాలు తేలుతాయని, పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని న్యాయమూర్తి చెప్పారు.

# మ్యాన్‌హోళ్లు తెరిస్తే కఠినచర్యలు

నిబంధనల ఉల్లంఘనలకు కేసులు
మ్యాన్‌హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్
అందుబాటులో ఎయిర్‌టెక్ మిషన్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలోని రహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్‌హోళ్లు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాయని జలమండలి అధికారులు హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వర్షాకాల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. లోతైన మ్యాన్ హోళ్లతో పాటు 25 వేలకు పైగా మ్యాన్ హోళ్లపై ఇప్పటికే సేఫ్టీ గ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్ తో సీల్ చేసి, రెడ్ పెయింట్ ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్‌టి), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్‌పిటి) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్ తో కూడిన డీవాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేస్తారు. అధికంగా నీరు నిలిచే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి. వీటితో పాటు ఎయిర్ టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారని అధికారులు వివరించారు.

**సెక్షన్ కు ఒక బృందం ఏర్పాటు...** మ్యాన్ హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందం ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జిహెచ్‌ఎంసి అధికారుల సమన్వయంతో ఎప్పటి కప్పుడు క్లియర్ చేస్తారు. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా లేదా ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే జలమండలి కస్టమర్ కేర్ నెంబరు 155313కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. దగ్గర్లోని జలమండలి కార్యాలయాల్లో నేరుగా సంప్రదించవచ్చు.





**చట్టం ఏం చెబుతోంది...** ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా మ్యాన్ హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బి యాక్ట్ 1989, సెక్షన్ 74 ప్రకారం నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతో పాటు కొన్నిసార్లు జైలుశిక్ష కూడా వేసే అవకాశముంది.

**కార్మికులకు శిక్షణ...**పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎలా పనిచేయాలనే విషయంపై వారికి జలమండలి ఏటా భద్రతా వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఈకార్యక్రమాల్లో వారికి ఎస్‌ఓపి మార్గదర్శకాల ప్రకారం, భద్రతా పరికరాల పనితీరు, ఉపయోగించే విధానం, పారిశుద్ధ్య పనుల్లో తీసుకోవాల్సిన అన్నిజాగ్రత్తలపై శిక్షణ ఇస్తోంది. అంతే కాకుండా పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినపుడు చేసే ప్రథమ చికిత్సపైనా అవగాహన కల్పిస్తుంది.

**మాధ్యమాల్లో విస్తృత ప్రచారం...**వర్షాకాలంలో సీవరేజి నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై జలమండలి విరివిగా ప్రచారం చేస్తుంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అంతే కాకుండా చేయాల్సిన, చేయకూడని పనులపై దిన పత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని అధికారులు చెప్పారు.

## సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సిఎం ఆలోచనను స్వాగతిస్తున్నాం




ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలను స్వాగతిస్తున్నామని ఎంపి మల్లురవి పేర్కొన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్ళలో సరైన సౌకర్యాలు లేవని, సెమీ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. టీచర్లు లేరనీ గత ప్రభుత్వం పాఠశాలలను మూసేసిందన్నారు. మూసేసిన పాఠశాలలను మళ్ళీ తెరుస్తాం అన్నారు. ఏకోపాధ్యాయ స్కూళ్లను రద్దు చేయరని సిఎం హామి ఇవ్వడం శుభపరిణామమన్నారు. 2 వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాంమన్నారు. ప్రతి పాఠశాలలో టాయిలెట్లు , ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్ని సౌకర్యాలను కల్పించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచుతాం మని ధీమా వ్యక్త పరిచారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, ఖాజీ పేట కోచ్ ఫ్యాక్టరీ, రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా సమస్యల మీద పార్లమెంట్ లో కొట్లాడతామన్నారు. విభజన సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ లో కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. బడి బాట కార్యక్రమంలో ప్రజా ప్రతినిదులు పాల్గొనాలని సిఎం రేవంత్ సూచించారని తెలిపారు.

## వరద ప్రభావం నుంచి కాలనీలకు ఉపశమనం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/వనస్థలిపురం: వర్షపు నీరు కాలనీలపై ప్రభావం లేకుండా ఉపశమనం కల్పించామని ఎల్‌బి నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్‌లోని క్రిస్టియల్ కాలనీలో పర్యాటించి, వర్షపు నీరు పైప్‌లైన్ పనులు పూర్తి చేయగా, పైప్‌లైన్ పనుల ద్వారా రోడ్డు డ్యామేజ్ కావడంతో వాటిని మరమత్తులు చేయాలని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వర్షపు నీరు కాలనీల్లో చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయంలో గతంలో నిధులు మంజూరు చేయదంతో పనులు పూర్తి చేయడంతో, సీసీ రోడ్డు మరమత్తులు చేయాలని అధికారులకు సుధీర్‌రెడ్డి సూచించారు. కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి అధికారులు రఫీ, ప్రజ్ఞ పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి




ప్రజాపక్షం/వనస్థలిపురం: ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎల్‌బి నగర్ జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ పంకజను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో పలు కాలనీలకు సంక్షేమ సంఘం భవనాలు, వీధీ దీపాలు, పార్కుల అభివృద్ధికి నిధులు అందించాలని కోరారు. డివిజన్‌ను అన్ని విధాలు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. అభివృద్ధి పనులకు కాలనీ వాసులు సహకారం ఉండాలన్నారు.

## ఎర్రకుంట చెరువు పనుల పరిశీలన



ప్రజాపక్షం/రాజేంద్రనగర్: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ ఎర్రకుంట చెరువు పూడిక పనులను మంగళవారం కమిషనర్ బి.శరత్ చంద్ర, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూపది రోజులుగా నిరంతరం జరుగుతున్న ఎర్రకుంట చెరువు పూడిక పూర్తయితే ఈఏడాది చెరువు నిండితే ఈపరిసర ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండదన్నారు. పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంచి సదుద్దేశంతో చేపట్టిన పూడికతీత కార్యక్రమా న్ని గ్రామస్తులు, కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.యాదయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టింకురెడ్డి, సంతోష్ ముదిరాజ్,లక్ష్మి నగర్ కాలనీ అధ్యక్షులు రవికాంత్‌రెడ్డి, బాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు పిసిజీ చారీ, కార్యదర్శి సురేందర్, కాంట్రాక్టర్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



ప్రజాపక్షం/యాచారం : మేడిపల్లి గ్రామాభివృద్ధికి తమ పౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని ఎవిజి ఫౌండేషన్ చైర్ పర్సన్ అడాల వరలక్ష్మి గణేశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలోని అంగన్ వాడి కేంద్రాలకు 30 కుర్చీలను అందజేశారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ అధ్వర్యంలో గ్రామంలో అనేక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బొడ కృష్ణ, మాజీ వార్డుమెంబర్లు సురేంధర్‌రెడ్డి, కొంగళ్ళ కృష్ణ, అంగన్ వాడి టిచర్లు రాజ్యలక్ష్మి , విజయలక్ష్మి , యం. శివకుమార్, ఎర్పుల శేఖర్, జావిద్, జలీల్, రఫూఫ్, జగన్, నర్సింహ్మ పాల్గొన్నారు.

## త్వరతగతిన సమస్యలు పరిష్కారం



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి, గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సమస్యలు, చేపట్టవలిసిన అభివృద్ధి పనులపై శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తాండ, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌లలో పర్యటించారు. బస్తీలలో చేపట్టవలసిన సిసిరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, వాటర్‌పైప్‌లైన్ పనుల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించాలని జోనల్ కమీషనర్‌కు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ విన్నవించారు. అసంపూర్తిగా మిగిలిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జోనల్ కమిషనర్ అధికారులను అదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యుఎస్ డిజిఎం శరత్‌కుమార్, హెచ్‌ఎండబ్ల్యు ఎస్ మేనేజర్ అభిషేక్ రెడ్డి,ఈఈ శ్రీనివాస్, డిఈ విశాలక్షి, టౌన్ ప్లానింగ్ అధికారులు రమేష్, రవిందర్‌రావు, ఏఎంఒహెచ్ నగేష్ నాయక్, హనుమంతు నాయక్, నాయకులు రాజు, రమేష్, నర్సింగ్ నాయక్, ప్రసాద్, మహేష్, గోవర్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఒఆర్‌ఆర్ వరకు డిఆర్‌ఎఫ్ సేవలు విస్తరణ

అదనంగా మరో 15 డిఆర్‌ఎఫ్ బృందాల ఏర్పాటు
భారీవర్షాలు, విపత్తుల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



ప్రజాపక్షం/హైదరాబాద్: భారీ వర్షాలు, ఇతర విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని పౌరులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హైదరాబాద్ ఓఆర్‌ఆర్ పరిధి వరకు జిహెచ్‌ఎంసి డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలను విస్తరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలియచేశారు. హైదరాబాద్ నగరంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు ఆకస్మిక వర్షాలు, వరదలు వచ్చినా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిహెచ్‌ఎంసి ఇంచార్జ్ కమిషనర్ ఆమ్రపాలి, జిహెచ్‌ఎంసి ఈవిడిఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, జిహెచ్ ఎంసిలోని డిజాస్టర్ రెస్పాన్స్ విభాగాన్ని మరింత పటిష్ట పరుస్తున్నామని, ఇందుకుగాను విపత్తులను ఎదుర్కోవడానికి అదనపు సిబ్బందిని, తగిన యంత్ర పరికరాలను అందచేయనున్నామని వివరించారు. ఇప్పటికే, జిహెచ్‌ఎంసి పరిధిలో 30 డిఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని, వీటికి తోడు మరో 15 బృందాలను అదనంగా ఏర్పాటు చేసి వీటి సేవలను ఓఆర్‌ఆర్ వరకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు ఉన్నందున, కెమికల్ ఫైర్ ప్రివెన్షన్‌కు ప్రత్యేక శిక్షణతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులకు శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నగరంలో 141 సమస్యాత్మక ప్రాంతాలలో మున్సిపల్, పోలీస్, విద్యుత్, జలమండలి తదితర సంబంధిత శాఖల సమన్వయంతో పౌరులకు ఏవిధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. హైదరాబాద్ తోపాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర నగరాలలో కూడా డిఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న డిఆర్‌ఎఫ్ బృందాలను పటిష్టపర్చడం చేయాలని ఆదేశించారు. విపత్తులు వచ్చినప్పుడు ఎన్‌డిఆర్‌ఎఫ్ విభాగంతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేశంలోని ప్రధాన మహానగరాలైన ముంబయి, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరులలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాల పనితీరుపైకూడా అధ్యయనం చేయాలని అధికారులను సిఎస్ ఆదేశించారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులపై ఉక్కుపాదం

ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: నకిలీ విత్తనాలు, ఎరువులపై పోలీస్ అధికారులు ఉక్కుపాదం మోపాలని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఎల్‌ఎన్ గార్డెన్‌లో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డీలర్లుకు ఎరువుల కల్తీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డితో పాటు ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ శంకర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎక్కడ విక్రయించినా వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయడం తోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమిష్టిగా పనిచేసి నకిలీ విత్తనాలు, ఎరువులును నియంత్రించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. డీలర్లు మానవత్వంతో అన్నదాతలకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇచ్చే విత్తనాలకు సంబంధించిన పేర్లతోపాటు బ్యాచ్ నంబర్లు రిజిస్టర్‌లో భద్ర పరిస్తే భవిష్యత్‌లో ఉపయోగపడే అవకాశాలు ఉంటాయని శంషాబాద్ డిసిపి నారాయణ రెడ్డి అన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు పూర్తి స్థాయిలో అదుకునేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వాన్ని, సమాజాన్ని కాపాడేందుకు అధికారులు ఉన్నారని, డీలర్లు మంచిరకం విత్తనాలను అన్నదాతలకు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. అన్నం పెట్టే అన్నదాతలను మోసం చేస్తే వారిపై ఫిడియాక్ట్ కేసులతోపాటు కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి, ఏడిఎ రాజారత్నం, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వై.యాదయ్యయాదవ్, వ్యవసాయ అధికారులు నిశాంత్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, ప్రియాంకతోపాటు డీలర్లు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించేందుకు కృషి



ప్రజాపక్షం/షాబాద్ : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల అభివృద్ధి అధికారిణి అపర్ణ అన్నారు. మంగళవారం షాబాద్ మండల ద్వాక్రా సంఘం భవనంలో షాబాద్ మండల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సంబందించిన ఏకరూప దుస్తులు మండల విద్యా అధికారి శంకర్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ.. ప్రైయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యను అందించేందుకు తచర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ తరుపున మండలంలోని ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు మంచి విద్యను అందించేవిధంగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే కీర్తి ప్రతిష్ఠలు వస్తాయని చెప్పారు. మండల విద్యా అధికారి శంకర్ మాట్లాడుతూ.. మండలంలోని విద్యార్థులకు మొదట విడుతగా బాలురకు 1,818 మంది, బాలికలకు 20,50 మందికి వచ్చినట్లు తెలిపారు. మిగితావి రెండవ విడుతలో అందరికి అందే విధంగా చూస్తామన్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం నర్సింలు, లక్ష్మ ణ్, ఉపాధ్యాయులు హన్మంతు, ప్రశాంత్, స్వప్న, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే సమస్యలు పరిష్కారం

తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



ప్రజాపక్షం/కేశంపేట: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రణాళికబద్ధంగా పనిచేస్తే అన్నదాతల సమస్యలు పరిష్కారమవుతాయని కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జడ్పి సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ మైనింగ్ లైసెన్స్‌లు పొందిన యాజమానులు రూల్స్ పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మధ్య కాలంలోనే ఓ యువకుడు మైనింగ్ తీసిన గుంతలో పడి మరణించడం జరిగిందని గుర్తు చేశారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సమయ పాలన పాటించడం లేదని, దాంతో రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఆర్‌టిసి బస్సుల కొరత అనేకంగా ఉందని, వీటిని తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నాయని, ప్రతి పల్లెకు ఆర్‌టిసి బస్సును నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పరిసరాలు పరిశుభ్రం గా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కాలం చెల్లిన విద్యుత్ వైర్ల స్థానంలో కొత్త వైర్లు ఏర్పాటు చేయడంతోపాటు స్థంబాలను సైతం భిగించేందుకు కృషి చేయాలని విశాల కోరారు.

# జిల్లాలో డిప్యూటేషన్లు రద్దుచేయాలి

రంగారెడ్డి జెడ్‌పి సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
అది శాఖపరమైన నిర్ణయం
కలెక్టర్ శశాంక



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ పరిధిలో డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా పరిషత్ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జడ్‌పి చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి కలెక్టర్ కె.శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ సర్వసభ్య సమావేశం చివరిదని, ఐదు సంవత్సరాలు సహకరించిన జిల్లా ప్రాదేశిక సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షిస్తూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఆసుపత్రిలో కావలసిన సదుపాయాలు ఉండేలా చూడాలని అని సభ్యులు అధికారులను కోరారు. డాక్టర్లు లేక ఇబ్బంది పడుతున్నారని కొంతమంది సభ్యులు తెలిపితే, మరికొన్ని పిహెచ్‌సి, సిహెచ్‌సి సెంటర్లలో డాక్టర్లు ఉన్న సరి గా డ్యూటీలకు రావడం లేదని, కొంతమంది డాక్టర్లు ప్రైవేటు ప్రాక్టీస్‌కి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న డాక్టర్లు వివిధ సాకులు చూపి పట్టణ ప్రాంతాలకు డిప్యూటేషన్లు వేయించుకున్నారని ఇంకొంతమంది సభ్యులు వాపోయారు, మారుమూల ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, డాక్టర్ల పట్టణ ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా డిప్యూటేషన్లలో వెళ్లి పనిచేస్తున్నారని మెజార్టీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిత హరినాద్‌రెడ్డి ఆయాశాఖల్లో డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరుతూ జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డికి సిఫార్సు చేశారు. దీంతో సభ్యులందరూ అంగీకారం తెలిపారు. కలెక్టర్ కె.శశాంక స్పందిస్తూ డిప్యూటేషన్‌లు శాఖ పరమైన నిర్ణయమని తెలిపారు. డిప్యూటేషన్లు మెడికల్ రీజన్స్‌తో కొన్ని, వర్క్ అడ్జెస్ట్ మెంట్‌తో మరికొన్ని చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ ఇస్తున్నప్పటికీ చేరడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ద్యాశాఖపై సమీక్షిస్తూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని, మంచినీటి సౌకర్యం పరిష్కరించి, స్కావెంజర్‌లను నియమించాలని సభ్యులు కోరారు. వ్యవసాయశాఖపై సమీక్షిస్తూ రైతులకు నకిలీ విత్తనాలు ఎరువులతో ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, నిరుపయోగంగా ఉన్న రైతువేదికల్లో మేలురకమైన విత్తనాలు విక్రయించేందుకు ఉపయోగిస్తే బాగుంటుందని, మూసి పరివాహక ప్రాంత రైతులు మిల్లర్ల వద్ద ధాన్యం అమ్ముకునే విషయంలో తరువు పేరుతో తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని అబ్దుల్లాపూర్మెట్ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్ వాపోయారు. విద్యుత్ శాఖ పై సమీక్షలో భాగంగా గాలివానలకు విద్యుత్ పోవడం జరుగుతుందని, సంబంధిత ఎఇలు, లైన్ మెన్లు స్పందించడం లేదని, పాత స్తంభాలు తొలగించాలని, కిందకు వేళ్ళాడుతున్న వైర్లను సరి చేయాలి అని, రానున్నది వర్షాకాలంలో జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను సభ్యులు కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈటా గణేష్,జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ కృష్ణరెడ్డి, డిప్యూటీ సిఇఒ రంగారావు, కోఆప్షన్ సభ్యులు, జెడ్‌పిటిసిలు ఎంపిపిలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియపూర్తి

### డిఇఓ గోవిందరాజులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్న భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులకై సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారంతో పూర్తయిందని డిఇఓ ఎం.గోవిందరాజులు తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ డిఇఓ కార్యాలయంలో పిటిలు, పండితుల విద్యా అర్హతల ధృవపత్రాల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్న 154తెలుగు పండితులు, 129హిందీ పండితులు, 62వ్యాయామ ఉపాధ్యాయులు, ముగ్గురు ఉర్దూ ఉపాధ్యాయులు స్కూల్‌అసిస్టెంట్ పదోన్నతికై తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసినందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియలో నోడల్ అధికారి కుర్మయ్య, ఎసి రాజశేఖర్ రావు, సెక్టోరియల్ అధికారులు బరపటివెంకటయ్య, షర్ఫుద్దీన్, నూరుద్దిన్, ఎస్టిఎఫ్ కార్యదర్శి పాండు, జిహెచ్‌ఎం తిరుపతయ్య, రాష్ట్రీయపండిత పరిషత్ ఉపాధ్యాయ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## ఎస్‌జిటిలు వెరిఫికేషన్ చేయించుకోవాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులు స్పెషల్ ఎడ్యుకేషన్ బిఇడి అర్హతకలిగి ఉన్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ స్పెషలైజేషన్ పదోన్నతికొరకు సర్వీస్ రిజిస్టర్ ఒరిజనల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు బుధవారం ఈనెల12వతేదిన నాగర్‌కర్నూల్ డిఇఓ కార్యాలయంలో వెరిఫికేషన్ చేసుకోవాలని డిఇఓ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఎస్‌జిటి ఉపాధ్యాయులనుండి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందుటకై కావాల్సిన ఉపాధ్యాయుల సీనియారిటి జాబితాను డిఇఓ నాగర్‌కర్నూల్ వెబ్‌సైట్ https.deonagarkurnool.weebly.comయందు ఉంచబడిందని ఆయన తెలిపారు.

## నేడు కల్వకుర్తిలో ఎంఎల్‌ఎ పర్యటన

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలో బుధవారం ఎంఎల్‌ఎ కసిరెడ్డినారాయణరెడ్డి మధ్యాహ్నం ఒంటిగంటకు బస్టాండ్‌వద్ద ఉన్న ఎస్సికాంప్లెక్స్ 1.30గంటలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లపరిశీలన, అనంతరం పంజుగుల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొననున్నారు. కావున కౌన్సిలర్‌లు, నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొని ఎంఎల్‌ఎ పర్యటనను విజయవంతం చేయాలని కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్ కోరారు.

## నేడు బడిబాట కార్యక్రమం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని పంజుగుల గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంఎల్‌ఎ కసిరెడ్డినారాయణరెడ్డి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలోభాగంగా ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, ఉచితదుస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. కావున ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామపెద్దలు, అమ్మ ఆదర్శ కమిటిసభ్యులు, మహిళా సంఘాలగ్రూపులు, యువకులు, పూర్వవిద్యార్థులుపాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/వంగూర్ :** మోడి ప్రభుత్వంలో కేంద్రహోంసహాయమంత్రిగా నియమించడంతో బండిసంజయ్‌కుమార్‌ను మంగళవారం బిజెపి మండలపార్టీ అధ్యక్షులు ఖానాపురం భాస్కర్ ఢిల్లీలో మంత్రినివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంఅందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

## సమాజహితమే సాహిత్యం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కర్నాటి రఘురాములుగౌడ్ రచించిన ఆంజనేయ శతకమును మంగళవారం అభయాంజనేయస్వామి దేవాలయం, హరిహరటౌన్‌షిప్‌నందు ఆవిష్కరించారు. కార్యక్రమానికి వెంకటేశ్వర్లుఅధ్యక్షత వహించారు. సమాజమార్పుకోసం సాహిత్యం అవసరమని సామాజిక రుగ్మతలను తొలగించడానికి సాహిత్యం తోడ్పడుతుందని కవులు సామాజిక కార్యకర్తలని వక్తలు కొనియాడారు. పుస్తక ముద్రణకు యాదయ్యగౌడ్ ఆర్థికసహకారం అందించారు. పుస్తకాన్ని కోడేలబక్కయ్య సమీక్షించారు. కార్యక్రమంలో భూమానందగిరిస్వామి, సుధాకర్, లక్ష్మారెడ్డి, రవిచంద్ర, లక్ష్మణమూర్తి, నారాయణగౌడ్, శీనయ్యగౌడ్ పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు

### జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎ. వెంకటేశం

**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎ. వెంకటేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆల్‌నూర్ స్కూల్ ఆవరణలో మంగళవారం కింగ్ షోటో కాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కరాటే మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేయాలన్నారు. క్రీడల్లో పాల్గొనే సర్టిఫికెట్లతో ఉన్నత చదువులతో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. గత 26 ఏళ్ల నుంచి వేసవిలో ఉచితంగా యోగా, కిక్ బాక్సింగ్ , జూడో తదితర అంశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న జహంగీర్ పాషా ఖాద్రీని అభినందించారు. విద్యార్థులు కరాటేలో బ్లాక్ బెల్టు వరకు ఎదగాలన్నారు. విద్యార్థులు ఇటు, కరాటే, విద్యపరంగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

### ఇసుక, వివిధ గనుల తవ్వకాలపై..

# క్యాలెండర్ రూపొందించండి

### అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇసుక, వివిధ గనుల తవ్వకాలకు సంబంధించి వార్షిక క్యాలెండర్ రూపొందించి, వెను వెంటనే టెండర్లు ఆహ్వానించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సచివాలయంలో గనుల శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా గనుల శాఖలో ఆదాయాల తీరును ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. గతంతో పోలిస్తే గణనీయంగా ఆదాయాలు పెంచే మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల ప్రాజెక్టుల మరమ్మతుకు భూగర్భం నుంచి త్వరితగతిన ఇసుక తరలించాల్సిన అవసరం ఉందన్నారు. పని సాగునీటి అధికారులు కోరినట్టుగా తనకు సమాచారం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుల పరిధిలో మరమ్మతులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో నది తీరాల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం ఉన్న రీచ్‌లు, టెండర్లు, ఆదాయానికి సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ అంశంలో సాగునీటి శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పలు గ్రానైట్ క్వారీలకు ఫైన్‌లు వేసి మూసివేశారు. ఆ ఫైన్‌లు ఎంతవరకు వసూలు చేశారు, ప్రస్తుతం ఆ క్వారీలా పరిస్థితిని సమీక్షించాలన్నారు. పట్టా భూముల పేరిట గోదావరి నది తీరం వెంట ఇష్టారీతిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, వీటిపై నిఘా పెట్టాలని సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క అధికారులను కోరారు. ఇసుక రీచ్‌లను ఆయా ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు కేటాయించడం, వ్యాపారం నిర్వహించేందుకు వారికి శిక్షణ, బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తే దళారులకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే అవకాశం ఉంటుందా? అనే అంశంపైన సమగ్ర సర్వే నిర్వహించాలని గనుల శాఖ అధికారులను భట్టి విక్రమార్క అన్నారు. ఇసుక ర్యాంపు నుంచి వినియోగదారునికి చేరేవరకు మధ్యలో దళారీ వ్యవస్థ లేకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చడం, ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా మాఫియా కార్యకలాపాలు కానీ, రాష్ట్ర ఖజానాకు నష్టం జరిగే పని కానీ జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

### సిపిఐ (ఎం-ఎల్) సీనియర్ నాయకురాలు

## రాధక్క కన్నుమూత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట యోధురాలు, సిపిఐ (ఎంఎల్) సీనియర్ నాయకురాలు రాధక్క (86)అలియాస్ అక్కినేని నిర్మల మంగళవారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. తెలుగు నేలపై జరిగిన మహోత్తర విప్లవ పోరాటంలో ఆమె దశబ్దాల తరబడి అవిశ్రాంతంగా పోరాడారని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్ రావు తెలిపారు. చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిగా గోదావరి లోయ విప్లవ ప్రతిఘటన పోరాటంలో ముఖ్య భూమికను పోషించారన్నారు. పొలిటెక్నిక్ విద్యను అభ్యసించిన రాధక్క చిన్న వయస్సులోనే కమ్యూనిస్ట్ విప్లవ రాజకీయాలకు ఆకర్షితులయ్యారన్నారు. విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారని, 1970 దశకంలోనే అడవి బాటను ఎంచుకున్నారని తెలిపారు. ఉద్యమ క్రమంలో రాధక్క ఆయుధాలతో పట్టుబడి అరెస్ట్ అయ్యారని, జైలు జీవిత గడిపారన్నారు. ఇటీవలి కాలంలో అనారోగ్యంతో రాధక్క పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారన్నారు. గత సంవత్సరానికిపైగా క్యాన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటూ, మంగళవారం హైదరాబాద్‌లోని తన కుమార్తె నివాసంలో తుది శ్వాస విడిచారని తెలిపారు. రాధక్క మరణం పట్ల సిపిఐ(ఎంఎల్ )న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసిందన్నారు. ఆమెకు విప్లవ జోహార్లు అర్పిస్తుందన్నారు. రాధక్క కుటుంబ సభ్యులకు, మిత్రులకు సానుభూతిని ప్రకటించారు.

## 'అధికారుల పాలన వద్దు.. '

### మున్సిపల్ చాంబర్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో అధికారుల పాలన పోవాలి ప్రజాపాలన రావాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని తెలంగాణ మున్సిపల్ చాంబర్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ కార్యవర్గ సమావేశం మంగళవారం హిమాయత్ నగర్ చాంబర్స్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో మున్సిపల్ చైర్మన్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 చట్టాన్ని తీసుకొచ్చి పురపాలక సంఘాల కౌన్సిల్స్ ను నిర్వీర్యం చేసిందని, అధికారలన్నీ అధికారులకు అప్పగించి పాలకవర్గాలను పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మార్చింది అన్నారు. దీనితో కౌన్సిల్ ఉనికినే ప్రశ్నార్థకంగా మారిందని ఇదేవిధంగా కొనసాగితే మున్సిపల్ కౌన్సిల్స్ ను కేవలం నామినేట్ చేసుకోవడం ఉత్తమ మార్గం అవుతుందన్నారు.రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చైర్మన్లలో ఒక మంచి ఉత్సాహం ఒరవడి నెలకొందని చట్టంలో మార్పులు తీసుకొస్తారని కౌన్సిల్ బలపడతాయని, పారదర్శకంగా పనిచేసేందుకు మరిన్ని సవరణలు జోడించాలని కూడా చైర్మన్లు అభిప్రాయపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మన్ శ్రీమతి చిగుళ్లపల్లి మంజుల, బి.ఎస్.కేశవ్, కొప్పుల ఈశ్వర్, నేతి రాజమౌళి, అల్లంపల్లినరసింహ, వై సుధ హేమేంద్ర, కప్పరి స్రవంతి, సి స్వప్న, తదితర ప్రతినిధులు హాజరు కావడం జరిగింది.

# అభివృద్ధి, సంక్షేమంపై అధికారులు దృష్టి



### జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శాఖల వారీగా సమీక్ష

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో వివిధ శాఖలు ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలు అమలు ప్రగతిని వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులు దృష్టి సారించాలని, ప్రజాసంక్షేమంకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి ఒక టీమ్ లాగా పనిచేయాలని, మహబూబ్‌నగర్ నియోజకవర్గం ను జిల్లా ను అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రజల ఆకాంక్షల కనుగుణంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ఏమైనా సమస్యలు వుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కొత్త ప్రభుత్వానికి వెన్నెముకగా నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షించవలసిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. గతంలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ స్థలాలను రికవరీ చేయాలని అన్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనుల గురించి వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా త్రాగునీటి సౌకర్యం, విద్యుదీకరణ , టాయిలెట్‌లు వాడుకలో తీసుకురావటం, మరమ్మత్తు పనులు, విద్యార్థినిలకు టాయిలెట్‌ల నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. రెండవ దశలో 152 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పనులు చేపట్టినట్లు తెలిపారు . పాఠశాలలు ప్రారంభం రోజున ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ఇక జత యూనిఫాం నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా మంచి నీటి సరఫరా త్రాగునీటి సరఫరా పై సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా అక్రమంగా త్రాగునీటి తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, రామిరెడ్డి గూడెం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుండి పరిశ్రమలకు అనధికారంగా నీటిని వాడుతున్నట్లు అధికారులు వెంటనే తనికీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారులకు కేటాయించిన గురించి గృహ నిర్మాణం ఈఈ వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రివర్గంలో

# 11 మంది పన్నెండో తరగతి పాస్

### 57 మంది గ్రాడ్యుయేట్లు

**న్యూఢిల్లీ :** మోదీ నాయకత్వంలో మూడోసారి ఏర్పడిన కొత్త కేంద్రమంత్రివర్గంలో 11 మంది మంత్రులు కేవలం 11 లేదా 12 వ తరగతి వరకూ మాత్రమే చదువుకున్నవారున్నారు. మరో 57 మంది మంత్రులు మాత్రం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఉన్నారు. ఎన్నికల సంస్కరణల కోసం పోరాటం చేస్తున్న స్వచ్ఛంధ సంస్థ ఎడిఆర్ (అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్) మంగళవారంనాడు విడుదల చేసిన తన తాజా నివేదికలో ఈ విషయం వెల్లడించింది. దేశ రాజకీయ నాయకత్వ బాధ్యతల్లో ఉన్న వ్యక్తుల విద్యార్హతలపై ఎడిఆర్ ఆరా తీసి ఈ నివేదిక ఇచ్చింది. కేంద్రమంత్రివర్గంలో మొత్తం 71 మంది మంత్రులు తమ ఎన్నికల అఫిడవిట్‌లలో విద్యార్హతలను ప్రకటించారు. వీరిలో 15 శాతం మంత్రులు 11 వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నవారు ఉన్నారు. మిగిలినవారంతా వివిధ రంగాలకు సంబంధించిన అడ్వాన్స్‌డ్ కోర్సులు చదివినవారు. ప్రత్యేకించి 14 మంది మంత్రులు గ్రాడ్యుయేట్లుగా, ఉన్నతశ్రేణి విద్యార్హతలు గల వారుగా ప్రకటించుకున్నారు. మరో 10 మంది మంత్రులు వృత్తిపరమైన గ్రాడ్యుయేట్ పట్టాలు తీసుకున్నారు. న్యాయవాద, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తుల్లో ప్రత్యేక పట్టాలు తీసుకున్న వారు ఉన్నారు. బాగా ఎక్కువ చదువుకున్న 26 మంది ఉన్నారు. వీరంతా పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందినవారే. ఏడుగురు మంత్రులు అత్యున్నతస్థాయిలో డాక్టరేట్లు సంపాదించారు. వీరు కాకుండా ముగ్గురు మంత్రులు డిప్లమా హోల్డర్లు ఉన్నారు.

**60 శాతం మంత్రులు 51–70 మధ్య వయస్కులే**

కేంద్రమంత్రివర్గంలో, జాతీయ రాజకీయ నాయకత్వంలో ఉన్న 60 శాతం మంత్రులు 51– 70 మధ్య వయసుగలవారే. ఎడిఆర్ నివేదిక ప్రకారం, 71 మంది కేంద్ర మంత్రులలో 47 మంది (66 శాతం) తమ వయసును 51–70 మధ్య శ్రేణిలో ఉందని ప్రకటించుకున్నారు. కేటగిరీలుగా చూస్తే, 22 మంది మంత్రులు 51–60 మధ్య వయసుగలవారు కాగా, మిగిలిన 25 మంది మంత్రులు 61–70 మధ్య వయసుగలవారు. యువకులను చూస్తే, 24 శాతం మంత్రుల వయసు 31–50 మధ్య లో ఉంది. గ్రూపులోని 17 మంది మంత్రులలో ఇద్దరు మంత్రులు 31–40 మధ్య వయసుగలవారు. 15 మంది మంత్రులు 41–50 మధ్య వయసుగలవారు ఉన్నారు. 71–80 మధ్య వయసుగలవారు పదిమంది ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు 71 మంది మంత్రులు గడచిన ఆదివారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు.

**99 శాతం మంత్రులు కోటీశ్వరులు**

కేంద్రమంత్రివర్గంలో ప్రమాణ స్వీకారం చేసిన 71 మంది మంత్రులలో 99 శాతంమంది కోటీశ్వరులే. సగటున వారి ఆస్తి రూ.107.94 కోట్లు ఉందని ఎడిఆర్ తన నివేదికలో తెలియజేసింది. వీరిలో ఆరుగురు మంత్రుల ఆస్తులు ఒక్కొక్కరికీ రూ.100 కోట్లు దాటిపోయాయి. డా.చంద్రశేఖర్ పెమ్మసాని (గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖల సహాయమంత్రి) ఈ జాబితాలో రూ.5,705.47 కోట్ల ఆస్తులతో అగ్రస్థానంలో ఉన్నారు. ఆయన ఆసుతలు రూ.5,598.65 కోట్లులో చరాస్తులు రూ.106.82 కోట్లుగా నమోదయ్యాయి. జ్యోతిరాదిత్య ఎం.సింధియా (కమ్యూనికేషన్లశాఖామంత్రి) త ఆస్తులను రూ.424.75 కోట్లుగా ప్రకటించారు. వీటిల్లో రూ.62.57 కోట్లు చరాస్తులు కాగా, రూ.362.17 కోట్లు స్థిరాస్తులు ఉన్నాయి. జనతాదళ్ (సెక్యులర్) కు చెందిన హెచ్.డి.కుమారస్వామి (భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖామంత్రి) తన ఆస్తుల విలువను రూ.217.23 గా చూపించారు. వీటిల్లో రూ.102.24 కోట్లు చరాస్తులు కాగా, రూ.115.00 కోట్లు స్థిరాస్తులు ఉన్నాయి. అశ్వనీ వైష్ణవ్ (రైల్వే, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖలమంత్రి) తన ఆస్తులను రూ.144.12 కోట్లుగాప్రకటించారు. వీటిల్లో చరాస్తులు రూ.142.40 కోట్లుగా చూపించారు. రావు ఇందర్‌జిత్ సింగ్ (గణాంకాలు, కార్యక్రమాల అమలుశాఖ ఇండిపెండెంట్‌చార్జి, ప్లానింగ్,కల్చర్ సహాయమంత్రి ఇండిపెండెంట్ ఛార్జి) తన ఆస్తులను రూ.121.54 కోట్లుగా ప్రకటించారు. వీటిల్లో రూ.39.31 కోట్లు చరాస్తులుగా చూపించారు. పీయూష్ గోయల్ (వాణిజ్య, పరిశ్రమల మంత్రి) తన ఆస్తులను రూ.110.95 కోట్లుగా ప్రకటించారు. వీటిల్లో రూ.21.09 కోట్లు స్థిరాస్థులు ఉన్నాయి.

**28 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు**

కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్రమోదీ మంత్రివర్గంలోని 28 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 19 మంది మంత్రులు అతి తీవ్రమైన కేసులులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరంతా హత్యకేసులు, మహిళలకు వ్యతిరేకంగా నేరాలు చేసిన కేసులు ఎదుర్కొంటున్నారు. విద్వేష ప్రసంగాలు చేసిన కేసులు ఎదుర్కొంటున్నారు. ఎడిఆర్ తన నివేదికలో ఈ విషయం వెల్లడించింది. ఐపిసి 307 సెక్షన్ కింద వీరిలో ఇద్దరు మంత్రులపై కేసులు ఉన్నాయి. శంతను ఠాకూర్ (రేవులు, షిప్పింగ్, జలమార్గాల సహాయమంత్రి), సుకాంత మజుందార్ (విద్యా,ఈశాన్యప్రాంత అభివృద్ధి సహాయమంత్రి)లపై ఈ తీవ్రమైన కేసులు నడుస్తున్నాయి. కాగా మరో ఐదుగురు మంత్రులు మహిళలకు సంబంధించిన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. బండి సంజయ్ (హోంశాఖ సహాయమంత్రి), ఠాకూర్ మజుందార్ (పెట్రోలియం, సహజవాయువు, టూరిజం) సురేశ్ గోపి (గిరిజన వ్యవహారాలు) ఈ కేసులు ఎదుర్కొంటున్నారు. అదనంగా మరో ఎనిమిది మంది మంత్రులు విద్వేష ప్రసంగాలు చేసిన కేసులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 71 మంది మంత్రులో 28 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

## ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వర్షాకాలంలో ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా తగు చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అంతకుముందు పెద్ద చెరువు నుంచి విడుదల అయ్యి దిగువకు వెళ్లే నీటి కోసం నిర్మాణం చేస్తున్న కెనాల్ పనులను మున్సిపల్ చైర్మన్ , పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ విజయభాస్కర్ రెడ్డి మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్నది వర్షాకాలం కాబట్టి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఆయన పెద్ద చెరువును పరిశీలించి, మాట్లాడుతూ గతంలో ఎంతో విశాలంగా ఉన్న పెద్దచెరువు చుట్టూ కొందరు అక్రమించి భవనాలు నిర్మించుకున్నారని వారికి మున్సిపల్ నుంచి నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కి ఆదేశాలు జారీ చేశారు. చైతన్య పాఠశాల ప్రక్కన పెద్ద చెరువుకు అనుకుని కొందరు వ్యక్తులు భూ అక్రమణ చేస్తూ కనిపించారు. వెంటనే ఎమ్మెల్యే అక్కడి వ్యక్తులను ప్రశ్నించగా సదరు వ్యక్తులు సరియైన సమాధానం ఇవ్వలేదు. సదరు వ్యక్తి ట్రాక్టర్ జెసిబి తీసుకుని అక్కడ నుంచి పంపించారు. ప్రభుత్వ భూములు అక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్ కి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ విజయభాస్కర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, బెజ్జుగం రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని పలు గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం పెబ్బేరు మండలంలోని శాఖాపూర్ , తోమాలపల్లి పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం కింద జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడువులోపు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పాఠశాలల మరమ్మతు పనులు జరుగుతున్నాయని, స్థానికంగా ఉండే సిబ్బంది అంతా పనులు పూర్తి చేసేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ , లక్ష్మణ్ , శివకుమార్ , మోతేరాముడు, కటికే శ్రీను, రాము, మాలపల్లి, కాటమోని వెంకటేష్ గౌడ్ , మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



## డ్రాప్ అవుట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** డ్రాప్ అవుట్ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతుండటంతో పాఠశాలను శుభ్రపర్చి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించేలా చూడాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని అన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అందరూ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించారు. మండల కేంద్రంలో వివిధ పాఠశాలలకు జరుగుతున్న పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ , వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలేశ్వరయ్య, శ్రీనివాసులు, పరమేష్ , స్వామి, సత్యనారాయణ, సిఆర్‌పిలు వెంకటేష్ , నాగరాజు, రాములు పాల్గొన్నారు.

## రూ. 2.50,000 ఎల్‌ఓసీ అందజేత



**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండలం శాఖపురం గ్రామానికి చెందిన శంకర్ కూతురి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న సంగతి తెలుసుకున్న డా. జిల్లెల చిన్నారెడ్డి ఏఐసిసి కార్యదర్శి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు మంగళవారం మహాత్మాజ్యోతిరావు పూలే ప్రగతి భవన్ వద్ద శంకర్‌కు రూ. 2.50,000లు ఎల్‌ఓసీ అందించి పాప ఆరోగ్యం మంచిగా అయ్యే వరకు అండగా ఉంటామని హామీనివ్వడం జరిగింది. దీంతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉఫాధ్యక్షుడు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కెసిఆర్‌ను కలిసిన కొమ్ముశ్రీనివాస్

**ప్రజాపక్షం/వంగూర్ :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మండల గాజర గ్రామానికి చెందిన కొమ్ముశ్రీనివాస్‌యాదవ్ టిఆర్‌ఎస్ జిల్లా నాయకులు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్‌హౌస్ చింతమడకలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



## గొర్రెల పంపిణీ నిలిపివేయడం అన్యాయం

### యాదయ్య

**ప్రజాపక్షం / జడ్చర్ల :** మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 3 వ స్థాయి సంఘ వ్యవసాయ శాఖ సమావేశం, వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య అధ్యక్షతన సమీక్ష చెయడం జరిగింది, సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కొడుగల్ యావయ్య , రాష్ట్ర ప్రభుత్వం కల్తీ విత్తనాలను అరికట్టడంలో విఫల కావడం జరిగింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు బంధు జూన్ నెలలో అందించే ఎకరాకు 7500/ రూపాయలు అందజేయాలని కొరినారు, రైతులకు వానాకాలంలో బిఎపి యూరియా అవసరం ఎంతైనా ఉంది. కాబట్టి అధికారులు నిల్వలు ఉండే విధంగా చూడాలి, గొల్లకుర్మలకు ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చెయ్యకుండా, కట్టిన డిడిలు తిరిగి ఇవ్వడం అన్యాయం అన్నారు. ఆయిల్ పామ్ రైతులకు అందజేయాల్సిన మెంటనెన్స్ డబ్బులు చెల్లించాలన్నారు, పాల్గొన్న కో ఆప్షన్ మెంబర్ అల్లాద్దీన్, సిఈఓ సూపర్ డెంట్ ఆనంద్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నాగారంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



**ప్రజాపక్షం/నాగారం:** అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రాంపల్లిలో 3 షెడ్లు, 2 సెల్లార్లు, నాగారంలో 1 షెడ్‌లను కమిషనర్ ఆదేశాలతో అధికారులు కూల్చివేశారు. ఇంటి నిర్మాణాలు చేయలనుకుంటే మున్సిపల్ నుండి అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని, లేనియెడల అక్రమ నిర్మాణాలను కూల్చివేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టిపిఎస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథపై క్షేత్రస్థాయిలో పరిశీలన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మిషన్ భగీరథ పథకం ద్వార తాగునీటి సరఫరాపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని శామీర్‌పేట ఎంపిడివో మమతబాయి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండల కేంద్రంలో మిషన్ భగీరథపై ఇంటింటికి తిరిగి నీటి సరఫరాపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మమతాబాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వార మంచినీరు సరఫరా సక్రమంగా వస్తున్నాయా లేదా అనే విషయాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో ఎన్ని కనెక్షన్‌లు ఉన్నాయని ఎంతమేరకు నీరు సరఫరా అవుతుందని విచారిస్తున్నామన్నారు. ఇంటి నెంబర్‌లు లేనివారు ఎంతమంది ఉన్నారని వారికి మిషన్ భగీరథ ద్వార కనెక్షన్ ఇస్తున్నారా లేదా అనే విషయాలను సంబందిత కార్యదర్శులను అడిగి తెలుసుకుంటున్నామని చెప్పారు. కార్యదర్శి మౌనిక, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాల జాగ్రత్తలపై కమిషనర్ సమావేశం



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలంలో వరదలు, పారిశుద్ధం నిర్వహణ, సీజనల్ వ్యాధులు నివారణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అవసరమైన మిషనరీ తో కూడిన అత్యవసర యంత్రాంగం ఏర్పాటు మున్సిపాలిటీచే చేపట్టబడు ముందస్తు చర్యలు మొదలగు అంశాలపై మున్సిపల్ కమిషనర్ కే సత్యనారాయణ రావు ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం సిబ్బంది మరియు వార్డ్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించరు జరిగి వర్షాకాలంలో ఏవైనా అత్యవసరమైన సమస్యలు ఏర్పడితే పరిష్కరించుటకు ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, పట్టణ ప్రజలు కంట్రోల్ రూమ్ కు సమస్యలపై వెంటనే కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 9542715377కు సమాచారం అందించ వలసిందిగా కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్ కుమార్ మేనేజర్ నర్సింలు, సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, వార్డ్ ఆఫీసర్లు, శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాల అందించాలి

### జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి వెంకట్రామ్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి, మేడ్చల్ ఎడిఎ వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం శా మీర్‌పేట మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను, సీడ్స్ కంపెనీలు, డీలర్ల షాపులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన కంపెనిల విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు రశీదును ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పంటకాలం పూర్తయ్యేవరకు రశీదు, విత్తన ప్యా కెట్‌ను రైతులు భద్రపరుచుకోవాలన్నారు. షాపులు కంపెనిలల్లో రికార్డులు, విత్తన నిల్వలు, పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ జానయ్య, మండల వ్యవసాయాధికారి రమేష్, విత్తన ధృవీకరణ అధికారి మహేష్‌బాబు పాల్గొన్నారు.

## తుఫాన్ తీవ్రతపై ముందస్తు జాగ్రత్తలు




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తుఫాన్ తీవ్రతపై అధికారుల అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్ వెంకటగోపాల్ అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో తుఫాన్ ప్రభావం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మోన్‌సూన్ ఎమర్జెన్సి రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామని 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఈ టీమ్ పనిచేస్తుందని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించాలని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ సునీత, మేనేజర్ శ్రవన్‌కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌లు, జవాన్లు, వాటర్‌మ్యాన్‌లు, ఎలక్ట్రీషియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్‌లోని పలు వార్డుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ కమిషనర్‌కు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూంకుంట మున్సిపల్‌లోని పలు వార్డుల్లోని ప్రాంతాల్లో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఉద్యోగాలకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బంది కల్గుతుందన్నారు. తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. దొంగతనాలు కూడ నిత్యం చోటుచేసుకుంటున్నాయని వాపోయారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మధూసుధన్‌రెడ్డి, దేవర శెట్టి రాజు, మురళీగౌడ్, లక్ష్మీ నారాయణ(నాని), తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అక్రమంగా తరలిస్తున్న పిడిఎఫ్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీసులు, ఆర్‌ఐ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్ర జా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారంతో శామీర్‌పేట ఆర్‌ఐ కుమార్, పోలీసులు సంయుక్తంగా బొమ్మరాశిపేట ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో వాహన తనికీలు చేపట్టారు. అనుమానస్పదంగా వెళ్తున్న మహేంద్రా వాహనాన్ని ఆపి పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేయగా ఆ వాహనంలో 19 క్వింటాళ్ల బియ్యం సుమారుగా 50 సంచుల్లో నింపి తరలిస్తున్నారని తనిఖీల్లో తేలింది. వాహనం డ్రైవర్‌ను విచారించగా నాగయపల్లితాండకు చెందిన బానోత్ సంతోష్ ఏలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని నెరడ్‌మెట్ పరిసరాల్లో కొనుగోలు చేసి మూడుచింతలపల్లి మం డలంలో అమ్ముతున్నాడని ఒప్పుకున్నాడు. ఆర్‌ఐ కుమార్ పిర్యాదు మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి వాహానాన్ని, బియ్యాన్ని స్వాదీనం చేసుకుని సివిల్ సప్లై గోదాముకు తరలించామని తెలిపారు.

## ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణలో ఇటీవల జరిగిన ఖమ్మం, నల్గోండా, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించిన సందర్బంగా మంగళవారం మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు లగిశెట్టి దయానంద్‌పటేల్ ఆదర్యంలో సంఘం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ తాజమాజి సర్పంచ్ సింగం అంజనేయులుపటేల్, మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి క్యాతం రవి, సంఘం మాజి అధ్యక్షుడు సింగం నర్సింగరావు, సంఘం ప్రతినిధులు సింగం పవన్‌కుమార్, సింగం భాస్కర్, సింగం రాకేష్, లగిశెట్టి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ కలెక్టర్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ, కేజీబివి, వసతి గృహాలు గురుకులాల నిర్వహణపై సంక్షేమ అధికారులు, గురుకులాల ప్రిన్సిపాల్‌లు ప్రత్యేక అధికారులచే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా విధినిర్వహణలో ఎన్నో మంచి పనులు చేసే అవకాశం ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకొని మనసుకు సంతృప్తి నిచ్చే విధంగా మనసుపెట్టి పనిచేయాలన్నారు. ప్రభుత్వం వసతి గృహల నిర్వహణలో భాగంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిదేందుకు ప్రభుత్వం ఎంతో డబ్బును వెచ్చిస్తుందని అయినప్పటికి ఉత్తీర్ణత శాతం అనుకున్న స్థాయిలో లేకపోవడం దురదృష్టాకరమని కలెక్టర్ అన్నారు. మనము పోందుతున్న జీతనికి న్యాయం చేస్తున్నామా, పని చేయకపోవడం వల్ల ఈ పిల్లల భావిషత్తును దృష్టిలో పెట్టుకోని పని చేయాలని అధికారులకు హితవు పలికారు. వసతి గృహల్లోని విద్యార్థుల ఉత్తీర్ణత ఈ దఫా 70శాతానికి తగ్గకుండా పని చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగడా ప్రభుత్వ పాఠశాలలు కూడా పోటీ పడాలని ఆయాన అన్నారు. వసతి గృహలు, గురుకుల పాఠశాలకు విద్యార్థులు వ చ్చేసరికి పారిశుధ్య పనులు చేపట్టలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టేందుకు విలుగా గ్రామపంచాయతీ, మున్సిపాలిట సిబ్బంది సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరిద్రరేఖకు దిగువనున్న గ్రామీణ మధ్యతరగతికి చెందిన అత్యంత పేద కుటుంబాల పిల్లలు వసతి గృహల్లో విద్యానభ్యసించే, తల్లిదండ్రుల పాత్రను పోసిస్తూ వారి బాగోగులను చూడల్సిన బాధ్యత కుడా సంబంధి త అధికారులదేనని కలెక్టర్ అన్నారు. షెడ్యుల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం ,ఉపేందర్ , శారద వేంకటేషం తదితరులు పాల్గోన్నారు.

## కాలనీల అభివృద్ధికి పాటుపడతా

### బిఎల్ఆర్ బండారి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** నియోజకవర్గంలో కాలనీల అభివృద్ధికి పాటుపడతానని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం లక్ష్మి ఫ్రైడ్ కాలనీ నూతన కార్యవర్గం ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నూతన కమిటీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగరెడ్డి, ఉపాధ్యక్షులు ఉపేందర్ గౌడ్, నర్సింహారెడ్డి, వీరేశం, ముత్యాలు, వైకుంఠం, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, చిన్నరెడ్డిలను అభినందించారు. కాలనీ అభివృద్ధికి సహకరించాలని ఎంఎల్ఎను కోరారు. సానకూలంగా స్పందించిన ఎంఎల్ఎ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్‌కు జిల్లాలో 10చెక్ పోస్టులు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో బక్రీద్ పండుగా సందర్భంగా శాంతిబద్రతలకు ఎలాంటి విఘతం కల్గకుండా , జంతువులను అక్రమ రవాణా ను అరికట్టుట కొరకు 10చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరగింది అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి మాట్లాడుతూ గోవులు ,లేగదూడల అక్రమ రవాణానను అరికట్టేందుకు వికారాబాద్ ,మోమిన్‌పేట్ ,ధరూర్ చన్గోమల్ ,పరిగి, తాండూర్ ,యాలాల్ మొత్తం 7 దు అంతర్‌జిల్లా చక్‌పోస్టులు , బషీరాబాద్ , కరుణ్ కోట్ , కొడంగల్ పరిధిలోని 3 అంతర్ రాష్ట చెక్ ఫోస్టులు మొత్తం జిల్లాలో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరగింది అని తెలిపారు. పశువుల వ్యాపారులు పశువుల నుక్రయ విక్రయాలలో భగంగా ఖచ్చితంగా గ్రామ పంచాయితీ లేదా మున్సిపలిటి అధికారుల చేత ధృవీకరించిన నశీదులను ఖచ్చితంగా కలిగి ఉండలని పశువుల రవాణాసమయంలో కచ్చితంగా నియమలు పాటించాలని తెలిపారు. పశువులను అక్రమ రవణ చేస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. బక్రీద్ పండుగ కు అక్రమ రవాణా నిషేదం ,అడిషనల్ ఎస్పి రవీందర్‌రెడ్డి / వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పశువులను రవాణాచేసే వ్యక్తులు తప్పని సరిగా నియమ నిబందనలు పటించాలని అన్నారు. పోలీస్ సిబ్బంది ఎక్కడ కుడా నిర్లక్ష్యం చేయకుండా అన్ని వాహనాలను తనిఖీలు చేయాలని అదేశించారు, వికారాబాద్ సిఐ నాగరాజు తదితరులు పాల్గోన్నారు.

## జిల్లా స్థాయిలో కొడంగల్ అభివృద్ధి

### అధికారులో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గ అభివృది దిశగా వెళ్లాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాల్ కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై కడ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతు కొడంగల్‌లో మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని సూచిస్తూ ఆసుపత్రిలో వాటర్ ప్లాంట్, రెండు అంబులెన్స్‌లు, జనరేటర్ అవసరమైన సిబ్బంది కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో రోడ్డు మరియు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా అవసరమైన సింగిల్, డబుల్ రోడ్లతో పాటు గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటి భవనాలు, వంతెనలు, అతిథి గృహాల కోరకు అధికారులు పనులను త్వరితగతిన మొదలు పెట్టాలని అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల , పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణ పనులను కూడా ప్రారంబించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ ద్వారా వ్యవసాయం మరియు డెమోస్టిక్ అవసరాల మేరకు అవసరం అయిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా నియోజకవర్గానికి అవసరమైన సాగునీరు, తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపాదికన అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అందుబాటులో ఉండి ప్రతి పనిని సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అవసరమైన పనులను చేపట్టాలని ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి ఒక్కరికి అందజేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యన్ని వీడాలని రైతులకు సంబందించి ప్రతిది క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అటవి శాఖ అధికారి జ్ఞానేశ్వర్, తాండూర్ ఆర్ డివో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు తదితరులున్నారు.

# సర్కార్ బడుల్లో సౌకర్యాలు మెరుగు

### తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్



**ప్రజాపక్షం / కొడంగల్ :** సర్కార్ బడుల్లో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం బోంరాస్‌పేట మండలంలోని పూర్యానాయక్ తాండ, బాపల్లితాండ, ఎన్కెపల్లి తదితర గ్రామాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలను అందజేసి పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తు 10/10 మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్యను అందజేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ బడులను ప్రాథమికంగా తీసుకోవడంతో పాటు వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం సంతోషమన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో శిథిల్యావస్థకు చేరుకున్న పాఠశాలలను మెరుగు పరుస్తూ అందంగా తీర్చిదిద్దుతు ప్రతి పాఠశాలలో విద్యుత్ కాంతులు, మూత్రశాలలు, మంచినీటి సదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాలలు తెరవకముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వడం విద్యాసంవత్సరానికి ఇది శుభపరిణామమన్నారు. ప్రతి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లీదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తూ గ్రీన్ బోర్డులు, కంప్యూటర్ తరహాలో విజ్ఞాన చదువులు నేర్పించేందకు ప్రభుత్వం కృషి చేస్తు కార్పోరేట్‌కు ధీటుగా చదువులు నేర్పించడమే కాకుండా ఉదయం అల్పహారం, మధ్యాహ్న భోజన సదుపాయాలు కల్పించడం జరగుతుందని అందులో బాగంగా మా వంతుగా కృషి చేస్తామని హామిలు ఇస్తూ విద్యార్థుల సంఖ్యలను పెంచేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, మండల మహిళ సమాఖ్య సభ్యులు, పాఠశాల విద్యాకమిటి సభ్యులు, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు, నాయకులు తదితరులున్నారు.

## మూడు ఎమర్జెన్సీ బృందాల ఏర్పాటు

### పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/ బోడుప్పల్:** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మాన్సూన్ టీమ్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమీషనర్ త్రిళేశ్వర్ రావు, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. వ ర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆ దేశించారు. వరదలతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుం డా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు 3 షిఫ్ట్ ల్లో పనిచేయుటకు 3మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ లను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు, నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చోట సూచిక బోర్డులు, ఓపెన్ నాలాల వద్ద ఫన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజి, కాలువలలో పూడికలు తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జ్యోతి, ఏఈ బిక్షపతి, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్త

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** కొద్ది రోజులుగా రాష్ట్రంలో అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. మరో వైపు ఎండాకాలాన్ని తలపించేలా ఎండలు సైతం కాస్తున్నాయి. ఈ భిన్న పరిణామాలతో ప్రజానీకం వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని నవాబుపేట్ మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ అన్నారు. మంగళవారం ఆయన ప్రజా పక్షం విలేకరితో మాట్లాడుతూ వర్షాకాలంలో కల్తీ ఆహారం, తాగునీరు, మురుగు, దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. మండల ప్రజలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటమే ఈ వ్యాధుల నియంత్రణకు మార్గం అని అన్నారు. వేసవిలో ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు తొలకరి వర్షాలతో ఉపశమనం పొందుతారు. వర్షాకాలం ఎంత ఆహ్లాదాన్నిస్తుందో అంతే ప్రమాదకరం కూడా! వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే.. రోగాలు దాడి చేస్తాయి. మలేరియా, టైఫాయిడ్, కలరా వంటి సీజనల్ వ్యాధులు వేధిస్తాయి. ఈ సీజన్‌లో పిల్లల నుంచి పెద్దల వరకూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలి అన్నారు. సాధారణంగా వర్షంలో తడిస్తే చిన్నారులు రొంప, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతుంటారు. వెంటనే వైద్యులను సంప్రదిస్తే సులభంగా తగ్గించుకోవచ్చు అని అన్నారు. వర్షాలకు విజృంభిస్తున్న దోమలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాలువల్లో ఆయిల్‌బాల్స్, మలాథీయాన్, బయోటెక్స్ వంటి వాటిని చల్లించాలి. తరచూ బ్లీచింగ్ చల్లించటం మంచిది. ఓవర్ హెడ్ ట్యాంకులనుశుభ్రంచేయించుకోవాలి. రక్షిత మంచినీటినే తాగాలి అన్నారు.

## సుస్థిరమైన సమాజాభివృద్ధే ధ్యేయంగా అవగాహన ఒప్పందం

### నల్సార్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సమాజంలో క్షేత్రస్థాయిలో వివాదాలు, సంఘర్షణలను చర్చలు, సంబాషణల ద్వార పరిష్కారం చేసుకోవడం దాని ద్వార స్వపరిపాలన కోసం స్థానిక సముదాయాల సామర్థ్యాన్ని సమాజాభివృద్ధిని పెంపొందించడమే ధ్యేయంగా క్షేత్ర ఫౌండేషన్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. మంగళవారం శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, క్షేత్ర ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం మరియు క్షేత్ర ఫౌండేషన్ ఫర్ డైలాగ్‌లు ఈ రోజు సంఘర్షణ పరివర్తన, సహకార పద్దతుల ద్వార సమస్యల పరిష్కారానికి సముదాయాల సామర్థ్యాల వికాసానికి తగిన పరిస్థితులను రూపొందించేందుకు విద్యాపర సహాకారం అనే అంశంపై ఐదు సంవత్సరాల పరస్పర సహకార విద్యా సంబంధ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశామన్నారు. సామాజిక సముదాయాలలో సమస్యల పరిష్కారానికి ఒక సమగ్ర పద్దతి అవసరం అనే అవగాహన నుంచి ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని చెప్పారు. సమాజంలోని వివిధ బృందాలను, పాలనా సంస్థలను వివిద వ్యవహారాలు నడపుకునే సంస్థలను ఏకతాటిపైకి తీసుకరావడం ద్వార సంభాషణలతో సానుకూల మార్పులు తీసుకవచ్చి సామాజిక సంఘర్షనలను నివారించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని అన్నారు. క్షేత్ర సంస్థతో నల్సార్ బాగస్వామ్యం ఇక్కడి విద్యార్థులకు మరియు స్థానిక సముదాయాలకు నడుమ నిరంతరం సంవాదం నెరిపే శక్తినిస్తుందన్నారు. గ్రామీణ సముదాయాల స్థాయిలో అభివృద్ధికి అనుకూలమైన మార్పులను ప్రోత్సహిస్తుందన్నారు. ఇది న్యాయ విద్యను విద్యార్థులకు సముదాయాలతో పనిచేసే నేర్పును, వివాద పరిష్కారాల మేళకువలను తెలుసుకునే అవకాశాన్ని ఇస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సంస్థ ప్రధాన కార్య నిర్వహణ అధికారి(సిఈవో) డాక్టర్ కృష్ణ ఉదయశంకర్, రోహిణినీలేకని ఫిలాంత్రోపిస్ అసోసియేట్ డైరక్టర్ నటాషా జోషి పాల్గొన్నారు

# తలసాని శంకర్ యాదవ్‌కు కన్నీటి వీడ్కోలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీమంత్రి, సనత్ నగర్ ఎంఎల్ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అసోసియేషన్ అద్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి బన్సీలాల్ పేట లోని స్మశాన వాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలను పూర్తి చేశారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని రాధికా కాలనీలో గల శంకర్ యాదవ్ నివాసం వద్ద నుండి ప్రారంభమైన అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బందువులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు అధికారులు వేలాది సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తెల్లవారుజామున మరణించగా మంగళవారం నాడు కుటుంబ సభ్యులు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నీ తానై అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పర్యవేక్షించారు. తన అన్న పార్థీవ దేహాన్ని చూసి ఆయన పలు మార్లు కన్నీటి పర్యంతమైనారు, అది చూసిన వారు సైతం కంట నీరు పెట్టారు. అంతిమయాత్ర మోండా మార్కెట్ కు చేరుకున్న సమయంలో మోండా మార్కెట్ లోని పలువురు వ్యాపారులు, మహిళలు శంకర్ యాదవ్ కు నివాళులు అర్పించారు. తమకు అన్ని వేళలా అండగా ఉండే శంకర్ అన్న మరణించాడనే వార్తను నమ్మలేకపోతున్నామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎదుట కన్నీటి పర్యంతమైనారు. అంతిమయాత్రకు ముందు రాధికా కాలనీలోని నివాసంలో తలసాని శంకర్ యాదవ్ పార్థీవ దేహానికి పలువురు నివాళులు అర్పించారు. ఎంఎల్ఎ లు మల్లారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, వివేక్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు శంకర్ యాదవ్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు.

**అంతిమయాత్రలో పాల్గొన్న కెటిఆర్:** తలసాని శంకర్ యాదవ్ అంతిమయాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు మాజీ మంత్రి కె.తారక రామారావు, బన్సీలాల్ పేట గ్రేవ్ యార్డ్ వరకు సాగిన అంతిమయాత్రలో పాల్గొని శంకర్ యా దవ్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించారు. అంతిమయాత్రలో కెటిఆర్‌తో పాటు మాజీమంత్రులు జగదీశ్వర్ రెడ్డి, మహమూద్ అలీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్ఎలు పాడి కౌశిక్‌రెడ్డి, దానం నాగేందర్, మాజీ ఎంఎల్ఎ లు జైపాల్ యాదవ్, అం జయ్య యాదవ్, మాజీ కార్పోరేషన్ చైర్మన్ లు ఎర్రోల్ల శ్రీనివాస్, అనిల్ కుమార్ కూర్మాచలం, చిరుమళ్ళ రాకేశ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్వే సత్యానారాయణ, రోహన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

## కారులో చెలరేగిన మంటలు



**ప్రజాపక్షం/ శామీ-ర్‌పేట:** శామీర్‌పేట ఔటర్ రింగ్‌రోడ్డుపై ఓ కారులో మంటలు చెలరేగడంతో కారు దగ్ధమైన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి డిచ్‌పల్లికి వెళ్తున్న కారులో శామీర్ పేట ఓఆర్‌ఆర్ వద్దకు రాగానే కారులో నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో కారులో ఉన్న వ్యక్తులు కారు దిగి బయటకు వచ్చారు. పొగలు తీవ్రమవడంతో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్గమైంది. ఫైర్‌స్టేషన్‌కు స్థానిక పోలీసులు సమాచారమివ్వడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఏలాంటి నష్టం వాటిల్లలేదని బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# క్రీడ

## ఇండియా x మినీ ఇండియా...

### గెలిస్తే సూపర్-8కు..!

ఆతిథ్య హోదాలో తొలిసారి టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న పసికూన అమెరికా జట్టుపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. మహా అయితే ఆ జట్టు లీగ్ దశలో ఒక మ్యాచ్ గెలుస్తుందని భావించారు. కానీ, అమెరికా జట్టు అంచనాలకు మించి రాణిస్తోంది. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సూపర్8లో రేసులో ముందుంది. మాజీ ఛాంపియన్ పాకిస్థాన్‌పై సంచలన విజయం సాధించిన అమెరికా ఇప్పుడు టీమ్‌ఇండియాతో మ్యాచ్‌కు సై అంటోంది. బుధవారం న్యూయార్క్ వేదికగా భారత్‌తో తలపడనుంది. పాకిస్థాన్‌ను సూపర్ ఓవర్‌లో ఓడించి మంచి ఊపు మీదున్న యుఎస్ఎ.. భారత్‌తో జరిగే మ్యాచ్‌లోనూ గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. అమెరికా జట్టులో భారతి సంతతి ఆటగాళ్లు ఉండడంతో మ్యాచ్ కాస్త ఇండియా వర్సెస్ మినీ ఇండియాగా మారిపోయింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు హ్యాట్రిక్ సాధించడంతోపాటు సూపర్8 బెర్తును ఖాయం చేసుకుంటుంది.



**వీళ్లతో ముప్పు.. అమెరికాకు అది ప్లస్ పాయింట్!**

పేరుకు అమెరికా జట్టే అయినా అందులో చాలా మంది భారత సంతతి ఆటగాళ్లే. వారే ఇప్పుడు జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. భారత సంతతి ఆటగాళ్లయిన కెప్టెన్ మోనాంక్ పటేల్‌తోపాటు బౌలర్లు సౌరభ్ నేత్రావాల్కర్, హర్మీత్‌సింగ్, జస్‌దీప్ సింగ్, నితీశ్‌కుమార్‌తో టీమ్‌ఇండియా జాగ్రత్తగా ఉండాల్సిందే. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారత్‌కు షాక్ తప్పదు! పాకిస్థాన్‌పై మోనాంక్ పటేల్ అర్ధ శతకం బాదాడు. ఇక ఆ జట్టులోని ఆరోన్ జోన్స్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. కెనడాపై 94 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ ఆండ్రీస్ గౌస్ ఇదే మ్యాచ్‌లో అర్ధశతకం బాదాడు. పాక్‌తో మ్యాచ్‌లోనూ వీరిద్దరూ రాణించారు. వీరికి అడ్డుకట్ట వేయడానికి భారత్ ప్రణాళికలు రచించాలి. డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఆడిన అనుభవం అమెరికా బ్యాటర్లకు ఉంది. అందుకే వారు ఈజీగా రన్స్ చేస్తున్నారు. ఆ పిచ్‌లపై ఇతర జట్ల ఆటగాళ్లు మాత్రం బాగా పరుగులు రాబట్టడానికి కష్టపడుతున్నారు. అమెరికా స్పిన్నర్ నోస్తుష్ కెంజిగేతో భారత బ్యాటర్లు జాగ్రత్తగా ఉండాల్సిందే. పాక్‌పై అతడు మూడు వికెట్లు పడగొట్టాడు.

**ఆ ఇద్దరూ ఫామ్ అందుకోవాలి:** ఐర్లాండ్‌పై సునాయసంగా నెగ్గిన రోహిత్ సేన.. పాకిస్థాన్‌తో జరిగిన స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌లో నిరాశపర్చినా.. బౌలర్లు అదరగొట్టడంతో 120 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకుంది టీమ్‌ఇండియా. ఈ విజయంతో టీమ్‌ఇండియాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. న్యూయార్క్‌లో రెండు మ్యాచ్‌లు ఆడటంతో అక్కడి పరిస్థితులపై మన జట్టుకు అవగాహన ఏర్పడింది. విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబె ఆడిన రెండు మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. భారత్ సూపర్8 చేరడం దాదాపు ఖాయమవడంతో వీరిద్దరూ ఫామ్‌ను అందిపుచ్చుకోవాల్సిన అవసరముంది. బౌలింగ్‌లో హార్దిక్ పాండ్య, బుమ్రా కీలకం కానున్నారు. అలసత్వం లేకుండా సమష్టిగా రాణిస్తే అమెరికాపై భారత్ విజయం నల్లేరు మీద నడకే. మరో విషయం ఏంటంటే భారత్, అమెరికా మధ్య జరుగుతున్న మొదటి క్రికెట్ మ్యాచ్ ఇదే.

**తుది జట్లు అంచనా:** భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, సంజు శాంసన్, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్.

**అమెరికా:** స్టీవెన్ మోనాంక్ పటేల్ (కెప్టెన్, వికెట్ కీపర్), ఆండ్రీస్ గౌస్, ఆరోన్ జోన్స్, నితీశ్ కుమార్, కోరె అండర్సన్, హర్మీత్ సింగ్, జస్‌దీప్ సింగ్, నోస్తుష్ కెంజిగే, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్.

## ఆ ప్లేయర్స్ క్యాన్సర్ లాంటోళ్లు'

### వారుంటే పాక్ గెలవదు: మాజీ చీఫ్ సెలెక్టర్



టీ20 ప్రపంచకప్ 2024లో ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆరు పరుగుల తేడాతో ఓడిపోయింది. 120 పరుగుల లక్ష్య ఛేదనలో తొలుత గెలిచేలా కనిపించిన పాక్.. భారత బౌలర్లు పుంజుకోవడంతో వేగంగా పరుగులు చేయలేక వెనకబడిపోయింది. ఈ మ్యాచ్‌లో ఓటమి అనంతరం పాకిస్థాన్ మాజీ చీఫ్ సెలెక్టర్ మహ్మద్ వసీం తమ జట్టులోని ఆటగాళ్లపై కీలక వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్ ఆడుతున్న పాక్ బౌలింగ్ ఆల్‌రౌండర్, స్పిన్నర్ ఇమాద్ వసీం మోకాలి గాయాన్ని దాచిపెడుతున్నాడని మాజీ చీఫ్ సెలెక్టర్ ఆరోపించాడు. పక్కటెముక గాయం కారణంగా అమెరికాతో మ్యాచ్‌కు దూరంగా ఉన్నట్లు ఇమాద్ వసీం పేర్కొన్నాడు. అయితే ఇది ఫేక్ అని, అతడు కొన్నాళ్లుగా మోకాలి గాయంతో బాధపడుతున్నాడని మహ్మద్ వసీం వ్యాఖ్యానించాడు. 'పక్కటెముకకు గాయం కారణంగా అమెరికాతో మ్యాచ్‌లో ఇమాద్ వసీం ఆడలేదని వార్తలొచ్చాయి. కానీ, అతడు మోకాలి గాయంతో బాధపడుతున్నాడు. గత కొన్నేళ్లుగా ఈ విషయాన్ని దాచిపెడుతున్నాడు. ఆజం ఖాన్ ఫిట్‌గా లేడు. గత ఐదేళ్లుగా ఇదే సమస్యతో బాధ పడుతున్నాడు. ఈ కారణంగానే అతడిని జట్టు నుంచి తప్పించారు. నేను కూడా నా పదవీకాలంలో ఇమాద్ వసీంను తొలగించాను. దీంతో అతడు ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవడంపై దృష్టిపెట్టాడు. ఆటగాళ్ల పేర్లు ప్రస్తావించను గానీ, కొంతమంది ప్లేయర్స్ జట్టును క్యాన్సర్‌లా పట్టిపీడిస్తున్నారని పాక్ కోచ్‌లు నలుగురు నమ్ముతున్నారు. వాళ్లు జట్టులో ఉంటే పాక్ విజయం సాధించదు. ఆ ఆటగాళ్లను తప్పించడానికి నేను ప్రయత్నించా. కానీ, మేనేజ్‌మెంట్ వారిని తిరిగి జట్టులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది'' అని పాక్ మాజీ సెలెక్టర్ వ్యాఖ్యానించాడు. ఈ టీ20 ప్రపంచకప్‌లో పాక్ పరిస్థితి ఘోరంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. కెనడా, భారత్ చేతిలో ఓడింది ఆ జట్టు. గ్రూప్ దశలో ఐర్లాండ్ అమెరికాతో మ్యాచ్‌లు ఆడాల్సిఉంది. ఈ రెండింటిలో నెగ్గినా పాక్ సూపర్8 అర్హత సాధిస్తుందని కచ్చితంగా చెప్పలేం.



# రీల్

### ఏపి నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం..

## స్టేట్ గెస్ట్‌గా చిరంజీవి

ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టిడిపి జనసేన బీజేపీ కూటమి, రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యింది. ఈ క్రమంలో నేడు జరిగిన ఎన్డీయే కూటమి సమావేశంలో ఎన్డీయే శాసనసభ పక్ష నేతగా టిడిపి చీఫ్ నారా చంద్రబాబు నాయుడుని ఎన్నుకున్నారు. దీంతో రేపు ఆయన ఏపీ రాష్ట్ర నూతన సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయనతో పాటు ఇతర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోదరుడు, మెగాస్టార్ చిరంజీవికి స్టేట్ గెస్ట్ గా ప్రత్యేక ఆహ్వానం పంపారు చంద్రబాబు. ఈ ఆహ్వానం మేరకు చిరంజీవి నేడు సాయంత్రం ప్రత్యేక విమానంలో విజయవాడకు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలక బేగంపేట విమానాశ్రయం నుండి బయలదేరి విజయవాడకు చేరుకుంటారు.

### పూజా కార్యక్రమాలతో

## రవితేజ 75వ చిత్రం



మాస్ రాజా రవితేజ నటిస్తున్న 'మిస్టర్ బచ్చన్' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తుండటంతో ఈ మూవీ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక రవితేజ తన కెరీర్లోని మైల్‌స్టోన్ 75వ సినిమాను ఇప్పటికే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను భాను బోగవరపు డైరెక్ట్ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఈ సినిమాను పూజా కార్యక్రమంతో తాజాగా ప్రారంభించారు చిత్ర యూనిట్. ఔట్ అండ్ ఔట్ కామెడీ మాస్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో హీరో రవితేజతో పాటు అందాల భామ శ్రీలీల కూడా హాజరయ్యారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఇక ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి మొదలుపెడుతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి వచ్చే సంక్రాంతి కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సినిమాలోని మిగతా క్యాస్టింగ్ గురించిన వివరాలు త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు.

## నాని పాన్ ఇండియా ఫిల్మ్

సరిపోద శనివారంలో సూర్య పాత్రలో మునుపెన్నడూ చూడని ఇంటెన్స్ పవర్‌ప్యాక్డ్ క్యారెక్టర్లో కనిపించనున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ అడ్రినలిన్తో కూడిన యూనిక్ అడ్వంచర్‌ని భారీ కాన్వాస్తో హై బడ్జెట్‌తో డివివి ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్ర స్తుతం సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. తాజా గా మూవీ టీం మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేసింది. సరిపోదా శని వారం ఫస్ట్ సింగిల్ జూన్ 15 రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. జేక్స్ బిజోయ్ ఈ సినిమా కోసం అద్భుతమైన ఆల్బమ్ కంపోజ్ చే శారు. మేకర్స్ రిలీజ్ చేసిన అనౌన్స్ మెంట్ వీడియోలో నాని స్లో మోషన్ లో నడుచు కుంటూ వచ్చి క్లాత్ ని తొలగించాక టేప్ రికార్డ్ రివిల్ కావడం, పవర్ ప్యాక్డ్ మ్యూజిక్ విని పించడం చాలా క్రియేటివ్, ఇంట్రస్టింగ్‌గా వుంది. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఎస్జే సూర్య కీలక పాత్రలో కనిపించను న్నారు. మురళి జి డివోపీగా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్.





## ప్రియాంక గాంధీ పోటీ చేసుంటే మోదీ ఓడిపోయేవారు

### 3లక్షల తేడాతో గెలిచేవాళ్ళం : రాహుల్‌గాంధీ

**రాయ్‌బరేలీ :** ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుండి తన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేసినట్లయితే, ప్రధాని నరేంద్ర మోదీ రెండు, మూడు లక్షల తేడాతో ఓడిపోయేవారని కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ అన్నారు. రాయ్‌బరేలీలో ధన్యవాద్ యాత్రలో భాగంగా మంగళవారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగిస్తూ రాయ్‌బరేలీ, అమేథీ, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఇండియా కూటమి పార్టీలు ఐక్యంగా పోరాడాయని, ఫలితంగా పార్లమెంటులో బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఏ బలం తగ్గిందన్నారు. తాను, తమ పార్టీ ఎంపిలు అహంకారం బారిన పడబోమని, ప్రజల సమస్యలపై పని చేస్తామని హామీ ఇచ్చారు. రామ మందిర ప్రారంభం సందర్భంగా సామాన్య ప్రజలను పట్టించుకోకుండా, పెద్ద పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులకు మాత్రమే మోదీ ప్రాధాన్యత ఇచ్చారని, దీంతో అయోధ్యలో బిజెపిని ఓడించి ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు.

### అమేథీ, రాయ్‌బరేలీ విజయాలు చారిత్రాత్మకం : ప్రియాంక

అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ విజయం చారిత్రాత్మకమని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఈ విజయం ఘనత కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తల మధ్య ఐక్యతదేనని చెప్పారు. రాయ్‌బరేలీ, అమేథీలో ధన్యవాద్ యాత్రలో ఆమె పాల్గొని ప్రసంగించారు.

## జైళ్లో ఉన్న జార్ఖండ్ మంత్రి రాజీనామా

**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ కేసులో జైలులో ఉన్న జార్ఖండ్ మంత్రి ఆలంగిర్ ఆలం మంగళవారం నాడు తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అలాగే కాంగ్రెస్ శాసనసభా పక్ష (సిఎల్‌పి) నేత పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ మేరకు జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్‌కు రాంచీలోని బిర్సాముండా సెంట్రల్ జైలు నుండి రాజీనామా లేఖను పంపించారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేకు రాసిన మరో లేఖలో జార్ఖండ్ సిఎల్‌పి నేత పదవికి రాజీనామాను సమర్పిస్తున్నట్లు తెలియజేశారు. తనకు సిఎల్‌పి నేతగా పని చేసేందుకు ఇప్పటి వరకు అవకాశం కల్పించినందుకు పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. సుమారు రూ.32 కోట్ల నగదు ఆలంగిరి ఆలం పని మనిషి ఇంట్లో దొరకడానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మే 15న ఆయనను అరెస్టు చేసింది.

## రాజ్యసభలో 10 ఖాళీలు

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసింది. దేశంలో కొత్త ప్రభుత్వ కూడా ఏర్పాటయింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు కొందరు పోటీ చేసి విజయం సాధించారు. దీంతో రాజ్యసభలో 10 స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ అసోం, బీహార్, మహారాష్ట్రలో రెండు చొప్పున, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురలో ఒకటి చొప్పున ఖాళీ అయినట్లు రాజ్యసభ సచివాలయం వెల్లడించింది. రాజ్యసభ సభ్యులైన కామఖ్య ప్రసాత్ టస, సర్బానంద సోనోవాల్ (అసోం), మిషా భారతి, వివేక్ ఠాగూర్ (బీహార్), దీపేందర్‌సింగ్ హుడా (హర్యానా), జ్యోతిరాధ్యి సింధియా (మధ్యప్రదేశ్), ఉదయన్‌రాజే భోన్స్లే (మహారాష్ట్ర), పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), కెసి. వేణుగోపాల్ (రాజస్థాన్), బిప్లవ్ కుమార్ దెబ్ (త్రిపుర)లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. వీరి స్థానంలో మరొకరిని భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ త్వరలో షెడ్యూల్‌ను ప్రకటించనుంది.

## చైనాతో కొన్ని సమస్యలున్నాయ్

### కేంద్ర విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జైశంకర్
### పలువురు మంత్రుల బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ :** చైనాతో సంబంధాల విషయంలో ముందుకు సాగుతామని విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ అన్నారు. విదేశాంగ మంత్రిగా రెండవసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చైనాతో సరిహద్దుకు సంబంధించి కొన్ని అంశాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చైనాతో మిగిలిపోయిన అంశాలను ఎలా పరిష్కరించాలనే దానిపైనే మా దృష్టి అంతా ఉందని చెప్పారు. రెండు రోజుల క్రితం ప్రమాణ స్వీకారంచ చేసిన పలువురు కేంద్ర మంత్రులు మంగళవారం నాడు ఢిల్లీలోని తమ మంత్రిత్వ కార్యాలయాలలో బాధ్యతలను స్వీకరించారు. వారిలో బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా కేంద్ర ఆరోగ్య, రసాయనాలు, ఎరువుల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిగా అశ్విని వైష్ణవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ అధికారులతో పాటు ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్యదర్శి సంజయ్ జాజు కూడా హాజరయ్యారు. సిబ్బంది, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్‌ల శాఖ సహాయ మంత్రిగా జితేంద్ర సింగ్ నార్త్ బ్లాక్‌లోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ మంత్రిత్వ శాఖ మోదీ వద్ద ఉన్నది. కమ్యూనికేషన్‌ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ భారతీయ టెలికాం, పోస్టల్ రంగాలు అంతర్జాతీయంగా, స్థానికంగా కీలక పాత్ర పోషించాల్సి ఉన్నాయన్నారు. తన గతంలో 2007,2008, 2009లో ఈ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా పని చేశానని, తనకు వీటితో భావోద్వేగ బంధం ఉన్నదని వ్యాఖ్యానించారు.

**పార్లమెంటులో అందరినీ కలుపుకుపోతాం :** కిరణ్ రిజిజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ పార్లమెంటు సజావుగా నడిచేందుకు అందరిని కలుపుకొని వెళ్తామని చెప్పారు. సంఖ్యా బలం ఆధారంగా ఒకరినొకరు అనుకోవాల్సిన అవసరం లేదన్నారు. పార్లమెంటు బైట భుజబలాన్ని ఉపయోగించవచ్చు కాని లోపల మంచి చర్చ కోసం వాక్ శక్తిని వినియోగించాలని అన్నారు. ఇంకా మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా అన్నపూర్ణ దేవి, సాంస్కృతిక శాఖ మంత్రిగా గజేంద్ర సింగ్ షెకావత్‌లు కూడా తమ మంత్రిత్వ బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఇంకా హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిగా , బిజెపి గుజరాత్ అధ్యక్షుడు చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ జల్ శక్తి మంత్రిగా, భూపేంద్ర యాదవ్ పర్యావరణ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎల్‌జెపి(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ కూడా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రిగా తన తల్లి, కుటంబసభ్యుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

## హత్యకేసులో.. ప్రముఖ నటుడు అరెస్టు

**బెంగళూరు:** ఒక హత్యకేసులో ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీప అరెస్టయ్యారు. మంగళవారం మైసూరులో ఆయనతో పాటు మరో పది మందిని బెంగళూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు తరలించి విచారిస్తున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జూన్ 8న రేణుకాస్వామి అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో దర్శన్‌పై ఆరోపణలు వచ్చాయి. విచారణలో భాగంగా నిందితుడు దర్శన్ పేరు వెల్లడించారని చెప్పారు. అతడితో నటుడు నిరంతరం టచ్‌లో ఉండేవాడని తెలుస్తోంది. దాంతో దర్యాప్తు నిమిత్తం ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. మృతుడు ఒక సినీనటికి అసభ్యకరమైన సందేశాలు పంపినట్లు తెలిసింది. ఆ నటిని కూడా ప్రస్తుతం అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆర్ఆర్ నగర్‌లోని దర్శన్ ఇంటి వద్ద పోలీసులు భద్రతను పెంచారు. 2002లో మాజెస్టిక్ చిత్రంతో కథానాయకుడిగా తన ప్రయాణం మొదలుపెట్టిన ఆయన.. తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షాకాదరణ సొంతం చేసుకున్నారు. గతంలో పలుమార్లు వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు.

## రైతు మరణాలకు కారకుడైన శివరాజ్‌కు వ్యవసాయశాఖా?

### ఎఐకెఎస్ ఖండన

**న్యూఢిల్లీ :** శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయ మంత్రిత్వశాఖ కేటాయించడాన్ని అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించింది. ఆందోళన సందర్భంగా మధ్యప్రదేశ్‌లో ఆరుగురు రైతులను పోలీస్‌చర్యలో చంపిన మాండ్‌సౌర్ ఘటనకు బాధ్యుడైన శివరాజ్‌సింగ్‌కు కేంద్ర వ్యవసాయమంత్రిత్వశాఖ ఇవ్వడం క్షంతవ్యం కాదని మంగళవారంనాడు ఎఐకెఎస్ ఒక ప్రకటనలో విమర్శించింది. ప్రధానమంత్రి కిసాన్ నిధికి సంబంధించిన 17వ వాయిదాను విడుదల చేయడం కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేనని విమర్శించింది. 159 గ్రామీణ నియోజకవర్గాలలో ఓటమిపాలైనప్పటికీ కూడా బిజెపి తన కళ్ళు తెరచుకోలేదని విమర్శించారు. ''శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను వ్యవసాయశాఖామంత్రిగా ఎంపిక చేయడాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండిస్తున్నది, ఆయన పరిపాలనలోనే మాండ్‌సౌర్‌లో 2017 జూన్ 6వ తేదీన ఆరుగురు రైతులు పోలీసు చర్యలో హతులయ్యారు'' అని ఆ ప్రకటనలో విమర్శించింది. స్వామినాథన్ కమిషన్ నివేదిక సి2ప్లస్ 50 శాతం ప్రకారం కనీస మద్దతు ధర చెల్లించాలని రైతులు కోరుతున్నారనీ, పండించిన పంటలను కచ్చితంగా సేకరించి తీరుతామన్న హామీ ఇవ్వడం న్యాయబద్ధమైన విషయమని పేర్కొంది. సంయుక్త కిసాన్ మోర్చా ప్రధాన డిమాండ్లలో ఇది కూడా ఒకటి. రైతుల రక్తంతో చేతులు తడిసిన వ్యక్తికి వ్యవసాయ మంత్రిత్వశాఖ అప్పగించడం నైతికంగా గర్హనీయమైనవిషయమని ఎఐకెఎస్ విమర్శించింది. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా రైతులకు వ్యతిరేకంగా వారి బాధలను పట్టించుకోకపోవడానికి, వారి ఆలోచనా ధోరణికి ఒక చిహ్నమని విమర్శించింది. 2017 జూన్ నెలలో ఆరుగురు రైతులు మధ్యప్రదేశ్ మాండ్‌సౌర్‌లో పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీసు దళాల చర్యకు బలయ్యారు. గతంకంటే చాలా బలహీనపడిపోయిన బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పటికే రైతు వ్యతిరేక ప్రభుత్వమని రుజువు చేసుకుందని పేర్కొంది. రైతులకు వాయిదాను విడుదల చేయడాన్ని మోదీ అనుకూల మీడియా అతిపెద్ద ఘటనగా చిత్రీకరిస్తున్నదని విమర్శించింది. రైతు ఖాతాల్లోకి రూ.2000 ప్రత్యక్ష నగదు బదిలీ కంటి తుడుపు చర్య అని విమర్శించింది. ఇది పాత పథకానికి కొనసాగింపు మాత్రమేనని ఎఐకెఎస్ విమర్శించింది. నెలకు రైతుకు రూ.500లు ఇవ్వడం స్థూలంగా అరకొర చర్యేనని,ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల ప్రకారం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు సంపాదించుకోవడం రైతులకు ఉన్న హక్కు అని ఎఐకెఎస్ ఉద్ఘాటించింది. 2019లో దేశంలో ఉన్న 14.50 కోట్లమంది రైతులకు పిఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారనీ, కానీ ఈనాడు ఈ పథకం కేవలం 9.30 కోట్లమంది రైతులకు మాత్రమే పరిమితమైపోయిందని ఎఐకెఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. బిజెపి మొన్న ఎన్నికల్లో కోల్పోయిన 63 స్థానాలలో 60 స్థానాలు గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవేనన్నారు. ఈ ఘనత రాజస్థాన్‌లోని సికార్‌కు చెందిన అమ్రరామ్, బీహార్‌కు చెందిన కరాకత్ నుండి రాజజారామ్ సింగ్, సుధామ ప్రసాద్, తమిళనాడు దిండిగల్ నుండి సచ్చిధానందన్ సహా సంయుక్త కిసాన్ మోర్చా దే నని పేర్కొంది. ఎన్‌డిఎ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎన్నికల్లో తీర్పు చెప్పారని ఎఐకెఎస్ స్పష్టం చేసింది.

## ఢిల్లీకి కరెంట్ కష్టాలు

### యుపి పవర్‌గ్రిడ్‌లో అగ్నిప్రమాదం..



**న్యూఢిల్లీ :** హీట్‌వేవ్, నీటి సంక్షోభంతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న దేశ రాజధాని ఢిల్లీపై మరో పిడుగు పడింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీగా కరెంట్ కోతలను ఎదుర్కొంటోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మండోలాలోని పవర్ గ్రిడ్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో ఢిల్లీ వాసులకు ఈ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. నగరానికి ఈ గ్రిడ్ నుంచి 1500 మెగావాట్ల ఎలక్ట్రిసిటీ సరఫరా అవుతుంది. ఈ అగ్ని ప్రమాదం గురించి ఢిల్లీ మంత్రి ఆతిశీ వెల్లడించారు. ''మధ్యాహ్నం 2 గంటల తర్వాత నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో కరెంట్ కోతలు ఉన్నాయి. దేశంలో విద్యుత్ సరఫరా కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణలో ఉంది కాబట్టి.. విద్యుత్ శాఖ కొత్త మంత్రి అపాయింట్‌మెంట్ కోరతాను. జాతీయ స్థాయిలో ఇలా ఒక గ్రిడ్ విఫలం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ గరిష్ఠ వినియోగం 8000 మెగా వాట్లకు చేరుకున్న సమయంలో కూడా పవర్‌కట్ లేదు. జాతీయస్థాయిలో మౌలిక సదుపాయాల వైఫల్యం వల్లే ఈ పరిస్థితి వచ్చింది'' అని కేంద్రాన్ని విమర్శించారు. పలు అంశాలపై కేంద్రం నియమించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ఆప్ ప్రభుత్వం మధ్య ప్రతిష్ఠంభన నెలకొంది. ఇటీవలే నీటి సంక్షోభంపై రెండువర్గాలు విమర్శలు చేసుకున్నాయి. ఢిల్లీ ప్రజలపై హర్యానా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ఆతిశీ ఆరోపించిన సంగతి తెలిసిందే. దానిలో భాగంగానే నీరు విడుదలను తగ్గించిందన్నారు. నగరం నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో రాజకీయాలు చేయకూడదని, మిగులు జలాలను సరఫరా చేయాలని సుప్రీంకోర్టు హరియాణాను ఆదేశించిన సంగతి తెలిసిందే.